ఆంధ్రసచిత్రవార


పత్రిక



11-6-
30పై



'ప్రచండభైరవి'లో రాజసులోచన.



నైజాం: ఉషా పిక్చర్స్, సికింద్రాబాద్. సీడెడ్: శారదా మూవీస్, బెంగుళూరు. ఆంధ్ర ఏరియా: సరస్వతి పిక్చర్స్, విజయవాడ.

మనలో మాట

అణ్వస్త్రాలతో యుద్ధం వస్తే ఎలా వుంటుందో వూహించలేకపోయినా, తెలిసికోవాలనే వుత్సాహం మాత్రం చాలా మందికి వుండొచ్చు. ఇదే విషయాన్ని గురించి బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌వారు చిత్రాన్ని తయారు చేశారు. వివరాలను సచిత్రంగా 6, 7 పేజీలలో చూడవచ్చును.

* * *

ఎవరెస్టు శిఖరారోహణ చరిత్రను గురించి చిన్న వ్యాసం వేద్దామనే అనుకొన్నాం. ఇంతలో ఆ బృందం నాలుగోసారి కూడా విజయాన్ని సాధించినట్లు వార్తలు వెలువడ్డాయి. సాధ్యమయినంత త్వరలో అన్ని వివరాలని అందించే పెద్ద వ్యాసమే వేస్తాము.

* *

ఇదే పేజీలో కనిపించే ప్రకటన ఒకటి మా పాఠకులకు ఆసక్తి కలిగించగలదని అనుకొంటున్నాము.

* *

కొత్త సీరియల్‌ను ప్రారంభించటానికి సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. రెండు, మూడు వారాలలో మొదలెట్టగలం. సీరియల్ రచయిత్రి పాఠకులకు సుపరిచితురాలే. వివరాలు వచ్చే సంచికలో చూడవచ్చు.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 11-6-'65
విశ్వావసు నామ సం|| జ్యేష్ఠ మాస శుద్ధ త్రయోదశి
సంపుటము : 57 సంచిక . 41

స్థాపితము
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

చందా వివరాలు

ఇండియా రూ. 15.60. ఇతర దేశాలకు ఓడమీద (Sea Mail) రూ. 28.60. విమానం ద్వారా (Air Mail) బ్రిటన్, జర్మనీ ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు: రూ. 120.00. అమెరికా రూ. 176.80. ఆస్ట్రేలియా రూ. 148.20.

విడిప్రతి 30 పై.
సంవత్సర చందా 15.60 పై.
6 మాసాల చందా 7.80 పై.

విషయానుక్రమణిక

ముఖచిత్రం : "సింగపూర్ సి. ఐ. డి." లో సరోజాదేవి.

కథలు :

ప్రశ్న — 12
బాధ — 32

సీరియల్ కథలు :

[illegible] — 24

శీర్షికలు : వ్యాసాలు: సినిమా.

ఉత్తరాలు — 5, అణ్వస్త్రాలతో యుద్ధం జరిగితే — 6, మ్యాడర్లి లేఖ — 8, ఊ. వ్ కార్ట్యాన్ — 11, వారఫలం — 17, వనితాలోకం — 20, వంటలు — 21, భజరంగభలి — 30, వేల్పులకైనా మార్పులు తప్పవు — 40, వైజ్ఞానిక గాధావళి, బాల సాహితి—43, చిత్రసమీక్ష—45, ప్రేమా, పురుషులూ, నేనూ—46, చిత్రలహరి—49, [illegible] — 55,

వచ్చే వారం :

యద్దనపూడి
సులోచనారాణిగారి
పెద్దకథ

★

'ప్రేమ'

★

ఒకే సంచికలో!

ఉత్తరాలు

న్యూఢిల్లీ లేఖ

న్యూఢిల్లీ లేఖలో ఒకచోట రైల్వేమంత్రి శ్రీ హెచ్. ఎం. పటేలు తమ అరవైయవ జన్మదినోత్సవ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని వాస్తవాలను బహిర్గతం చేశారని నేను మీ పత్రికలో చదివేను రైల్వేమంత్రి, ఎస్. కె. పాటిల్ అని అందరికీ తెలిసిందే. ముఖ్యంగా రైల్వే డిపార్ట్మెంటులోఉన్న నేను మా మినిష్టర్‌గారి పేరు మార్చివేసినందుకు చాలా విచారించినాను. ఇకపైన ఇటువంటి తప్పులు దొర్లవని ఆశిస్తూయున్నాను.

హరినన్యాసిరావు (కార్కాలా)

* శ్రీ పటేల్ జన్మదినోత్సవం సందర్భంలో శ్రీ పాటిల్ మాట్లాడారని ఉండవలసింది! (సం)

కథలు

మీరు ప్రచురించిన డి. కామేశ్వరిగారు వ్రాసిన "వంకరగీతలు" చదివాను. చదువుతుంటే యదార్థమనే వివరిస్తుంది. ఈవిధంగా వ్రాస్తారనుకున్నవారిలో, నేను వూహించినవారిలో బహు కొద్దిమందే వ్రాయుగల రనుటలో అతిశయోక్తి కాదేమో? ఎందుచేతనంటే ఇది పూర్తిగా ఆర్మి ఆఫీసర్లకు, వారి కుటుంబాలకు మాత్రమే సంబంధించినది మిగిలిన మిలిటరీ లోకమంతా ఈవిధంగా ఉందని వూహించి పొరపడవద్దని పాఠకులకు తెలియజేయుటకు కాబోలు, కేవలము అనుభవపూర్వకముగా గాని, స్వయంగా వెళ్ళి చూచి గాని, కామేశ్వరిగారు కళ్లకు కట్టినట్లు అబాలగోపాలమున కర్థమయ్యేలా వ్రాశారు. ఇది నిజంగా ఈ సంవత్సర పత్రిక పాఠకులకే నూతన కానుక యని చూచి, తలంచి చెప్పక తప్పదేమో! కాని చివరలో కొంచెము తేల్చి వ్రాశారు.

కూరపాటి డొమినిక్ పింజిం (గోవా)

సీరియల్


ఆంధ్రసచిత్ర వారపత్రికలో సీరియల్‌గా వస్తున్న "సంపెంగలు సన్నజాజులు" నవల చాల బాగుంది. నవల అయిపోయిందంటే ఎంతో బాధ అనిపించింది. ఇది ఇంకా కొన్ని వారాలు పొడిగిస్తే బాగుండేది. ఇంత మంచి నవల అందించిన రచయిత శ్రీ అవసరాల రామకృష్ణారావు గారికి నా కృతజ్ఞతాభివందనములు. నవల మొదటి నుండి చివర వరకు కూడ చాల హాస్యరసభరితంగాను, కరుణరసంతోను మనస్సులకు హత్తుకొనిపోయిందంటే అతిశయోక్తి కాదు. కొన్ని సంవత్సరాల నుండీ యింత మంచి నవల ఈమధ్య చదివి ఉండలేదేమో అని నా మనసుకు అనిపిస్తోంది అంతా బాగుంది కాని రచయిత ఈ నవలకు ఈపేరు ఎందుకు పెట్టారో అర్థం కావటంలేదు. ఈ పేరుకి కథకు ఎక్కడ సంబంధం ఉన్నదో తెలియచేస్తారని ఆశిస్తున్నాను.

పి. అనసూయాదేవి (బాపట్ల) ★



చిత్ర రూపం పొందిన ఊహాగానం

అణ్వాస్త్రాలతో యుద్ధం జరిగితే...



బాంబు పేలింది...



వందలాది మృతులు బారులుగా పడిన దృశ్యం



శాంతిప్రదర్శన జరుపుతున్న పౌరులు



ఒక భయంకర దృశ్యం.

...ఎలా ఉంటుందో ఊహించి బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌వారు ఒక చిత్రం నిర్మిస్తున్నారు.

కాని ఈ చిత్రం విడుదలచేసే ధైర్యం బి. బి. సి.కి ఉంటుందా అని అడుగుతున్నారు కొందరు.


ఎందుచేతనంటే ఈ చిత్రం ఒక వార్తాచిత్రంలాగ తీశారు. ఒక దేశం అణ్వస్త్రాలకి గురిఅయితే ఎలా ఉంటుందో చూపించారు.

ఇది సామాన్యప్రజలలో మితిలేని భయాందోళనలు కలిగిస్తాయని ప్రభుత్వాధికారుల భయం.


"ఇన్ ది వార్ గేమ్" అని ఈ చిత్రం పేరు. ఇది పార్లమెంటులోనూ, బయటా కూడా పెద్ద సంచలనం లేవదీయగలదు.

కారణం?

నేటి ప్రజాసంరక్షణకి జరిగిన ఏర్పాట్లు చాలవని ఈ చిత్రం చెప్తుంది. యుద్ధం తర్వాత— అణ్వస్త్రయుద్ధం తర్వాత— దేశంలో కొన్ని ప్రాంతాలు 'చీకటి యుగా'లలోకి దిగజారిపోయినట్లు చూపుతుంది.



రక్షించబడిన అనంతరం తిండికోసం చేసు...



కారాసైల్ అంబులెన్సు రంగంలోకి వచ్చింది...

ఈ చిత్రంలో కొన్ని సీన్లు కథలా ఉంటాయి.

రెండు 'మెగటన్స్' పడగానే ఏమి జరుగుతుందో ఈ 'డాక్యుమెంటరీ' సచిత్రంగా సూచిస్తుంది.

దాని నిర్మాతలు అంటారు: 'చూపించినవన్నీ జాగ్రత్తగా సేకరించిన శాస్త్రీయ అంశాల మీద ఆధారపడిన విషయాలే.'

ఉదాహరణకి— ఒక మెగాటన్ బాంబు పేలిన చోటికి అయిదుమైళ్ళ దూరంలో కొయ్య తగల బడి పోతుంది.

పదిమైళ్ళ దూరంలో ఉన్నవారికి కళ్ళు పోతాయి బాంబు కాంతికి.

27మైళ్ళ దూరంలో ఉన్నవారి కళ్ళకి హాని కలుగుతుంది...

ఇది ఒక ఊహాకల్పన అయినప్పటికీ శాస్త్రీయంగా తీసిన చిత్రం కాబట్టి 'శాండ్విచ్' అనే ఊరిని ఉదాహరణకి తీసుకున్నారు. ఈ ఊరిలో 95% మంది చచ్చారు. డోవర్, ఫోక్‌స్టన్, డీల్, రామ్స్‌గేట్, కాంటర్బరీలలో ప్రజలు ఎలా చస్తారో చూపిస్తారు ఈ చిత్రంలో...

బాంబు పేలిన తర్వాతి బీభత్సం నాటకీయంగా చిత్రీకరించారు నిర్మాతలు...

అటువంటి సమయంలో మానవ ప్రవృత్తి ఎలా మారుతుందో చూపిస్తారు. నాగరికత అనే మాటకి అర్థం లేదేమో అనిపించేట్లు ఉంటుంది ఇది చూస్తే.

ఈ 'డాక్యుమెంటరీ' 50 నిముషాలు నడుస్తుంది..... ★

[ఫోటోలు, వ్యాసం ప్రత్యేకం.]

మా ఢిల్లీ లేఖ

ప్రధాని శాస్త్రి సోవియట్ పర్యటన ఫలాఫలాలు: వ్యాపారాభివృద్ధికి అవకాశాలూ!

కేంద్ర బడ్జెట్‌ని లౌడ్ స్పీకర్‌తో పోల్చవచ్చు—విషయం ఏమీలేకపోయినప్పటికీ గోల మాత్రం ఎక్కువగా ఉంది. ప్రధాని శ్రీ శాస్త్రి, రష్యా పర్యటన ముగించుకుని వచ్చిన పిదప వెలువడ్డ ఇండో—సోవియట్ సంయుక్త ప్రకటనని కూడా యీవిధంగానే వర్ణించవచ్చు నాలుగో ప్రణాళిక—అశోక్ మెహతా సంఘానికి సంబంధించిన ఈ సంయుక్త ప్రకటన లోని విభాగాలను పరిశీలిద్దాం.

మొన్న జరిగిన చర్చల ఫలితంగా సోవియట్ యూనియన్, ముఖ్యమైన రంగాలలో తన ఆర్థిక, సాంకేతిక సహకారాలను కొనసాగించటానికి సమ్మతించింది, ఉన్నత శ్రేణి సాంకేతిక శిక్షణ ఇండియన్లకు యివ్వటానికి అంగీకరించింది సోవియట్ యూనియన్ 1965 లో తన సాంకేతిక నిపుణులతోబాటు భారతీయ నిపుణులను కూడా ఇండియాకు పంపి నాలుగో ప్రణాళికలో చేర్చబడ్డ ప్రాజెక్టుల సహకారానికి సంబంధించిన ముఖ్య విషయాలపై ఆలోచనలను జరుపుతుంది రెండు ప్రభుత్వాల అంగీకారానికి వారు తమ అంచనాల సిఫార్సులను తయారు చేస్తారు ఇటీవలి సంవత్సరాల్లో రెండు దేశాల మధ్య జరిగిన వ్యాపారాభివృద్ధిపట్ల యిరుపైపులవారూ సంతృప్తిని వెలిబుచ్చారు

రెండుదేశాలకూ ప్రయోజనకరమైన వ్యాపారం పట్ల యిరుపైపులవారు సుముఖంగానే ఉన్నారు ఇండియా, సోవియట్ రష్యాల మధ్య జరిగే వ్యాపారం టర్నోవర్ 1970 నాటికి 1964లో ఉన్న దాని కంటే రెట్టింపు చేయాలని ఒప్పందాలు చేసుకున్నారు. దీని ద్వారా రెండు దేశాల మధ్య వ్యాపార సంబంధాలు విస్తృతం కావటంమే కాకుండా ఇండియాలోనూ, రష్యాలోనూ కొన్ని పరిశ్రమల అభివృద్ధి కారణం కూడా అవుతుంది. 1965 ఆగస్టు—సెప్టెంబర్‌లలో జరిగే ఈ ఒప్పందాలతాలూకు కావలసిన ఏర్పాట్లు చేయటానికి రెండుదేశాలు తమ విదేశవ్యాపారకార్యాలయాలకు ఆదేశాలను జారీ చేస్తాయి

నాల్గవ ప్రణాళిక కోసం శ్రీ అశోక్ మెహతా సోవియట్ యూనియన్‌ని 600కోట్ల రూపాయల సహాయాన్ని కోరారన్న విషయం మనకిదివరకే తెలుసు. అమొత్తంలో రూ. 400కోట్లు (బొకారో ప్రాజెక్టు తప్ప) దాదాపు 40 ప్రాజెక్టుల వినియోగానికీ, మిగతామొత్తం యితరమైన వాటికీ.

శ్రీమెహతా మాస్కో నించి తిరిగి రాగానే రష్యా ఇండియాకు యివ్వాలనుకున్న మొత్తాన్ని సూచించలేదు. ఏది ఏమైనప్పటికీ రష్యా తన వ్యాపారాన్ని 1972కి వంద కోట్ల రూపాయలనుంచి రెండువందల కోట్లకు అధికం చేస్తానన్న వాగ్దానం పట్ల మాత్రం ఆయన ఆసక్తిని చూపించారు. విదేశమారకం సులభసాధ్యమై వ్యాపార అభివృద్ధి ఎంత వరకు ఉపయుక్తమవుతుందో తెలియటం లేదు. మెహతా సంఘం సూచించిన ప్రాజెక్టుల్లో 30 ప్రాజెక్టులకు అభివృద్ధి మాత్రమే అవసరం మిగతా పది మాత్రమే కొత్తవి

స్వేచ్ఛగా విదేశీ మారకం జరిగే దేశంనుంచి లభించే సహాయంవల్ల లాభాలేమిటనేవి చర్చనీయం.

మొట్టమొదట ఈ సంయుక్త ప్రకటన పశ్చిమ దేశాలన్నింటినీ ఒకరకంగా, నిస్సంశయంగా, ముఖ్యముగా యు. ఎస్. ఏ. ని నిషేధించింది. ఇంకోవైపునించి చూస్తే ఇది సిద్ధంగా యింతని తేలని రష్యా సహాయం అనుకొన్నంత లభించే అవకాశాలు చాలావరకూ తక్కువ లిండన్ జాన్సన్ ప్రభుత్వానికీ, కెనెడీ పరిపాలనకీ చాలా వ్యత్యాసం ఉంది.

ఇక రెండోది: ఇండియాకి మంచి స్నేహితుడూ, సహాయం విషయంలో ప్రముఖ పాత్ర కలవాడూ అయిన సెనెటర్ షెర్మన్‌కూపర్ ఈ సహాయం విషయంపై ఆందోళనను వ్యక్తపరుస్తున్నారు.

అమెరికానుంచి అందని సహాయాన్ని కమ్యూనిస్టు ప్రాంతం నుంచి పొందటంపట్ల దూషణలతో బ్లాక్ మెయిల్ చేయటానికి ఎవరికీ మనం అవకాశం యివ్వకూడదు

అమెరికా కొత్తగా పెట్టేతనదేశం పెట్టుబడుల పై 5% 'సీలింగ్'ను ఏర్పాటుచేసింది ఉదాహరణకి. 1964 లో ఓ అమెరికా బ్యాంక్ ఇండియాలో 100 డాలర్లు పెట్టుబడి పెట్టిందనుకుందాం 1965 లో 105 డాలర్లకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టటానికి వీల్లేదు. బ్రిటన్‌కూడా ఇలాంటి కష్టసాధ్యమైన ఆంక్షలనే పెట్టింది.

ఇండియన్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, శ్రీ ఎస్. ఎల్. కిర్లోస్కర్ నుంచి హెచ్చరికొకటి వచ్చింది. ఆయన ఇటీవల ఓ ప్రెస్ కాన్ఫరెన్సులో మాట్లాడుతూ ప్రస్తుతం మన దేశం అభివృద్ధి, రక్షణ అనే రెండు సమస్యలతోనూ వ్యవహరించాల్సిఉంది. 1962లో అత్యవసర పరిస్థితి 1963 బడ్జెట్ ని అధికం చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌తో చెడిన మన సంబంధాల దృష్ట్యా రక్షణ వ్యయం యింకా అధికం కాగలదు. 1972 నాటికి ఇండియా తన కాళ్ళపై తాను నిలబడగలదన్న ఊహ నిజమవుతుందన్న నమ్మకం ఈ పరిస్థితులనిబట్టి చూస్తే అనుమానా స్పదంగానే ఉన్నదన్నారు.

* * *

స్విస్ గడియారాల పరిశ్రమ ఇండియాలో, ఇండియా సహకారంతో స్విస్ వాచ్ ఫాక్టరీ నెలకొల్పమని ప్రభుత్వాన్ని కోరింది ఇంతవరకూ స్విట్జర్లాండ్ చట్టాలు, గడియారాల ఫాక్టరీ దేశాంతరాల్లో పెట్టటం, యంత్రాంగాన్ని ఎగుమతిచేయటం సాంకేతిక విషయాల్ని తెలియజేయటం అన్న విషయాలను నిషేధించాయి గడియారాల తయారీదారుల ప్రతినిధి సంఘం ఒకటి కేంద్ర పరిశ్రమల మంత్రిని కల్సుకుని స్విస్ ప్రపోజల్స్‌పై చర్చలు జరిపారు. భారత ప్రభుత్వం ఈ ప్రపోజల్సుకు అనుకూలంగానే ఉండవచ్చు— అయితే దాని ఉత్పత్తి ప్రస్తుతం ప్రభుత్వంచే బెంగుళూరులో నిర్వహింపబడుతున్న గడియారాల సంస్థకి అడ్డు రాకుండాఉండే పరిస్థితిలోనే. సోవియట్ ప్రపోజల్ గనక ఓ రూపానికి వస్తే అది ఇంకా చవుక ధరలకు గడియారాలను ఉత్పత్తి చేయగలదు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సంస్థ మధ్యరకం గడియారాలను తయారు చేస్తుంది. దేశంలోకి అక్రమంగా నాణ్యమైన గడియారాలు వస్తూనే ఉన్నాయి కాబట్టి దేశంలో నాణ్యమైన గడియారాలను తయారు చేయాలి. స్విస్ ప్రపోజల్‌లో మూడు అంశాలున్నాయి. గడియారాల ఫాక్టరీ స్థాపించటం, శిక్షణయిచ్చే గడియారాలను బాగుచేసే సంస్థ స్థాపించటం, నాణ్యాన్ని పరిశీలించే క్వాలిటీ కంట్రోల్ సంస్థలను స్థాపించటం విలువైన గడియారాలు బాగు చేయించాలంటే ఇప్పటికీ స్విట్జర్లాండ్ పంపించాల్సిందేకదా! అందుకై వాచ్ రిపేర్ సంస్థలు ఇండియాలో స్థాపించాలి. దేశంలో తయారైన గడియారాలు కూడా స్విస్ గడియారాల కేమాత్రం తీసిపోవనే విషయాన్ని నిర్ణయిస్తూ క్వాలిటీ కంట్రోల్ సంస్థలు సర్టిఫికేట్స్ ఇస్తాయి. [illegible] ఈ సంస్థలు ఇండియాలో

తయారైన గడియారాలకి సర్టిఫికెట్లు ఇస్తాయి. దేశీయ మార్కెట్‌కాని, ఉత్పత్తిగాని ఎగుమతులకి అనుకూలంగా ఉన్నప్పుడు పబ్లిక్, ప్రయివేటు రంగాలు సహాయపడాలి. రిపోర్టులనిబట్టిచూస్తే ఇండియా విదేశీ మారకానికి ఈ స్కీమ్ ప్రోత్సాహకారి కాగలదని తెలుస్తున్నది

ఈ సంవత్సరాంతంలో స్విట్జర్లాండ్ ప్రతినిధి వర్గం ఇండియావైపువార్ని తమ దేశానికి మళ్ళీ జరిగే చర్చలకు ఆహ్వానించింది. ఈమధ్యకాలంలో ఇరువైపులవారికీ ఇటీవలి చర్చలలోని అంశాలను పునః పరిశీలించుకోడానికి కావలసినంత వ్యవధి ఉన్నది.

* * *

ఇండియా వ్యాపారాభివృద్ధికి శ్రీ బాలిరాం భగత్ తూర్పు యూరప్ దేశాలకు విస్తృతమైన పర్యటన చేయబోతున్నారట ఇంతకుపూర్వం కామర్స్ డెప్యూటీమంత్రి శ్రీ రామస్వామి కూడా ఇలాంటి పర్యటనచేసి తిరిగి వచ్చిన వెంటనే తూర్పు యూరప్ దేశాల్తో ఇండియా వ్యాపారం రెండు రెట్లవుతుందని చెప్పారు. ఆదేశాలతో వ్యాపార ఒప్పందాలపై సంతకాలు జరిగినప్పుడు కూడా అటువంటి ప్రశ్నలే తలయెత్తాయి.


కామర్సుమంత్రి శ్రీ మనూభాయి షా ఇటీవల బడ్జెట్ సమావేశం జరిగేటప్పుడు పార్లమెంటులో ఓ ప్రశ్నకు సమాధానంచెప్తూ బల్గేరియా, చెకోస్లోవేకియా, హంగేరీ, పోలాండ్, సోవియట్ రష్యాలతో ఇండియా చేసుకున్న వ్యాపార ఒప్పందాలకు డిశంబర్ 31, 1968 వరకూ గడువు ఉన్నదన్నీ రుమేనియా, యుగోస్లేవియాల ఒప్పందాలకుమాత్రం 31 డిశంబర్, 1967 దాకానే ఉందని చెప్పారు. ఈ దేశాల తోటి సంవత్సరపు వ్యాపార ఒప్పందాలన్నీ ఇటీవలే సరిచేశారు. అసలు ప్రశ్న ఏమిటంటే శ్రీ బాలిరాం భగత్ ఎందుకు వ్యాపారాభివృద్ధిపై ఆశక్తి చూపుతున్నారన్నదే రెండవది, ఇందులో ఏ ఒప్పందానికీ పునఃపరిశీలన అవసరంలేదు. సంవత్సర వ్యాపార పథకాలు కూడా పూర్తి అయినయిగదా

ఇంకొక ముఖ్యమైన విషయం అసలు ఈ డిప్యూటీ మంత్రులు, ఏవిధంగా ఇండియా విదేశీ వ్యాపారాన్ని అధికం చేయగలరు? అసలు పని జరిగింది లాయడ్‌జార్జి చెప్పిన 'స్టీల్ ఫ్రేం' వల్లనే.

లోక్‌సభ స్పీకర్ సర్దార్ హుకుంసింగ్ మనిలాకి ఓ పార్లమెంటరీ ప్రతినిధివర్గానికి నాయకత్వం వహిస్తున్నారట. ఇండియా—బల్గేరియా ఫ్రెండ్‌షిప్ ఎసోసియేషన్‌లాంటి సంస్థలనేకం ఇక్కడ ఏర్పాటయి తద్వారా వాటి కార్యనిర్వాహకులకూ, సభ్యులకూ విదేశ పర్యటనలుచేసి రావటానికి బాగా ఉపయోగపడుతున్నాయి. ఆఖరికి ఒక 'పెన్ ఫ్రెండ్ అసోసియేషన్' కూడా ప్రధాన కార్యాలయాన్ని నెలకొల్పటానికి ఇండియాలో చోటుని సంపాదించుకున్నది. 'ఇంటర్నేషనల్ లివింగ్'తో వ్యవహరించే ఇంకొక సంస్థ కూడా తన ప్రతినిధివర్గాన్ని సక్రమంగా విదేశాలకు పంపుతున్నది. యు. ఎస్. ఎ. చూసిరావటానికి రెండేళ్లక్రితం ఎన్నిక చేయబడ్డ కొందరు వ్యవసాయదారులు పాత ఢిల్లీలోని గాంధీ చౌక్‌లో వ్యవసాయానికి స్థలాన్ని సంపాదించారు.

పాకిస్తాన్ సరిహద్దురేఖ విషయంలోనే ప్రమత్తంగా ఉన్న ప్రభుత్వం, ఎవరో వాళ్లకు వాళ్లుగా రాయబార్లుగా నియమించుకొని, సంఘాలుగా ఏర్పడి, విదేశాలకి వెళ్ళి తయారుచేసే ఇండియా ఊహాచిత్రాన్ని గురించి శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ప్రపంచంలో ప్రతిమూలనుంచీ భారతీయ స్థిరనివాసులు నెట్టివేయబడ్తూండటం గమనార్హం.

—శ్రీకృష్ణ ★


బ్రిటన్ వినోదం!
సంప్రదింపులు
పాలపీక ఎందుకు? నాక్కావలసింది పాలే
హిందీయేతరులు
సామాన్యుడి నెత్తిన ఇదో భారమా?
అబ్దుల్లా నిర్బంధపు ఖర్చులు
యావజ్జీవ కారాగార శిక్ష
జయప్రకాష్ పాకిస్తాన్ పౌరుడే అయితే


ప్రశ్న
సత్యం శంకరమంచి

సూర్యానికి కొడుకు పుట్టాడు.

ఆ ఇంట్లో అంత ఆనందమయమైన వాతావరణం మున్నెన్నడు లేదు. ప్రతివాళ్ల ముఖంలోనూ చిరునవ్వులు పొర్లుతున్నాయి. అంతకు ముందున్న అస్వస్థతలు నలతలు ఎగిరిపోయి నెత్తురులో ఓ కొత్తదనం, ఉత్తేజం వచ్చినట్లు ఇల్లంతా తిరుగుతున్నారు. పురిటింట్లో అమ్మలక్కలు తలకొకటి మాట్లాడుతున్నారు.

'గొప్ప కొడుకుని కన్నావమ్మా!'

'మొహం చూశావా! అచ్చుతల్లే'

'నీమొహం కాదూ! తండ్రి పోలిక అట్లా కన్పిస్తూంటే.'

'ఆ! పెద్ద తెలిసినట్టు! నేం చెప్తా నుండండి. కళ్లు తల్లివి, ముక్కు తండ్రిది, ఆ నోరూ ఆ గాంభీర్యం అంతా తాతగారిది''.

సూర్యం తండ్రి రామనాథం ముందు వసారాలో వాలు కుర్చీలో కూర్చుని వెండితీగల్లాంటి గండు మీసాన్ని ఠీవిగా మెలేస్తున్నాడు. గదిలో సూర్యం ఒక విచిత్రమైన ఆనందం అనుభవిస్తున్నాడు తను తండ్రి! కొద్ది నిముషాల్లో తన వయస్సు చాలా పెరిగినట్లనిపించింది తన కొడుకు—తనను నాన్నా అని పిలిచేవాడు—తన వొళ్లోకి దూకి కిలకిల నవ్వేవాడు— తను బజారు పోతుంటే నేనూ వస్తానని వెంట పడేవాడు— మంచి చదువు చెప్పించాలి.. ఐ ఏ యస్ చేయించాలి....

చెల్లెలు శారద పరుగెత్తు కొచ్చింది 'నీకు కొడుకు పుట్టాడు నాకేమిస్తావో చెప్పు.'

సూర్యాని కేం చెప్పాలో తెలియలేదు 'పండక్కి డెకరాన్ చీర. .'

'ఓ! అప్పటి దాకా కాదు ఇప్పుడే.'

మంత్రసాని వసారాలో ఉన్న రామనాథం దగ్గర కొచ్చింది.

'బాబుగారూ! మనవడు పుట్టాడు నాకేం బహుమతి?'

రామనాథం నవ్వాడు ఆ నవ్వుకి బుగ్గలు ఎగిరెగిరి పడ్డాయి. వెండి మీసాలు కులికాయి 'మా సూర్యం పుట్టినప్పుడు నేనేమీ ఇవ్వలేదు మా కలవాటు లేదే!'

'మా కలవాటేసనండి. కొడుకు పుట్టినప్పటి కంటె మనవడు పుట్టినప్పుడు రెట్టింపివ్వాలి. సూర్యంగారి పుటకలకి ఇవ్వలేదం టున్నారుగా, రెండూ కలిపి ఇప్పుడిచ్చెయ్యండి'

'ఒహోహో ' రామనాథంగారు పెద్దగా నవ్వాడు ఆయన ముఖం కంది పోయింది 'అయితే ఎంతివ్వాలంటావ్?'

'మీకు తెలియందేముంది మీకు మనవడు పుట్టాడు. మీతోపాటు మేమూ సంతోషించాలి'

మనవడు— అమాట వింటేనే రామనాథంగారు పరవశించి పోతున్నారు. లోపలినుంచి మంత్రసాని కోసం పిలుపొచ్చింది.

'తొందరగా ఇయ్యండి అయ్యగారూ! లోపల పనుంది'

'వెళ్లి పని చూసిరా. ఇస్తాన్లే. మంత్రసానికి ఇవ్వకూడదని కాదూ, అట్లా పొడిగించటంలో అదో సుఖం.'

'అదేం మాటయ్యగ్గారూ! ఈ సమయం [illegible] ముచ్చటే ముందండి. రేపు మీరిస్తానన్నా నేను తీసుకోనండోవ్.'

'ఓహో...హోసీసీ...' తయారుగా ఉంచిన కరుకు రూపాయల్లోంచి ఐదుతీసి మంత్రసాని చేతిలో పడేశాడు.

రూపాయలు కళ్ల కద్దుకుని 'ఇంకా మనవలూ మనవరాళ్లూ కలగాల' అంటూ లోపలి కెళ్లింది మంత్రసాని.

శారద బీరువాలోంచి పెద్ద పొట్లంతీస్తూ 'అమ్మోయ్! అన్నయ్య ముందుగానే కోవా తెప్పించి ఉంచాడేవ్' అంది.

'నేనే పంపిద్దామనుకుంటున్నాను. తెప్పించాడా! కొడుకు పుడ్తున్నాడంటే వాడికీ ముందాలోచనలు వస్తున్నాయి' అంది శ్రీదేవమ్మ.

శ్రీదేవమ్మ తన రక్తపోటు, నీరసం అన్నీ మర్చిపోయింది. ఇంట్లోకి వాకిట్లోకి వూరికే తిరుగుతోంది. ఏవేవిటో అందరికీ పురమాయిస్తోంది. మనసులో రేఖామాత్రంగా మనవరాలు పుట్టలేదే అని ఉందికాని, ఆమె పొందుతున్న ఆనందానికి అదేమీ భంగం కలిగించలేదు.

శాంతకి ఇంకా సరిగ్గా వొళ్ళు తెలియలేదు. నీరసంగా ఉంది తన్నేదో పువ్వులు కౌగలించుకుంటున్నట్లనిపించింది బరువుగా కళ్లు తెరచి చూసింది బుల్లి బుల్లి చేతులు...చిట్టి పెదవులు. దేనికోసమో పెనుగులాడుతున్నాడు ఆ స్పర్శకి తనగుండె కరిగి నీరైపోతున్నట్లు, అన్ని అవయవాలు ఉలిక్కిపడి— నీకోసమే తండ్రీ! అని వాలిపోతున్నాయి.

ఆ ఇంట్లో అందరి కార్యక్రమాలలో మార్పులొచ్చాయి ఏదో సమయంలో ప్రతివాళ్లు ఉయ్యాల దగ్గరకెళ్లి పరామర్శించి వస్తూండటం, వాడి పేరున ఛలోక్తులు, పరిపాటి అయిపోయినాయి రామనాథం అంతా చూస్తుండగా చిట్టాడితో ఆడుకోడు. చిరునవ్వుతో ఠీవిగా తలూపుతూ చూస్తాడు అంతా భోజనాలు చేస్తుండగా తను ముందు భోజనం కానిచ్చేసి వస్తూ చిట్టాడి గదిలోకి వెళ్తాడు. చిట్టాడు కాళ్లకు చేతులు ముడివేసే ప్రయత్నంలోనో, పాలపీక నోట్లో పెట్టుకుని ఏదో జ్ఞాన సమాధిలో ఉన్నట్లుగానో ఉంటాడు రామనాథం ఆ సమయంలో తనూ చిన్న పిల్లాడైపోతాడు 'కికికీ' అంటాడు 'చిచిఛీ' అంటాడు బుబుబూ అంటూ మీసాలు ఒగిలిస్తూ ముద్దు పెట్టుకోబోతాడు వాడికి చక్కిలిగిలి పెడతాడు తను గలగల నవ్వుతాడు ఇంతలో బయట అలికిడైతే ''చిట్టాణ్ణి ఒక్కణ్ణీ వదిలేశారు అన్నాలు తొందరగా కానివ్వండి'' అని చల్లగా వసారాలోకి జారుకుంటాడు

మధ్యాహ్నం నిద్ర అయాక, శ్రీదేవమ్మ రామనాథానికి కాఫీ ఇచ్చి ఆపైన చిట్టాణ్ణి చేతికిస్తుంది. వాణ్ణి వొళ్లో పడుకోబెట్టుకున్నప్పుడు వాడు తన వైపు తన మీసాలవైపూ చూస్తూ తనను కాళ్ళతో తంతుంటే ఆయనకు కలిగే ఆనందం అంతా ఇంతాకాదు వాడు వొళ్లో వుంటే ఆయనకు ఎక్కడలేని దర్పం పుట్టుకొస్తుంది. అలా ఠీవిగా తలూపుకుంటూ మీసాలు మెలేసుకుంటూ గంటలు గంటలు గడుపుతాడు. అంతలో వాడు తాతగారి బట్టలు తడిపేయటం భార్యని పిలిచి వాణ్ణి లోపలికిచ్చి తను బట్టలు మార్చుకోటం రోజూ అలవాటు.

రాత్రి భోజనాలయాక రోజులాగే అంతా మధ్య హాలులో సమావేశమయ్యారు. సంభాషణలు, చర్చలు, హాస్యాలు అన్నింటికీ చిట్టాడు కేంద్రం. పేపరు చదువుకుంటున్న రామనాథం ఏదో పుస్తకం చదువుకుంటున్న సూర్యం, స్వెట్టర్ అల్లుతున్న శాంత, వారపత్రిక తిరగేస్తున్న శారద వేరువేరు పనులలో నిమగ్నులై ఉన్నట్టు కన్పిస్తున్నా వాళ్ల మనస్సులు, చెవులు చిట్టాడిమీదే చిట్టాడు పెద్దయి చేయబోయే ఉద్యోగాలు, వాడిక్కాబోయ్యే భార్య, తాతగారు వాడికి రాసిచ్చే పల్లపు చేను వీటిమీద మాటలు సాగిపోతున్నాయి

ఉన్నట్టుండి చిట్టాడు ఏడవటం మొదలెట్టాడు. పత్రిక, పుస్తకం, వూలు కింద కి దిగిపోయాయి. వాడింకా ఏడుస్తున్నాడు ఆకలేస్తోందేమో శాంతని పాలివ్వమన్నారు శాంత కొంగు చుట్టూ కప్పుకుని పాలివ్వబోయింది వాడు పాలు తాగలేదు. ఏడుపాపలేదు. 'నాకివ్వు నే నాడిస్తా'అని ఒకళ్ల తర్వాత ఒకళ్లు చిట్టాణ్ణి తీసుకుని ఓ. ఓ ఓ .అని ఏడుపు మాన్పించ చూశారు. వాడు ఏడుపాపలేదు ఐదు నిముషాలయింది. పది నిముషాలయింది ఏడుపు తగ్గలేదు కాస్త గాలికి వరండాలో తిప్పమన్నారు. లాభంలేక పోయింది వెక్కిళ్ళు కూడా వస్తున్నాయి గుక్కపట్టి ఏడుస్తున్నాడు నుంచున్న వాళ్లు నుంచున్నట్టే ఉన్నారు. ఎవరికీ ఏం తోచటం లేదు. ఎందు కేడుస్తున్నాడో తెలియదు. శ్రీ దేవమ్మ పొట్టవొత్తి చూసింది అజీర్తి కూడా లేదే! ఎందుకు ఏడుస్తున్నాడు? ఉయ్యాల్లో పడుకోబెట్టి ఉపొరు ఊహు కళ్లు అటూ ఇటూ తిప్పుతున్నాడు. డొక్క ఎగరేస్తున్నాడు అంతా దిగాలుపడి చూస్తున్నారు అంత సింహంలాంటి రామనాథం బిక్కమొహం పెట్టుకున్నాడు సూర్యానికి మనసు కకావికలై పోయింది. శాంత సూర్యంవైపు బెలగా చూసింది. విషాదం పొంగిన ఆచూపు మొదట్లో కన్నీరు శ్రీదేవమ్మ ఆయాసపడి పోతోంది. ముక్కు తడుచుకుంటోంది దిష్టి తీసింది. దేవుడికి ముడుపు కట్టింది పావుగంట క్రితం ఉన్న ఉల్లాసమంతా చిందరవందరై పోయింది. అందరి గుండెల్లో బరువు, మూగబాధ. సూర్యం డాక్టరుకోసం బయటికి పరుగెత్తాడు.

ఒకరోజు లలిత వచ్చింది. లలిత సూర్యానికి మేనత్త కూతురు అసలు సూర్యం పెళ్లి లలితతో జరగాల్సింది. ఏవో మాట పట్టింపు లొచ్చాయి. మీరెంతంటే మీరెంతనుకున్నారు. తప్పిపోయింది. లలితకింకా పెళ్లి కాలేదు కాలేజీలో లెక్చరర్గా పని చేస్తోంది సూర్యం పెళ్లయాక లలిత రావటం ఇదే మొదటిసారి సూర్యం భార్య శాంతని చూపించాడు చిట్టాణ్ణి చేతికిచ్చాడు. చిట్టాడికి మూడేళ్లు నిండుతున్నాయి బొద్దుగా ఆపిల్ పండల్లే ఉన్నాడు. కొంచెం కొంచెం మాటలు వస్తున్నాయి. లలిత చిట్టాణ్ణి తీసుకుని ముద్దాడింది. బిస్కట్టు పెట్టింది

'మీ అమ్మా నాన్నా రాకపోయినా నువ్వయినా వచ్చావ్. చాలా సంతోషం' అంది శ్రీదేవమ్మ.

'పెద్దవాళ్ల పట్టింపులు మా కుర్రకారు

కుండవత్తయ్యా. అమ్మా నాన్నా ఇవ్వాళ కాకపోతే రేపైనా రావలసిన వాళ్ళే' అంది లలిత.

లలితను చూస్తుంటే సూర్యానికి బాధేసింది. లలిత ఏమీ జరగనట్లు మాట్లాడుతున్నా, శాంతతో కలుపుగోలుగా కబుర్లు చెప్తున్నా, చిట్టాణ్ణి దగ్గరికి తీసుకుని 'పిన్నమ్మా! పిన్నమ్మా'అని పిలిపించుకుంటున్నా తను చేసిన అన్యాయాన్ని ఎత్తి చూపిస్తున్నట్లుంది

సూర్యం, లలిత గదిలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. లలిత ఇక్కడికి వస్తున్నట్లు వాళ్ళ అమ్మానాన్నకి తె యదట. కాలేజి ఎక్స్‌కర్షన్ పార్టీతో వచ్చి చూసిపోదాంగదా అని ఇక్కడ దిగిందట. లలిత చకచకా కబుర్లు చెప్తోంది. వాళ్ల కాలేజి సంగతులు, ఎక్స్‌కర్షన్ వింతలు, రైలు ప్రయాణంలో తిండిలేక పోవటం, స్టేషన్‌లో కొందరు తప్పిపోవటం, గొలుసు లాగటం, ఏవేవో చెప్తోంది. లలితలో ఇదివరకటి చలాకీతనం అలాగే వుంది కబుర్ల పోగు మారలేదు అనుకున్నాడు సూర్యం. మధ్యలో మాటలు ఆపి లలిత అంది 'ఏవిటి బావా! అట్లా మూగిలాగ కూర్చున్నావ్? శాంతక్క నిన్ను చాలా మార్చేసింది!'

సూర్యం వెర్రి నవ్వొకటి నవ్వి 'అబ్బే! ఏంలేదు నువ్వు చెప్తున్నావు గదా అని వింటున్నాను' అన్నాడు.

'సరే అయితే నే చెప్పటం అయిపోయింది నువ్వు మొదలెట్టు'.

సూర్యం కొంతసేపు మాట్లాడలేదు ఆ తర్వాత అన్నాడు 'నువ్వు పెళ్లెప్పుడు చేసుకుంటావ్?'

లలిత నవ్వుముఖం క్షణంలో మారిపోయింది అంతలో తిరిగి నవ్వు తెచ్చుకుని 'నాకేవయినా మంచి సంబంధం చూస్తున్నావా?' అంది.

లలిత నవ్వుతోందే కాని దాని వెనకాల ఎంత విషాదం ఉందో సూర్యానికి తెలుస్తూనే ఉంది నాకింత వయసు వచ్చినా పెళ్ళికాక పోవడానికి, అవసరం లేకపోయినా ఉద్యోగం చేస్తూ జీవితం గడపడానికి కారణం నువ్వు—నువ్వు అని చెప్తున్నట్లుంది.

ప్రశ్న

'లలితా! నీకు అన్యాయం చేశాను' ఈభావాన్ని ఎప్పుడు లలిత ముందు పరిచేద్దామా అన్నంత తొందరగా వచ్చాయి మాటలు.

లలిత రెండు క్షణాలు మాట్లాడలేదు. ఆ తర్వాత నిట్టూర్చి అంది. 'ఎందుకు బావా ఇప్పుడదంతా తవ్వుకోటం? అయిందేదో అయిపోయింది ఆనాడు మనమూ పెద్దవాళ్ళ కొంగులు పట్టుకునే తిరిగాం మనకీ నోరు లేకపోయింది. వొలికి పోయిన పాలను గురించే చింతిస్తూ కూర్చోలేంగా శాంతక్క చాలా తెలివైంది నువ్వు అదృష్టవంతుడివే నువ్వు పోగొట్టుకున్న దేంలేదు నాకదే సంతోషంగా ఉంది'.

సూర్యం విస్తుపోయాడు లలిత తనకుమించి పెరిగి పోయినట్లనిపించింది జీవితం గురించి తనకే ఇంత స్పష్టమయిన అభిప్రాయాలు లేవు తను పోగొట్టుకున్నదేవీ లేదంది. నిజమే మరి లలిత?

'నువ్వు ఎన్ని చెప్పినా నువ్వు నష్టపోయిన మాట మాత్రం నిజం, లలితా!'

'అలా అనుకోడానికి ఇంకా టైంవుంది నే నొప్పుకుంటే మాకో లెక్చరరు నన్ను పెళ్లాడ్డానికి సిద్ధంగా ఉన్నాడు' లలిత పెదవులు సిగ్గుతో వొంపులు తిరిగాయి

సూర్యం మనసు తేలికైంది లలిత పెదవుల మీద ఇంకా చిరునవ్వు తుళ్లి పడుతూనే ఉంది సిగ్గుతో ఆకళ్లు సూటిగా చూడలేక పోతున్నాయి సూర్యానికిప్పుడు పసిపిల్లలా కన్పించింది. లలిత నవ్వింది సూర్యం నవ్వాడు

శాంత కాఫీ తీసు కొచ్చింది శాంతగదిలో అడుగు పెట్టేసరికి సూర్యం లలిత ఇద్దరూ మాట్లాడటం లేదు ఇద్దరూ చిరునవ్వులంది పుచ్చుకుంటున్నట్లున్నారు

కాఫీ తీసుకుని 'నువ్వు కూడా తెచ్చుకో' అన్నాడు సూర్యం.

'లేదు. ఇంకా మావయ్యకీ వాళ్ళకీ ఇవ్వాలి' అని శాంత వెళ్లిపోయింది

లలిత ఇంకోరోజు ఉండమన్నా ఉండలేదు. మళ్ళీ ఎక్స్‌కర్షన్ పార్టీని కలవాలట వెళ్లేముందు గంటసేపు చిట్టాడు పిన్నమ్మని వదలలేదు లలిత వాణ్ణి దింపలేదు సూర్యం లలితని బస్సెక్కించి వచ్చాడు సూర్యం మనసులో బరువు దిగిపోయింది. రాత్రి పడుకుని సూర్యం అదే ఆలోచిస్తున్నాడు. తనకూ లలితకీ మధ్యనున్న అగాధం ఈ జీవితంలో పూడదనుకున్నాడు ఇంత తేలిగ్గా అదృశ్యమయి పోతుందనుకోలేదు లలితని తలుచుకుంటే చెప్పలేని జాలి వేసింది మనసు ఆర్ద్రమై పోయింది. సూర్యానికి నిద్ర పట్టలేదు పన్నెండవుతోంది. మంచినీళ్లు తాగి వచ్చాడు పక్క మంచం మీద శాంత శాంత తన శాంత సూర్యం మనసులో పరవళ్లు తొక్కుతున్న కరుణ, జాలి, అభిమానం ఇప్పుడు ఏక ముఖంగా శాంత వైపు ప్రవహించాయి. శాంతని ఒక్కసారి దగ్గరకు తీసుకోందామనిపించింది. 'శాంతా!' మృదువుగా తట్టి లేపాడు.

శాంత ఇటు తిరిగింది శాంత కన్నుల్లో అశ్రుధారలు.

సూర్యం తలకిందయాడు 'ఏవిటి శాంతా .. ఏవిటిది!'

శాంత సమాధానం చెప్పలేదు లోపల దుఃఖం పొర్లుకొస్తోంది రెండు చేతుల్తో సూర్యాన్ని కౌగిలించుకుంది సూర్యానికి బోధపడలేదు "ఏం జరిగింది శాంతా . ఏవిటిది ?" శాంత జవాబు చెప్పలేదు. సూర్యాన్ని మరింత గాఢంగా హత్తుకుంది.

సూర్యం కంగారుపడ్డాడు. 'చెప్పు శాంతా .. అమ్మ ఏవన్నా అందా ఇంకెవరేమన్నా అన్నారా ... పోనీ మీ యింటికి వెళ్లాలనుందా ..'

'ఏంలేదు . ఏంలేదు' శాంత కళ్లు తుడుచుకుని సూర్యం గుండెకు అతుక్కుపోయింది


లలితను చూసి అసూయ పడిందా . లేదు అలాంటి స్వభావం కాదు ఎంత సర్వస్వంగా చూసుకుంటున్నాడో ఆమెకు తెలుసు లలిత రాక ఏరకంగానూ దుఃఖకారణం కాదు మరి ఎందుకు ఏడుస్తోంది ? సూర్యం తల్లడిల్లిపోయాడు. 'నన్నెందుకు బాధపెడ్తావ్ నువ్వు కంట తడి పెడ్తే నేను చూడలేనని నీకు తెలుసు సంగతేవిటో చెప్పవా '

శాంత కన్నీటికళ్ళు నవ్వాయి. కళ్ళు తుడుచుకుని "లేదు . . ఏం లేదు . . మీరు బాధపడొద్దు .. పడుకోండి ఏంలేదు " సూర్యాన్ని నిద్రపుచ్చింది శాంత.

తెల్లవారి సూర్యం కౌగిలి విప్పుకుని శాంత లేస్తున్నప్పుడు మళ్ళీ అడిగాడు 'రాత్రి ఎందుకు ఏడ్చావ్ ?'

తొలి సూర్యకిరణంలాంటి చిరునవ్వుతో, వానలో తడిసి ఉదయాన విప్పారిన పువ్వుల్లాంటి తన కళ్ళు సూర్యం కళ్ళలోకి పెట్టి, మృదువుగా ముద్దు పెట్టుకుని బయటికి నడిచి వెళ్లింది శాంత.

రామనాథం పదిరోజుల్నుంచి లేవటంలేదు. డాక్టరు రోజూ వచ్చి మందులిచ్చి పోతున్నాడు. జబ్బు ఫలానా అని తెలియదు "పెద్దతనం మరేం సుస్తీ లేదు" అన్నాడు డాక్టరు కాని, ఆయన రోజురోజుకీ నీరసించిపోతున్నాడు. భోజనం కూడా. శ్రీదేవమ్మ మంచం దగ్గరికే తీసుకెళ్తుండా



ఆయన ముఖంలో రానురాను కళ తగ్గిపోతోంది.

ఒకరోజు సంజెదీపాలు పెట్టాక రామనాథం ఇంట్లో అందర్నీ పిలిచాడు. అంతా మంచంచుట్టూ చేరారు. చిట్టాణ్ణి దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. సూర్యం తండ్రికి ఎదురుగా కూర్చున్నాడు. ఆయన గొంతులో ఉండే గాంభీర్యం కూడా తగ్గిపోతోంది. 'నాకు అరవైయేళ్లు వచ్చే మాఘమాసానికి నిండుతాయి' అన్నాడు.

శ్రీదేవమ్మ గొల్లుమంటూ కొంగు అడ్డం పెట్టుకుంది శ్రీదేవమ్మకు తెలుసు రామనాథం వెనక చెప్తూ ఉండేవాడు తన జాతకం ప్రకారం అరవయ్యో ఏట జీవితం చాలిస్తానని.

'ఎందుకే పిచ్చిదానా ఏడుస్తావ్ ! రత్నంలాంటి కొడుకును కన్నావ్. కూతుర్ని మంచి అయ్య చేతికి అప్పగించావు. నీ జన్మ తరించింది. మనవడు పుట్టాడు ఇంతవరకూ నువ్వు కష్టం అంటూ ఎరగవు. నీకే లోటూ లేకుండా జరిగిపోయింది. ఇకముందూ అట్లాగే జరుగుతుంది. నే చెప్తున్నా విను !'

'ఇప్పుడెందుకు నాన్నా ఆ మాటలన్నీ ...'

'ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చెప్పుకుంటారా ఇవన్నీ' ఆయన ముఖంలో శుష్కమైన నవ్వు.

'బతికినన్నాళ్లూ హాయిగా బతికాను తృప్తిగా ఇంత తిన్నాను. ఇతరుల కింత పెట్టాను. నన్ను గురించి అంతా మంచిమాటే అన్నారు. కాని ఎవరి నోటంటా చెడుమాట వినలేదు. నీలాంటి కొడుకు ... లక్ష్మీదేవిలాంటి కోడలు .. ముత్యాల్లాంటి మనవడు ...' అంటూ చిట్టాడివైపు నవ్వుతూ చూశాడు. చిట్టాడు బిక్కమొహంతో తాతగారివైపే చూస్తున్నాడు.

'ఇవన్నీ ఇప్పుడెందుకు నాన్నా డాక్టరు జబ్బేమీ లేదన్నాడు. నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది మీ రివన్నీ చెప్తే పిల్లలం మేమంతా కంగారు పడిపోమూ—'

రామనాథం మళ్లీ నవ్వాడు. 'కంగారెందుకు నాయనా ! పుట్టాక అంతా వెళ్లిపోవలసిందే. చెప్పొచ్చిందేమంటే దేవుడు నన్ను దయగా చూశాడు బతికినన్నాళ్లూ హాయిగా బతికాను. తృప్తిగా బతికాను. హాయిగా నవ్వుతూ వెళ్లిపోతాను నాకే విచారమూ లేదు. బతికుండగా నన్నింత సుఖపెట్టిన ఆ దేవుడు రమ్మని పిలిచి నప్పుడు నవ్వుతూ వెళ్లకపోతే బావుంటుందా ?'

సూర్యం గతుక్కుమన్నాడు. ఆ మాటలు శ్రుతి మించుతున్నాయి. కాని, ఆయన ముఖం చూస్తే ఏదో కాంతి కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది ఆయన కళ్లు వెలుగుతున్నాయి ఆ మీసాల చాటున చిరునవ్వు మృత్యువుకు స్వాగతం చెప్తున్నట్లుంది. ఈ ప్రాపంచిక భవనం గడప దాటుతున్న మనిషిలా కన్పిస్తున్నా డాయన తండ్రిలో ఇంత సంయమనం, ఆ మాటలు, ముఖంలో ఆ దీప్తి సూర్యాన్ని బొమ్మని చేశాయి.

ఇంతలో డాక్టరు వచ్చాడు అంతా లేచారు. డాక్టరు చెయ్యిచూసి 'నిన్నటికంటె మెరుగు' అన్నాడు. ఇంజక్షన్ ఇచ్చి వెళ్తూ బిక్కమొహంతో నుంచున్న సూర్యాన్ని చూసి 'అదేమిటోయ్ అంత కంగారు పడాల్సిందేమీ లేదు' అని బుజం తట్టి వెళ్లిపోయాడు.

సూర్యానికి భోజనం సయించలేదు. పగంలో లేచి వచ్చాడు. గడపలో మంచుని తండ్రి మంచం వైపు చూశాడు. ఆశ్చర్యం వేసింది ! తన్ను తాను నమ్మలేకపోయాడు. కళ్లు పెద్దవిచేసి చూశాడు.

రామనాథం కళ్లనుండి అశ్రువులు ధారాపాతంగా వస్తున్నాయి.

కొన్ని రోజుల లేత పసిగుడ్డు ఏడుపుకు, ఇంత ప్రపంచం చూసి ఇన్ని కష్టసుఖాల అనుభవాలతో రాటుతేలిన, ఇన్ని జీవితాల అనుభవసారం, నీళ్లు కారిపోయింది.

తనదైన ప్రేమ తనసుంచి వేరుకాదు—కాదు—కాదని తెలిసినా ఆ ఆలోచనే అశ్రువుల్ని కురిపించింది.

నిండు జీవితాన్ని అనుభవించి తృప్తిగా హాయిగా వెళ్లిపోతున్నానని మనసార విశ్వసించి దేవుడిచేయి అందుకోబోతూ కన్నీరుగా కరిగిపోతున్నాడు.

ఎందుకు? ?

ఈ జగత్తులోని వికాసానికి మూలమది. ★

11-6-1965 శుక్రవారం మొదలు
17-6-1965 గురువారం వరకు.

మీ	మే	వృ	మి
		ర బు గు రా	శు
శ	వారఫలం		
	మహేష్		శు
	కే	చం	

మేషం : వారం ప్రారంభంలోనే కొన్ని చికాకులకు గురి అయినా, వారాంతానికి అన్ని వ్యవహారాల్లోను తగినంత అభివృద్ధిని సాధించగలరు. మీరు ఏమి చేసినా తప్పుపట్టే ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు వ్యవహరించడంవలన వృత్తి వ్యాపారాల్లో మీ మంచితనం ఏమీ రాణించకపోవచ్చును. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. వారాంతంలో చేసే ప్రయాణాలు ఫలిస్తాయి. సంతోషకరమైన వార్తలను వింటారు ఆరోగ్యం బాగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. సాంఘిక వ్యవహారాల్లో ప్రముఖ పాత్రను నిర్వహించగలరు.

వృషభం : వారం ప్రారంభంలో సామాన్యంగా ఉన్నా వారం మధ్యలో వూహించని యిబ్బందులకు గురికాగల సూచనలు ఉన్నాయి. వ్యాపారంలో మీరు యిదివరకు ఎంతో కృషిచేసి ఒక దారికి తెచ్చిన వ్యవహారాల్లోనే కొత్త సమస్యలు తలయెత్తుతాయి. వృత్తిలో నూతనావకాశాలకోసం ప్రయత్నించడం వలన ప్రయాస తప్ప ప్రయోజనం ఉండదు. ఉద్యోగంలో మీ మంచితనాన్ని తమ స్వార్థానికి వినియోగించుకోవడానికి ప్రయత్నించే వ్యక్తులతో వ్యవహరించవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు బాగానే ఉంటాయి.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి ప్రయాణాలోచనలు చేస్తారు.

మిథునం : వృత్తి వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి, జరిగేది మరొకటి కావచ్చును. కాని జరిగింది కూడా మీకు ప్రయోజనకరమైనదే కావడం వల్ల ఈవారం ఫరవాలేదనే భావం కలుగుతుంది. భారీయెత్తున చేసే వ్యాపారాల్లో అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి వృత్తిరీత్యా చేసే ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. మీరు ఎంత జాగ్రత్తగా ఉన్నా, కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం చేయవలసి వస్తుంది కోర్టు వ్యవహారాలు బాగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉన్నా, బలహీనత కన్పిస్తుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం : వృత్తి వ్యాపారాల్లో అనుకోని వ్యయప్రయాసలకు గురి అయినా, తగిన ప్రతిఫలం ఉండడంవలన ఈవారం సంతృప్తికరంగా ఉంటుంది.

భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలకంటే మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా కొంతవరకు లాభిస్తాయి. వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. ఆదాయం బాగానే ఉన్నా, రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవలన యిబ్బంది కలుగుతుంది. వైద్యులకు కంట్రాక్టర్లకు మంచి సమయం.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. బంధువులకు సహాయం చేస్తారు. పుణ్య కార్యాలు చేస్తారు.

సింహం : ఈవారం అన్నివిధాలా ప్రోత్సాహకరంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగడంవలన ఆదాయం బాగా ఉంటుంది. వ్యాపారంలో మీకు మున్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించగలరు. వృత్తిలో నూతన మార్గాల ద్వారా ఆదాయం లభిస్తుంది. ఉద్యోగంలో అనుకూల వార్తలను వింటారు. వారాంతంలో చేసే ప్రయాణాలు లాభిస్తాయి. అనవసరమైన వ్యవహారాల్లో చిక్కుకొని యిటువంటి అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేసికొనే ప్రమాదం ఉంది. మిత్రులకు సహాయం చేస్తారు.

స్త్రీలకు—ఆరోగ్యం వారాంతం నుంచి బాగా ఉంటుంది. బంధువర్గంతో గౌరవం లభిస్తుంది. నూతన విషయాలు తెల్సుకొంటారు.

కన్య : ఏవో కారణాలవలన వృత్తి వ్యాపారాలలో ఇదివరకు ఆగిపోయిన వ్యవహారాలను యిప్పుడు పూర్తి చేయగలరు మీ స్వంత పనులే కాకుండా యితరుల వ్యవహారాలను కూడా చూడవలసిన అవసరం ఏర్పడడంవలన కార్యభారం పెరిగినా తుదకు అన్ని వ్యవహారాల్లోను అనుకూలతను సాధించగలరు. భారీయెత్తున చేసే వ్యాపారాల్లో మీ ప్రయత్నాలకు కొంతమంది మిత్రుల సహకారం లభిస్తుంది. ఉద్యోగంలో మీ అభిప్రాయాలను అమలుజరిపి అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. శుభకార్యాల విషయంలో అనుకూల వార్తలను వింటారు

తుల : ఈవారం మీరు ప్రయత్నించిన వ్యవహారాలకు ఆటంకాలు రావడం, అనుకోని వ్యవహారాలు నెరవేరడం వంటి సంఘటనలు జరుగుతాయి. మీరు స్వంతంగా చేసే వ్యాపారాలకంటే భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. వృత్తిలో కొన్ని అవకాశాలు యింద్రధనుస్సువలె ఆకర్షణీయంగా కనిపించినా అవి కార్యరూపాన్ని ధరించడం కష్టం. ఉద్యోగంలో మీ పరిస్థితి యిదివరకటికంటే బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కాగలదు.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సాటివారితో స్వల్ప భేదాభిప్రాయాలు రాగల సూచనలు ఉన్నాయి.

వృశ్చికం : వృత్తి వ్యాపారాల్లో మీరు కొంచెం అభివృద్ధిని సాధించినా, దాని నిమిత్తం మీరు పొందిన వ్యయప్రయాసలతో పోల్చినప్పుడు ఈవారం అంత సంతృప్తికరంగా ఉండదు. సాహసముతో కూడిన వ్యవహారాల్లో వారం ప్రారంభంలో నష్టం వస్తుంది వృత్తిరీత్యా చేసే ప్రయాణాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో మీరు మొగమాటాలకు లొంగిపోవడం వలన మున్ముందు యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. సాంఘిక వ్యవహారాల్లో ప్రయోజనం కల పరిచయాలు ఏర్పడతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు : ఏ వ్యవహారంలోను విశేషమైన అనుకూలతను ఆశించడానికి అవకాశంలేదు. వృత్తి వ్యాపారాల్లో సామాన్యమైన వ్యవహారాలకు కూడా ఎంతో కృషి చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. భారీయెత్తున చేసే వ్యాపారాలు వాయిదా వేయడం మంచిది. రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవలన మీ కార్యక్రమాలను మార్చుకోవలసి వస్తుంది ఇదివరకు మీవల్ల ఉపకారం పొందిన బంధువులే యిప్పుడు మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. కుటుంబ సంతోషం లభిస్తుంది. అలంకార వస్తువులు కొంటారు

స్త్రీలకు—ఆరోగ్యం యిదివరకటికంటే బాగా ఉన్నా ఆందోళన కలగవచ్చును. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి

మకరం : వారం ప్రారంభంలో అన్ని వ్యవహారాలు అనుకూలంగానే ఉన్నా, వారాంతానికి చికాకులు కలగడం వలన యీవారం మీరు సాధించినది ఏమీ


ఈ వారం ధరలు

అపరాల ధరలు నిలకడగా ఉంటాయి. బెల్లం ధర వారాంతంలో కొంచెం తగ్గుతుంది పసుపు ధర వారం ప్రారంభంలో పెరిగి తరువాత నిలకడగా ఉంటుంది. నూనె, నువ్వుల ధరల్లో పెద్ద మార్పులు రావు. అలంకార వస్తువుల ధరలు కొంచెం పెరుగుతాయి.

అందమైన కొత్త కానుక

ట్వీన్ టస్కర్

వస్త్రాల పరంపరలో
మరొక అంశం....



మీరు ఇంతకాలంగా ఎదురుచూస్తున్న సరికొత్త సృష్టి ఇదే—

ట్వీన్ టస్కర్ పాప్లిన్

చక్కగా తయారు చేయబడినది. న్యాయమైన ధర. నిండుగా, మెండుగా కనిపిస్తుంది. చిరకాలం మన మధ్యన మెసలుతుంది. ఎన్ని ఉతుకులు పడినా ట్వీన్ టస్కర్ పాప్లిన్ లోని నైపుణ్యమూ, నాజూకుతనమూ తగ్గవు.

ట్వీన్ టస్కర్‌ను గుర్తుంచుకోండి — అంతటి సరసమైన ధరలకు, ఇంతటి నాణ్యత కల మరేవస్త్రాలూ లభించవు.

ట్వీన్ టస్కర్ పాప్లిన్ రెండు రకాలలో లభ్యమవుతున్నది

మధురై మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై
నాణ్యతగల నూలుకు ప్రపంచ ప్రసిద్ధి పొందినది.
మేనేజింగ్ ఏజెంట్లు: ఎ & యఫ్ హార్వే లిమిటెడ్

హార్వే

ట్వీన్ టస్కర్

పాప్లిన్ - డ్రిల్ - కేంబ్రిక్

మదురకు చేరిన హార్వేస్

SHB3/MMC/23 A-TEL

వారఫలం

ఉండకపోవచ్చును. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలివేయడం మంచిది. వారారంభంలో సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభిస్తాయి. వృత్తిలో కొత్తవారి పోటీని ఎదుర్కోవలసి వస్తుంది. కోర్టు వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది ప్రయాణాలు ఫలిస్తాయి

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు మామూలుగా ఉంటాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది.

కుంభం : గతవారం కంటే యీ వారం బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా ఆదాయం బాగా ఉంటుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు చురుకుగా సాగుతాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలకు ఇదివరకు ఏర్పడిన అవరోధాలు తొలగిపోతాయి వృత్తిలో యితరులమీద ఆధారపడి యే వ్యవహరమూ ప్రారంభించడం తగదు రావలసిన డబ్బు సమయానికి అందుతుంది రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు బలహీనపడడం వలన మీ అభివృద్ధి మార్గం నిష్కంటకం కాగలదు.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. పొటివారిలో గౌరవం బాగా ఉంటుంది. పుణ్య కార్యాలు చేస్తారు.

మీనం : మీరు ఘన విజయాన్ని ఏమీ సాధించలేక పోయినా, వృత్తి వ్యాపారాల్లో మీకు యిదివరకు యిబ్బంది కలిగించిన వ్యవహారాలు మీకు అనుకూలంగా పరిష్కారం కావడంవలన ఈవారం సంతృప్తికరంగానే ఉంటుంది వ్యాపారంలో మీ అభిప్రాయాలకు తగిన అవకాశాలు లభిస్తాయి. వృత్తిలో యిదివరకు ఉన్న పోటీ తగ్గడం వలన మానసికంగా విశ్రాంతి లభిస్తుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. సాంఘిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్వల్ప అనారోగ్యం చేయవచ్చును.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు బాగా ఉంటాయి సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. సంఘ సేవికలకు మంచి సమయం. ★

జన్మదినఫలం

జూన్-11

వృత్తి వ్యాపారాల్లో ఇంతవరకు మీకు అనుకూలంగా ఉన్నవారే యిప్పుడు మిమ్మల్ని వ్యతిరేకించడం వలన మీవారెవరో, పైవారెవరో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది భారీ ఎత్తున చేసే వ్యాపారాల్లో నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. వృత్తిలో మీరు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అవస్థ మీది, అనుభవం మరొకరిది కాగల సూచనలు ఉన్నాయి. సాహసముతో కూడిన వ్యాపారాలకు పూనుకోవడం మంచిదికాదు. ఉద్యోగంలో యితరులు చేసిన పొరబాట్లకు కూడా మీరే బాధ్యత వహించవలసి వస్తుంది అనారోగ్య సూచనలు ఉన్నాయి. కుటుంబ కార్యక్రమాలు బాగా ఉంటాయి. సంవత్సరాంతంలో వ్యాపారంలో అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. విద్యార్థులు చాలా శ్రద్ధగా చదవడం అవసరం.

జూన్-12

ఈ సంవత్సరం మీ జీవితంలో చాలా ముఖ్యమైనది. ఇంతవరకు కేవలం ఆశయాలుగా మీ ఊహాపథంలో ఉన్న విషయాలు యిప్పుడు కార్యరూపాన్ని ధరించగల సూచనలు ఉన్నాయి భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలకంటె మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో యిదివరకు చేజారిపోయిన అవకాశాలు కూడా తిరిగి లభిస్తాయి ఉద్యోగంలో ఉన్నతస్థానం లభించగల సూచనలు ఉన్నాయి అనవసరమయిన వ్యవహారాల్లో చిక్కుకొని యిటు వంటి అమూల్యమైన కాలాన్ని వ్యర్థం చేసికొనే ప్రమాదం ఉంది. ఆరోగ్యం బాగా ఉంటుంది కుటుంబం సంతోషం లభిస్తుంది విద్యార్థులకు క్లాసు రాగల సూచనలు ఉన్నాయి.

జూన్-13

గత సంవత్సరం కంటే యీ సంవత్సరం ప్రోత్సాహకరంగా ఉంటుంది వృత్తి వ్యాపారాల్లో మీకు కొంతమంది ప్రముఖ వ్యక్తుల తోడ్పాటు లభించడంవలన తగినంత అభివృద్ధిని సాధించగలరు. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో యిదివరకు ఏర్పడిన అవరోధాలు తొలగిపోతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా కొంతవరకు లాభిస్తాయి ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు వస్తాయి ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి ఆరోగ్యం బాగా ఉంటుంది కుటుంబ సంతోషం లభిస్తుంది. బంధువుల వ్యవహారాల్లో ఆందోళన కలుగుతుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. విద్యార్థులకు మార్చి పరీక్షలు బాగా ఉంటాయి.

జూన్-14

వృత్తి వ్యాపారాల్లో ప్రారంభంలో వ్యయ ప్రయాసలకు గురి అయినా, తుదకు విజయాన్ని సాధించడంవలన యీ సంవత్సరం సంతృప్తికరంగానే ఉంటుంది మీ స్వంత పనులే కాకుండా మిత్రుల వ్యవహారాలను కూడా చూడవలసిన అవసరం ఏర్పడడంవలన కార్యభారం పెరుగుతుంది నూతన వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి కొన్ని వ్యవహారాల్లో ఆకస్మికంగా అధిక వ్యయం జరగడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది వృత్తిలో పోటీదారులతో పోటీ పెరగడంవలన మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి బాగానే ఉంటుంది. ఆరోగ్యం బాగా ఉంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి. విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కాగలరు.

జూన్-15

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో అప్పుడప్పుడు కొన్ని అవాంఛనీయమైన పరిస్థితులు ఏర్పడినా, మొత్తంమీద తగిన అభివృద్ధిని సాధించగలరు అధికారులవలన జరగవలసిన వ్యవహారాల్లో యితరుల జోక్యంవలన ఆలస్యం జరుగుతుంది. భారీయెత్తున చేసే వ్యాపారాల్లో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. వృత్తిలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. ప్రయాణాల్లో మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది ఆరోగ్యం బాగానే ఉన్నా, కాలడం, జారిపడడం వంటి ప్రమాదాలు కలగవచ్చును. కుటుంబ వ్యవహారాల్లో భేదాభిప్రాయాలు వస్తాయి విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కాగలరు.

జూన్-16

ఈ సంవత్సరం మీరు ఘన విజయాల్ని ఏమీ సాధించలేకపోవచ్చునుగాని నిరుత్సాహం పొందవలసిన అవసరం కూడా ఉండదు. వృత్తి వ్యాపారాల్లో కొన్ని అవకాశాలు యింద్రధనుస్సువలె ఆకర్షణీయంగా కన్పిస్తాయి కాని అవి కార్యరూపాన్ని ధరించడం కష్టం. వ్యాపారంలో సంవత్సరాంతంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. వృత్తిలో మీరు యిదివరకు కొన్ని వ్యవహారాలను నిర్లక్ష్యం చేయడంవలన యిప్పుడు మీరు పొందవలసిన ప్రయోజనాన్ని పొందలేరు. ఉద్యోగంలో మీ పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. విద్యార్థులు చాలా శ్రమమీద కృతార్థులు కాగలరు.

జూన్-17

ఈ సంవత్సరం గత సంవత్సరం కంటె బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో అధిక వ్యయం జరిగినా, తగిన ప్రతిఫలం కూడా ఉంటుంది భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభించడంవలన ఆదాయం పెరుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో యితరుల జోక్యంవల్ల నష్టం వస్తుంది. ఉద్యోగంలో మీరు యితరులకు ఉపకారం చేయడానికి ప్రయత్నించడంవలన అనవసరమైన ప్రయాసకు గురి కాగలరు. రక్తసంబంధమైన అనారోగ్యం చేయవచ్చును. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది బంధువులకు సహాయం చేస్తారు విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కాగలరు. ★

వనితాలోకం



లిండా, లూసీ అనే ఇద్దరమ్మాయిల దైనందిన జీవితం...

—అక్కాచెల్లెళ్లు లూసీ, లిండా.

అమెరికా అధ్యక్షుని కుమార్తెలు!

"మా నాన్న అధ్యక్షుడయిన మొదట్లో నా కొత్త పరిస్థితి నాకే అర్థమయ్యేది కాదు... పోను పోను, నా కర్తవ్యమేమిటో కొంత తెలుసుకోవటం మొదలుపెట్టాను."

'దేశంలో కెల్లా పెద్ద కుటుంబంలో సభ్యులయిన వారు తమ కొత్త బాధ్యతలని గురించి ఏమనుకుంటారనే ప్రశ్నకి లూసీబెయిన్స్ జాన్సన్ పై సమాధానం ఇచ్చింది. ఒక విధంగా చూస్తే ఆమె అక్కయ్య లిండాబర్డ్ కి కూడా ఇదే జవాబు వర్తిస్తుందేమో!

కొత్త వాతావరణం

ఇద్దరమ్మాయిలూ వాషింగ్టన్ లో పుట్టి పెరిగిన వాళ్ళే కాబట్టి ఈ కొత్త పరిస్థితికి తొందరగా అలవాటు పడ్డారన్నా తప్పులేదు. లిండా 19—3—44 న పుట్టింది. లూసీ జన్మదినం 2—7—47. అప్పటికి వాళ్లనాన్న 'హౌస్ ఆఫ్ రిప్రెసెంటేటివ్స్' లో సభ్యుడు. వాళ్లకి రాజకీయ వర్గాల వారి పిల్లలు ఎందరితోనో చిన్నప్పుడే తిరగటం అలవాటయింది.

శ్రీ జాన్సన్ 1948 లో సెనేటర్ అయ్యారు. 1960 లో ఉపాధ్యక్షుడుగా ఎన్నిక అయ్యారు. పిల్లలిద్దరూ ఇంకా ఇంకా ప్రజల దృష్టిలో పడ్డారు. కాని చిన్నప్పటి నుంచి వాళ్ల అమ్మా నాన్న వీళ్ళిద్దరికీ అణకువ, సహనం, విశ్వాసం, వినయం యొక్క విలువ బాగా నూరి పోశారు. రాజకీయాలలో "—పనికాని, మనిషి కాదు ముఖ్యం." అనేదిట వాళ్ల అమ్మగారు ఎప్పుడూ.

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం

శ్రీ జాన్సన్ తనకుమార్తెలకి స్వంత అభిప్రాయాలు ఉండాలనేవాడు. అంతేకాక, వాటిని జాగ్రత్తగా విని పరిశీలించేవాడు. అందుకనే, లిండాకి జాతీయాంతర్జాతీయ వ్యవహారాలంటే చాలా ఆసక్తి. అప్పుడప్పుడు తండ్రితో ఆరోజు వార్తాపత్రికల 'హెడ్ లయిన్స్' ని గురించి మాట్లాడుతూ ఉంటుందిట.

లిండాకి స్కైయింగ్, షార్ట్ హేండు కూడా వచ్చు. సెనవిసెలవల్లో చిన్న ఉద్యోగం ఒకటి చేసింది (వాళ్లు నడిపే ఒక రేడియోస్టేషన్ లోనే).

సరదా జీవితం

లూసీ తరహాయేవేరు. స్కూల్లో బాగానే చదువుతుందనే పేరు ఉన్నప్పటికీ పుస్తక పఠనం అనే అలవాటు అంతగా అబ్బలేదంటుంది తనే. "మా అక్కయ్య ఎప్పుడూ చదువుతూ ఉంటుంది...." అంటుంది. పల్లని కోపపడద కల ఈ అమ్మాయి తనకి తన సోదరి కన్నా నిలకడ తక్కువ అని చెప్పుకుంటుంది. "ఎప్పుడూ నిగ్రహించుకు కూర్చుంటే ఎలా?" అంటుంది. తన ఈడువారితో ఈమె చాలా కలిసి కట్టుగా తిరుగుతుంది.


లూసీకి ఇంటిపనులంటే కూడా ఇష్టం. కుట్టుపని, వంట బాగా అలవాటే...ఇంతేకాక, పియానో బాగా వాయిస్తుంది, తనే పాటలు కట్టగలదు... 1964 లో ప్రఖ్యాత పియానో వాద్యగాడు వాంట్ క్లిబర్న్ ఆమెని తను నిర్మించిన 'పీటర్ ఎండ్ ది వుల్ఫ్' అనే సంగీత నాటికలో కథచెప్పే పాత్ర ఇచ్చాడు. విన్నవారందరూ ఆమెని ప్రశంసించారు. లూసీకి ఫ్రుగ్, వాటుసీ అనే డాన్సులు ఇష్టం. అవి చేసి ఎందరి మన్ననలో పొందిందని వింటాము. "...తను అమెరికన్ యువలోకంలో ఆదర్శంగా జీవించి చూపించాలనే కోరిక (లూసీకి) ఉంది," అని శ్రీమతి జాన్సన్ అన్నారు ఇటీవలే.

విద్యాభ్యాసంపట్ల భక్తిశ్రద్ధలు

లిండా, లూసీలు ఇద్దరూ తమకి చరిత్రని 'దగ్గర' నుండి చూసే అవకాశం ఉందని గ్రహించినవారే; వాటిని బాగా ఉపయోగించుకుంటున్నవారే. లిండా గ్రీక్ రాజు పెళ్లికి వెళ్లి వచ్చింది. తన తండ్రి తరఫున వాషింగ్టన్ లో విన్ స్టన్ చర్చిల్ మరణం సందర్భంలో జరిగినచర్చి సర్వీసుకి శ్రీ జాన్సన్ అనారోగ్యం వల్ల వెళ్లలేక పోయినప్పుడు కూడా లిండా అమెరికన్ అధ్యక్షుడి ప్రతినిధిగా వెళ్లింది.

ఇక చదువు — ఇద్దరూ తమ విద్యాభ్యాసాన్ని అశ్రద్ధ చెయ్యకుండా నెగ్గుకుంటూ వస్తున్నారు... శ్రీమతి లేడీబర్డ్ జాన్సన్ వాళ్లకి చెప్పిందట ఒకసారి, "అనుమానం వస్తే మీ వ్యక్తిత్వాలకి న్యాయంచేకూరేట్లు చూసుకోండి!" అని.

ఈ సలహాని లిండా, లూసీ జాన్సన్ లు ఇద్దరూ బాగానే పాటిస్తారనవచ్చు!



చిన్నపిల్లలతో లూసీ ముచ్చట్లు!

వేసవి ప్రత్యేకతలు

రోళ్ళు బద్దలయ్యే రోహిణీకార్తెలో కూడా నాలుగైదు ఎండలు ఎండనిదే ఒడియాలు గలగలలాడవంటే ఇంక సామాన్యపు ఎండలో పెడితే వేరే చెప్పాలా ? పిల్లలకి సెలవులే కదా కాస్త విశ్రాంతి తీసుకొందామనుకునే గృహిణికి ఈ వేసవిలో అసలు తీరికే ఉండదు ఊరగాయలు, ఒడియాలు, అప్పడాలు హడావిడితో !

చౌడివడియాలు

చౌళ్ళు రేపు ఒడియాలు పెడతామనగా ఈ రోజే బాగుచేసి పొద్దున్నే నానపొయ్యాలి సాయంత్రం రుబ్బి పాలు తీసి గిన్నెలో ఉంచాలి కదపకుండా ఉంటే తెల్లారేసరికి నీరు పైకి తేలుతుంది ఆ నీరంతా పారపోసి మిగిలిన చిక్కటి పాలల్లో పచ్చిమిరపకాయలు, ఉప్పు దంచి రసంతీసి పాలల్లో పోసి పొయ్యిమీద పెట్టి అడుగు అంటకుండ కలుపుతూ ఉండాలి చిక్కపడ్డాక దించి చిన్నచిన్న ఒడియాలులా పెట్టుకోవాలి ఎండనిచ్చి మధ్యాహ్నం టిఫిన్‌గా వేయించుకు తినవచ్చు.

ఇల్లా రాగులు, గోధుమలు, వేరుశనగ గుళ్ళు, బాదంపప్పు ఒడియాలు పెడితే రోజూ టిఫిన్‌కి తడుముకోనక్కరలేదు

టమేటా వడియాలు

టమేటాలు కిలో
అటుకులు అర కిలో
పచ్చిమిరపకాయలు పావుకిలో
రెండు కొత్తిమిర కట్టలు, ఉప్పు.

టమేటాలు ముక్కలు తరిగి ఉంచుకోవాలి. ఉప్పు, కొత్తిమిర, పచ్చిమిర్చి మెత్తగా దంచి, టమేటా ముక్కలు, అటుకులు వేసి రెండు రుబ్బులు రుబ్బి తీసి పావుగంట పోయాక ఒడియాలు పెట్టాలి ఇవి విడదలేచాక ఉత్తనోటిని తిన్నా, వేయించుకు తిన్నా బాగుంటాయి.

రేగి వడియాలు

రేగిపళ్ళు కిలో
పచ్చిమిర్చి పావుకిలో
కొత్తిమిరి కట్టలు రెండు, ఉప్పు.

రేగిపళ్ళు విడతీసి పుచ్చులు, పురుగులు లేకుండా చూసుకోవాలి పచ్చిమిర్చి, ఉప్పు, కొత్తిమీర మెత్తగా దంచి రేగిపళ్ళు వేసి గింజ పలక్కుండా తొక్కి ఒడియాలు పెట్టి మధ్యాహ్నం ఏ పత్రికో తిరగేస్తూ ఉత్తనోటిని తినవచ్చు గింజ గనుక వచ్చిరిస్తే ఎంత రుచిగా ఉంటుందో ...

క్యాలీఫ్లవర్ వడియాలు

క్యాలీఫ్లవర్ ఒకటి
సెనగపప్పు పావు కిలో.

సెనగపప్పు నాలుగు గంటలు నానాక కడిగి తగినన్ని మిరియాలు ఉప్పువేసి బరక బరకగా రుబ్బుకోవాలి. క్యాలీఫ్లవర్ కోళ్ళు కోళ్ళుగా గిల్లి రుబ్బిన సెనగపిండిలోవేసి కలిపి ఒడియాల్లా పెట్టాలి. ఇవి టిఫిన్‌కేకాక అన్నంలో పొదుపుకుతిన్నా బాగుంటాయి మిరియం ఇష్టంలేని వారు పచ్చిమిర్చి వేసుకోవచ్చు.

బెండవడియాలు

లేత బెండకాయలు అర కిలో.
కందిపప్పు పావు కిలో
సరిపడా ఎండుమిర్చి, ఉప్పు, ఇంగువ

కందిపప్పు నాలుగు గంటలు నానాక కడిగి ఎండుమిర్చి, ఉప్పు, ఇంగువవేసి రుబ్బి, బెండకాయలు చక్రాల్లా తరిగి కలిపి ఒడియాలు పెట్టాలి ఇవి అన్నంలోకి చాలా బాగుంటాయి

పుదీనా కొత్తిమీరి వడియాలు

పెసరపప్పు పావు కిలో
రెండు కట్టలు కొత్తిమీర లేక పుదీన
పచ్చి మిర్చి, ఉప్పు


పెసరపప్పు రెండు గంటలు నానాక కడిగి పచ్చిమిర్చి, ఉప్పువేసి గట్టిగా రుబ్బి, కొత్తిమీరేనా పుదీనా ఐనా తరిగి కలిపి ఒడియాల్లో పెట్టి వేయిస్తే అన్నంలోకి సాయంత్రం అప్పుడు కూర వెతుక్కోనక్కరలేదు.

రకరకాల వడియాలు

పొట్టు మినపప్పు అర కిలో
అరవీశ మిరపపండ్లు
పావుశేరు ఉప్పు, అర తులం ఇంగువ
కిలోన్నర ఉల్లిపాయలు,
కిలోన్నర క్యాబేజీ
కిలోన్నర కంద
కిలోన్నర ఉస్తికాయలు
రెండు ఆనపకాయలు
పెద్దవి రెండు కట్టలతోటకూర
అర్ధశేరు నానేసి వడేసిన సెనగపప్పు
ఆరేడు కురిడీల కొబ్బరికోరు

పొట్టు మినపప్పు నానేసి పొట్టుతీసి రుబ్బాలి. పచ్చిమిర్చి, ఉప్పు, ఇంగువ మెత్తగా నంచి రుబ్బిన మినపిండిలో కలిపిఉంచుకోవాలి ఉల్లిపాయలు, క్యాబేజీ, తోటకూర సన్నగా తరుక్కోవాలి. తరిగిన ముక్కలు, కొబ్బరికోరు, సెనగపప్పు, వేటికవి విడి విడిగా కారం కలిపిన మినపపిండిలోవేసి కలపాలి వడియాలు పెట్టి ఎండనియ్యాలి.

ఆనపకాయ సన్నగా ముక్కలు తరిగి ఉప్పు రాసి పిండాలి ఉస్తికాయలు మెత్తగా దంచి గింజలుపోయేదాకా శుభ్రంగా కడగాలి



ఇవి వేడి వేడిగా [illegible] మినపపిండిలో కలిపి ఒడియాలు పెట్టాలి. ఇవి టిఫిన్‌గా కూడా బాగుంటాయి.

అరటిపండు వడియాలు

మాగిన అరటిపళ్ళు డజను
కొట్టిన బియ్యపు పిండి అర్ధసోలు
కాసిని మిరియాలు
చిటికెడు మిఠాయి రంగు

అరటిపళ్ళు వల్చి ముక్కలు తరిగి మిరియాలు వేసి రుబ్బాలి బియ్యపుపిండిలో రెండు గ్లాసుల నీరుపోసి కలపాలి అరటిపళ్ళ గుజ్జు నీళ్ళు కలిపిన బియ్యపుపిండిలో కలిపి ఉడకపెట్టి చిన్న చిన్న వడియాల్లా పెట్టి ఎండపెట్టాలి ఇవి నేతిలో వేయిస్తే అప్పాల్లా ఉంటాయి మిరియాలు ఇష్టంలేకపోతే ఏలకుపొడి వేసుకోవచ్చు తియ్యగా ఉంటాయి కనుక పిల్లలు తిన్నన్ని పెట్టినా జబ్బు చెయ్యవు ఒడియాలు పెట్టేముందు రంగు కలపాలి.

పిండివడియాలు

బియ్యం నానపోసి కొట్టించి, జల్లించిన మెత్తటి పిండి ఒక గ్లాసు, నాలుగు గ్లాసులు నీళ్ళు, కాస్త పుల్లమజ్జిగ, పచ్చిమిర్చి, వుప్పు

ఉప్పు, పచ్చిమిర్చి మెత్తగా దంపి నీళ్ళుపోసి దాంట్లో వడకట్టాలి రెండు గ్లాసుల నీళ్ళు ఎసరు పెట్టి మిగతా రెండుగ్లాసుల నీళ్ళల్లో పిండి ఉండలు లేకుండా కలపాలి పచ్చి మిరపరసం, నీళ్ళలో కలిపిన పిండి ఎసట్లోపోసి అడుగంట కుండా కలిపి జంతికలగొట్టంలోవేసి జంతికల్లా తిప్పి ఎండపెట్టాలి. తిప్పేముందు మజ్జిగవేసి కలిపితే తెల్లగా ఉంటాయి

ఎండాక గుడ్డ తిరగేసి నీళ్ళు చల్లి, ఎనిమిది, పది నిముషాలుంచితే జంతికల షేపు చెడకుండా వస్తాయి. ఇవి రెండు ఎండలు ఎండనిస్తే టిఫిన్ చెయ్యడానికి బద్ధకంగా వున్న రోజు వేయించ వచ్చు

కొందరు దీన్నే మూడు గ్లాసుల ఎసరు, మూడు గ్లాసుల నీళ్ళతో పిండి కలిపి పల్చగా ఉడికించి చెమ్చాతో ఒడియాల్లా పెడతారు

వంటలు

సగ్గుబియ్యపు వడియాలు

ఒక గ్లాసు బాగుచేసిన సగ్గు బియ్యం.
నాలుగు గ్లాసుల నీళ్ళు
పచ్చిమిర్చి, ఉప్పు, నిమ్మకాయ

నీళ్ళు మరుగుతోంటే సగ్గు బియ్యం, పచ్చి మిరప రసంపోసి కలిపి ఉడికాక దింపాలి. నిమ్మ కాయ రసం పోసి కలిపి ఒడియాల్లా స్పూన్‌తో పెట్టాలి. ఇవి ఎండాక వేయిస్తే పూసలు పూస లులా విచ్చి ఎంతో బాగుంటాయి

ఒక సంగతి, పప్పులతో పెట్టే ఒడియాల్లో కాక, మిగతా వాటన్నిటిలో కూడా బజార్లో అమ్మే రక రకాల రంగులు ఒడియాలు పెట్టే ముందు కలిపి పెడితే వేయించాక రంగు రంగు లతో తమాషాగా ఉంటాయి ఇవి ప్లేట్లలో నాలు గైదు రంగులవి కనుక పెడితే విచ్చిన పూవుల్లా కంటికి ఇంపుగా ఉంటాయి.

పూరువడియాలు

తెలగపిండి పావు కిలో
చారెడు వాము
ఆరు వెల్లుల్లిపాయలు, ఉప్పు
పుల్లమజ్జిగ

తెలగపిండి చిన్న చిన్న ముక్కలుచేసి పుల్ల మజ్జిగలో మూడు రోజులు పూరనియ్యాలి మధ్య మధ్య చూస్తూ మజ్జిగ పీల్చుకుంటే పోస్తూ ఉండాలి నాలుగోరోజు ఉప్పు, వాము, వెల్లుల్లి రేకులువేసి మెత్తగా దంపి ఒడియాలు పెట్టాలి ఇవి ఎక్కువ విశాఖపట్నంసైడు పెడతారు ఈ వాసన అందరికీ ఇష్టం ఉండదు కనుక పెట్టి చూసుకోండి.

బూడిదగుమ్మడి వడియాలు

బూడిద గుమ్మడి ఒడియాలు పెట్టడం అంద రికీ తెలిసే ఉంటుంది రెండు స్పూన్ల మెంతులు నానపోసి రుబ్బి ఒడియాల పిండిలో కలిపిపెడితే బాగా గుల్లవి విచ్చుతాయి

పొట్టువడియాలు

మినపపొట్టు శుభ్రంగా కడిగి ఉప్పు, కాసిని మిరప పెరెడ్లు, ఇంగువ పలుకు, అర్ధసోలు నానపప్పు కాస్త మినపపిండివేసి రుబ్బి అత్తుకున్నాక ఒడి యాలు పెట్టాలి

ఒడియాలు అయ్యాయా ఇంక అప్పడాలు

లేతపనసకాయ అప్పడాలు

లేత పనసకాయ చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఉప్పూ, మిరపకాయలూ, ఇంగువవేసి మెత్తగా రుబ్బి చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి అరటి ఆకుమీద పల్చగా చేత్తోవత్తి ఎండాక నూనెలో వేయిస్తే చాలా రుచిగా ఉంటాయి.

బంగాళాదుంపల అప్పడాలు

బంగాళా దుంప రెండు ముక్కల్లాచేసి ఉడి కించి తొక్కవల్చి, పచ్చిమిర్చి, ఉప్పు వేసి మెత్తగా రుబ్బి ఉండలుచేసి అరటి ఆకుమీద అప్పడాల్లా వత్తి ఎండపెట్టాలి ఇవి వేయించుకొన్నా, కాల్చుకు తిన్నా బాగుంటాయి

ఇల్లాగే పెండలం, చిలకడ దుంపలు అప్ప డాలు చేసుకోవచ్చు

గోధుమపిండి అప్పడాలు

జల్లించిన గోధుమ పిండిలో ఉప్పు, జీల కఱ్ఱ వేసి గరిట జారుగా కలపాలి స్టౌ అంటించి మూతి వెడల్పు గిన్నెకి వాసిన కట్టి నీళ్ళు పోసి స్టౌమీద పెట్టాలి అరిటాకుకు నూనె రాసి గరిటతో సగం పిండి అరటాకుమీద వేసి పల్చగా ఆకంతా గుండ్రంగా రాసి వాసిన మీదపెట్టి ఐదు నిముషాలుంచి తీసి కొద్దిగా ఆరాక వొలిచి బట్టమీదవేసి ఎండబెట్టాలి ఇవి వేయిస్తే తెల్లగా మిస మిసలాడుతగా ఉంటాయి.

ఇల్లాగే మైదాపిండితో కూడా వేయవచ్చు. ఇష్టమైనవారు జీలకఱ్ఱ బదులు మిరియం వేసు కొంటే బాగుంటాయి

బియ్యపు అప్పడాలు


పావుశేరు తెల్లటి బియ్యం శుభ్రంగా ఐదారు సార్లు కడిగి నాన పొయ్యాలి మర్నాడు సాయంత్రం రుబ్బు రోలూ పాత్రం చేతులూ కడుక్కుని దోసెల పిండిలా మెత్తగా రుబ్బాలి స్టీల్‌గిన్నెలోకి తీసి మూత పెట్టి ఉంచాలి ఆ మర్నాడు చేతులూ, రోలూ, పాత్రం శుభ్రంగా కడుక్కుని రుబ్బి ఉంచిన బియ్యపు పిండిలో ఉప్పువేసి మళ్ళీ మెత్తగా రుబ్బాలి రోటిమీద వేత్తో పిండిని రాస్తే మెత మెర లాడకూడదు

మూడోరోజు భోజనా లయ్యాక మైదాపిండి అప్పడాల్లా చేసుకోవాలి

అప్పడాలు

(1) చాయ మినపప్పు శేరు
(2) అర్ధశేరు చాయ పెసరపప్పు,
(3) శేరు చాయ పెసరపప్పు అర్ధసావుచాయ మినపప్పు
(4) పొట్టు మినపప్పు శేరు.

అర్ధసావులో సగం సీమ మిరపకాయలు దంచిన గుండ, అర్ధసావు వుప్పు నీళ్ళల్లో నానపొయ్యాలి. తులం ఇంగువ మెత్తగా కొట్టి నీళ్ళలో నాన పొయ్యాలి.



చాయపప్పులైతే ఎండపెట్టి మిల్లులో పొయ్యాలి. శేరు పప్పుకి శేరున్నర పిండి వస్తుంది నూటఏభై లేక నూటడెబ్భైఅయిదు అప్పడాలు అవుతాయి

పొట్టు మినపప్పు నానపోసి పొట్టుతీసి ఎండ పెట్టి పిండి పట్టించాలి పిండిలో కారం, ఇంగువ పాలు, సోడావేసి గుచ్చెత్తాలి. ఉప్పునీళ్ళు పోసి చిన్న ఉండచేసి నోట్లో వేసుకుంటే ఉప్పు సరి పోతే సరిపోయినట్టు లేకపోతే సరిపడా ఉప్పు నీళ్ళల్లో వెయ్యాలి.

మినపపిండి అయితే మూడు గంటలు నానాక రోట్లో నూనె రాసి పిండివేసి రోకలితో మర్దిం చాలి. చిన్న చిన్న ఉండలుచేసి కొట్టిన బియ్యపు పిండితో వత్తుకోవాలి

పెసర, లేక పెసర కలిపిన పిండి అయితే ఓ గంట నానాక చేత్తో మర్దించి వత్తుకోవాలి.

సీమ మిరపకాయలు దొరకకపోతే పచ్చిమిర్చి దంపి రసంతీసి పోసి కలుపుకోవచ్చు మిగిలిన పచ్చి మిర్చి తుక్కులో వాము, ఉప్పువేసి దంపి ఎండ పెట్టి నేతిలో వేయించి చిన్న పిల్లలకి అన్నంలో వేసిపెడితే అజీర్తి చెయ్యదు.

అప్పడాలు, ఒడియాలు అయ్యాయికదా ఈ వేసవి కాలంలో మామిడికాయ పప్పు రోజూ విడిచి రోజూ చేసినా పిల్లలూ, పెద్దలూ మళ్ళీ చెయ్యమంటూ ఉంటారు. ఇంక భోజన ప్రియులు అందులోకి వూరు మిరపకాయల కావాలంటారు మరి.

మెంతి మిరపకాయలు

అరసోలడు మెంతులు

అరసోలడు ఉప్పు

కిలో పొట్టలావు పచ్చి మిరపకాయలు

మెంతులు బాగుచేసి రాత్రి నానపొయ్యాలి మర్నాడు ఉదయం మెంతులు కడిగి ఉప్పువేసి మెత్తగా రుబ్బాలి. ముచికవున్న మిరపకాయలకి పొట్ట చీల్చి అందులో రుబ్బిన మెంతి పిండి పెట్టి మిరపకాయలు గలగలలాడే దాకా ఎండ వియ్యాలి ఇల్లాగే ఉప్పూ వామూ దంపి కూరి ఎండపెట్టవచ్చు.

నిమ్మ మిరపకాయలు

పాతిక నిమ్మకాయల రసంలో అర్ధపావు ఉప్పు పసుపువేసి కలిపి మిరపకాయలకి పొట్ట చీల్చి ఇందులో వేసి మూడు రోజులు వూరనియ్యాలి మూడోరోజు పిడిచి ఎండపెట్టి రాత్రి మళ్ళీ నిమ్మరసంలో వెయ్యాలి ఇలా రసమంతా పీల్చు కునేదాకా వేస్తూ ఉండాలి రసం అయిపోయాక గలగలలాడేలా ఎండనియ్యాలి.

ఇల్లాగే పుల్ల మజ్జిగలో కూడావేసి చేసుకో వచ్చు

నిమ్మరసంలో అల్లం, మామిడిఅల్లం, ముల్లంగి సన్నగా ముక్కలు తరిగి మిరపకాయల్లా ఎండ పెట్టి వేయించుకోవచ్చు. ఉత్తనోటితోనే చప్పరించ వచ్చు.

ఈ ఒడియాలూ, అప్పడాలూ చెయ్యటం వల్ల కూరలు దొరకని వేసవి కాలంలో ఎంతో ఉపయోగంగా ఉండి ఖర్చు కలసి వస్తుంది. ఇల్లా లికి స్టౌ దగ్గర కూచునే శ్రమా తప్పుతుంది

—వి. హేమలతా కైలాసం.★

సీరియల్

పసిడి మనసులు



హరికిషన్

2

ఆ మర్నాడంతా ఆ చెవిటావిడతో జరిగిన సంభాషణ తల్లితో, తండ్రితో చెప్పి పొట్ట చెక్కలయ్యేట్టుగా నవ్వుకుంది జ్యోతి.

"ఆవిడ భర్తగారికి ధార్మిక కేసరి అనే బిరుదు ఉన్నదిట నాన్నారూ" అన్నది జ్యోతి

"ధార్మిక కేసరా. అవును. ఆయన పేరు రంగనాయకులుగారు. పెద్ద వ్యాపారస్థులు మనవాళ్లే" అన్నాడు తండ్రి.

మరో నాలుగురోజులు గడిచాయి. ఒకరోజున జ్యోతి కాలేజీనుంచి వస్తున్నది. అప్పుడు పి. యు.సి చదువుతున్నది ఆరోజు శ్రావణ శుక్రవారం. పేరంటానికి వెళ్లొస్తున్న నాగమణి కనిపించింది. ఆవిడ జ్యోతిని చూడలేదు. జ్యోతి ఆవిడని చూసి పలకరించింది.

"అవునమ్మా, పేరంటానికి వెళ్లొస్తున్నాను. అదుగో అదే మా ఇల్లు రా ఒక్క నిముషం కూర్చుని వెళ్దువుగాని" అని బలవంతం చేసిందావిడ.

ఆవిడతో వాళ్లింటికి వెళ్లింది జ్యోతి అదొక పెద్ద మేడ అర ఎకరం మేరలో ఆ మేడ చుట్టూ పెద్ద తోట. పూర్వకాలపు జమీందార్ల దేవిడీ మాదిరి ఉంది. ఆవిడ జ్యోతికి ఆ భవనమంతా చూపించింది. చూస్తున్నంతసేపూ జ్యోతి ఏమీ మాట్లాడలేదు. కారణం తనొకటి అడుగుతే, ఆవిడ ఇంకొకటి చెపుతుంది. అంతా అయ్యాక జ్యోతికి కాఫీ ఫలహారం ఇచ్చిందావిడ

"చాలా బావుంది మీ ఆతిధ్యం, ఆప్యాయతా నన్ను ముగ్ధురాల్ని చేశాయి ఇంత భాగ్యవంతులయినా మీరు నడిచి పేరంటానికి వెళ్లొస్తుంటే మీ నిరాడంబరతకు నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది" అన్నది జ్యోతి.

ఆవిడకు సగం వినిపించింది. కొంత వినిపించలేదు. గట్టిగానే మాట్లాడినా జ్యోతి గొంతు

స్థాయి ఆవిడకు వినిపించే స్థాయికి రాలేదు. గట్టిగా బాగా గొంతు పెగుల్చుకు మాట్లాడేసరికి జ్యోతికి దగ్గొచ్చింది.

"ఏదోనమ్మా నా కాలం ఇట్లాగే వెళ్లబుచ్చుకుంటున్నాను" అన్న దావిడ.

"ఎవరితోనే అంత ప్రేమగా, ఆప్యాయతగా మాట్లాడుతున్నావ్" పెద్దగా భార్యకు వినిపించే స్థాయితో మాట్లాడుతూ రంగనాయకులుగారొచ్చారు.

"తేమగా ఉందంటారా. అవును. ఇందాకనే ఇల్లు కడిగింది రంగమ్మ సరిగ్గా తుడవలేదు కామాలు" అన్నదావిడ నవ్వుతూ.

"ఓసి, చెవిటి పెద్దమ్మా తేమకాదే, ప్రేమ

ఎవరమ్మాయివమ్మా నువ్వు. ఎక్కడో చూసినట్లుగా ఉన్నాను" అన్నా డాయన.

తండ్రిపేరు చెప్పింది జ్యోతి.

"ఓహో డాక్టరుగారమ్మాయివా. సంతోషం తల్లీ. నిన్నేకాదూ మా కార్లో ఆరోజు నాటకం అయ్యాక మీ ఇంటివద్ద దిగబెట్టిందిట మా ఆవిడ" అన్నా డాయన. జ్యోతి అవునన్నట్లు తలూపింది. కుశలప్రశ్న లడిగి ఆయన వెళ్లిపోయాడు.

జ్యోతి కూడా ఇంక వెళతానని బయల్దేరింది ఆప్యాయతతో పంపింది నాగమణి

"నీకు వీలయినప్పుడల్లా రా తల్లీ. ఏమీ అనుకోకు నాకా ఆడపిల్లలు లేరు ఉన్నది వాడొక్కడే వచ్చినాయన నాడేమో వాడి చదువేమో" అన్న దావిడ.

"ఎవరండీ మీ అబ్బాయి" అని అడుగుదా మనుకుంది కాని మళ్ళా సభ్యతగా తోచలేదు. కాకపోయినా తనోటి అడుగుతే ఆవిడొకటి చెప్తుంది

ఆవిడ మేడమీద పోర్టికోలో నిల్చుంది జ్యోతి మెట్లు దిగుతున్నది

అంతలోనే కార్లో రఘు వచ్చాడు. అతను మేడమెట్లు ఎక్కబోతున్నాడు.

"ఓ మీరా మా కాలేజీలో పి. యు. సి. చదువుతున్నారు కదూ" అన్నాడు రఘు.

"అవునండీ" అంటూ మేడ దిగింది జ్యోతి.

అదే వారి ప్రథమ పరిచయం ఆ సంవత్సరమే జ్యోతి పి యు. సి. లో చేరింది రఘు బి ఏ లోకి వచ్చాడు

వారి స్నేహానికి అదే నాందీప్రస్తావన. ఇప్పుడు జ్యోతి బి. ఏ. మొదటి సంవత్సరం. రఘు రెండో సంవత్సరం.

ఈ సంవత్సరంలోనూ వారి స్నేహం పెంపొందింది హృదయాలు కలిశాయి మనస్సులో మమతలు దోబూచు లాడినయ్యి ఒకరు తెల్లగుడ్డు. ఒకరు నల్లగుడ్డు. రెంటి ఆచ్ఛాదనే మిలమిల మెరిసే వారి నేత్రద్వయం ఒకరి కంటిపాపలో ఒకరి వంటిసొగసు చూసుకుంటూ దివ్యానుభూతుల్ని పొందుతూ మనుష్యులు వేరయినా మమతల్ని, మనస్సుల్ని ఒకటిగా చేశారు. అతను కొమ్మ, ఆమె రెమ్మ ఆమె పూవు, అతను తావి ఒకరి జీవితాన్ని మరొకరు గానంచేస్తూ ఆ గానసుధను తల్లిదండ్రుల చెవిని వినిపించారు. ఆ గానమాధురి విన్నంతవరకూ అందరికీ బాగానే ఉంది స్వరాలూ పేకవిరిగిన, లయ విన్యాసంలో కూడిన ఆ గానామృతం ఎందుకు బావుండదు. విన్నంతసేపు బాగానే ఉంటుంది. కాని, భావాలు మాత్రం అన్వయము కుదురలేదు.

* * *

ఒకరోజు జ్యోతి, రఘు ఇంటికి వెళ్ళింది అతనొక్కడే ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. జ్యోతి వచ్చినప్పుడు ఎంతో సంతోషంతో, ఆప్యాయంగా ప్రేమతో పిలిచే రఘు ముభావంగా చూస్తూ పేలవంగా నవ్వి "రా జ్యోతీ" అన్నాడు. జ్యోతి నివ్వెరపోయింది. కుర్చీలో కూర్చుంటూనే "అట్లా ఉన్నావేం రఘూ ఒంట్లో బావుండలేదా" అన్నది.

"ఒంట్లో బాగానే ఉంది జ్యోతీ ఒకవేళ బావుండక పోయినా మందు పనిచేస్తుంది. కాని, ఇంట్లోనే బావుండలేదు. ఇంటికి మందు పనిచెయ్యదుగా" అన్నాడు.

జ్యోతికి ఈ మాటలు అర్థంకాలేదు.

"జ్యోతీ ! ఇంట్లో తండ్రి మాటకు ఎక్కువ విలువ నివ్వాలా, తల్లిమాటకా."

"అంటే."

"కన్నబిడ్డలు, తల్లిదండ్రుల్లో ఎవరి మాటకు ఎక్కువ విలువ నివ్వాలంటున్నాను"

"ఇద్దరి మాటలకూ విలువ నివ్వాల్సిందే. నవమాసాలు మోసి, కని, పెంచి, పెద్దచేసేది తల్లి. మన పురోభివృద్ధికి తోడ్పడి, విద్యాబుద్ధులు నేర్పించి, సంఘంలో మన నొక ప్రయోజకులుగా చేసి తీర్చిదిద్దేది తండ్రి ఒకరు నేల ఒకరు నీరు. మొక్క పెరిగి పెద్దదై మహావృక్షం కావటానికి రెండూ అవసరమే" అన్నది జ్యోతి

"ఆమాట నిజమే కాని జీవితసమస్యను పరిష్కరించుకోటంలో ఎవరి మాటకు విలువ నివ్వాలని" మళ్లీ రెట్టించి అడిగాడు రఘు

ఏదో ఒక అవాంతర సమస్య ఆ కుటుంబంలో తలెత్తిందని గ్రహించింది జ్యోతి. ఎంత ఆలోచించినా ఆ సమస్య ఏమిటో జ్యోతికి తోచలేదు. జ్యోతి ముఖంలోకి తనివితీరా చూస్తూ కూర్చున్నాడు రఘు కళ్లు ఆమె అందాన్ని తమలో ఇముడ్చుకున్నాయి. హృదయంలో ఆమె రూపం తిష్టవేసింది మనస్సు ఆమెను తనదాన్నిగా చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నది. కాని ఏదో ఒక కొత్త రూపంతో వచ్చిన ఆవేదన పడగలెత్తింది.

"జీవితసమస్యను మనస్సాక్షిగా, హృదయౌన్నత్యానికి తగినట్లుగా, న్యాయాన్యాయ విచక్షణను పాటిస్తూ పరిష్కరించుకోవాలి. ఆ స్థితిలో ఉన్నవారు ఎవరి మాటకూ విలువ నివ్వక్కర్లేదు" అన్నది జ్యోతి

రఘు మనస్సు తేలికపడింది సంతోషంతో ఆమె భుజం తట్టి "అయితే మనమే జయిస్తాం జ్యోతీ" అన్నాడు తెలియని హృదయాందోళన తీరింది జ్యోతికి

"ఇంతకీ అసలు సమస్య ఏమిటి రఘూ" అన్నది జ్యోతి

"జీవితమే సమస్యల పుట్ట ఆ పుట్టలో పాములే ఉంటయ్యో, చలిచీమలే ఉంటయ్యో నేవి ఉంటేనేగాని తెలీదు కదా. చలిచీమలయితే దులుపుకో వచ్చు పాములయితే కాటు వెయ్యకుండా కాపాడుకోవాలి" అన్నాడు రఘు.

"సంగతేమిటో చెప్పాదూ నన్ను చంపక."

[illegible] చెపుతాను జ్యోతీ"

మనస్సులోని ఆరాటం తగ్గింది జ్యోతికి

కాస్సేపు కూర్చున్నాక జ్యోతి వెళ్లబోయింది. అప్పుడే రఘు తల్లి ఒకావిడను వెంటబెట్టుకుని వచ్చింది జ్యోతిని చూడగానే ఆమె ఎందుకో తల తిప్పేసుకుని ముఖంలో అయిష్టతను చూపింది. ఆమె ముఖ కవళికలనూ, అయిష్టతనూ గమనించకుండానే "ఈ అమ్మాయే జ్యోతి" అంటూ ఆవిడకు జ్యోతిని చూపించింది రఘు తల్లి రఘు చిరునవ్వుతో ఆమెవైపు చూశారు. జ్యోతిని పలకరించకుండానే ఆమె వెనక్కు తిరిగింది. ఆమెను అనుసరించింది రఘు తల్లి. వాళ్ళు వెళ్లాక రఘుని అడిగింది "ఆమె ఎవరని"

"మా బంధువులు" అన్నాడు రఘు నవ్వుతూ.

"నేనంటే ఎందుకు అయిష్టతగా ఉన్నట్లుంది" అన్నది జ్యోతి.

"ఆవిడ ఉబుకే బయటపడుతుంది. అందుకు నీకేమీ నష్టంలేదు"

ఈ డొంకతిరుగుడు మాటలు జ్యోతికి అర్థం కాలేదు.

"ఆవిడ ఎవ్వరో, ఎందుకు నేనంటే కోపంగా ఉందో చెపితేగాని నేను కదలను." అని భీష్మించుకు కూర్చుంది జ్యోతి. ఏదో అకారణంగా తనను రఘు అవమానపరుస్తున్నాడా, తనంటే ఇష్టంలేక అట్లా ప్రవర్తిస్తున్నాడా, లేక తమ ఇంటికి తను రావటం ఇష్టంలేక ఈవిధంగా ఆవిడచేత అంటీ ముట్టనట్లుగా చెప్పిస్తున్నాడా అనుకుంది జ్యోతి. ఆమె మనస్సు చిన్నబోయింది.

"రఘూ ! నీకు ఇష్టంలేకపోతే రావటం మానేస్తాను. అంతేగాని, నన్నిట్లా అకారణంగా హింసించి చంపట మెందుకో అర్థం కావటంలేదు" అన్నది జ్యోతి

రఘు పొట్ట చెక్కలయ్యేటట్లుగా నవ్వాడు జ్యోతికి కోపంవచ్చి వెళ్లిపోయింది.

జ్యోతి వెనకనే తనూ వచ్చాడు రఘు.

"జ్యోతీ"

అవమానంతో బుసలుకొడుతూ చూసింది జ్యోతి అతనివైపు


"నాలో నువ్వు వెలిగించిన జ్యోతిని ఆర్పటానికి మా మేనత్త వచ్చింది. నోటితో వూదింది. జ్యోతి ఆరలేదు వత్తిమీద కన్నీరు పడేటట్లు ఏడ్చింది జ్యోతి ఆరలేదు. ఆ జ్యోతిని అవతలకు లాగి పారెయ్యా లనుకుంది కాని, ఆ జ్యోతిని తా లేకపోయింది జాజ్వల్యమానంగా వెలిగే జ్యోతి చూసి ఆమె ఆశ్చర్యపడింది ఆ కాంతికి ఆమె కళ్ళు మిరుమిట్లు గొలిపాయి అంతే" అన్నాడు రఘు.

జ్యోతి కోపం అంతరించింది. మనస్సు తేలి పడినా మమతమీద ఎవరో కుట్ర పన్నుతున్నట్లనిపించింది. ఆలోచనకు అందని విషయం తోచి, అనునయవాక్కులతో రఘుని ఏదో అడ దలచి నోరు పెగిలి రాలేక, సందేహంతో రఘు వైపు చూస్తూ వెళ్ళిపోయింది జ్యోతి.

మరో నాలుగు రోజులు గడిచాయి కాలేజీ రోజూ ఒకరి నొకరు చూస్తున్నా ఎందుకనో జ్యోతి రఘుని పలకరించ బుద్ధిపుట్టలేదు. ఇద్దరి చూపుల ఏదో వెలితి కనిపిస్తున్నది. మనస్సులు పాటి ఆ



COLGATE
NYLON TOOTH BRUSH
REGULAR
ADULT
Colgate
HARD







SAVE
35p
HAZELINE
SNOW

దినంతో సతమత మవుతున్నా, హృదయాలు తెరిచి మాట్లాడాలని ఆరాటపడుతున్నా పలక రించుకోటానికి ఇద్దరికీ నోరు రావటంలేదు ఏదో తప్పుచేసిన వారిలా, ఆ తప్పు నలుగురికీ తెలిసి పోయినట్లుగా భావిస్తూ నాలుక చివరిదాకా మాట వచ్చినా, నాభిలోనుంచి ఎవరో అడ్డుపడుతున్న ట్లుయి మూగమనస్సుల మూకీభావనతో ఏమీ ఎరుగనట్లుగా ఎడంగా తిరుగుతున్నారు

ఆ నాలుగు రోజులూ నాలుగు యుగా లయిన ట్లయింది వారికి రఘు, జ్యోతి ఇంటికి రావాలని బయల్దేరేవాడు గేటుదాటి లోపలికి వెళదా మనుకుంటే కాలు సాగేదికాదు మేడమీద జ్యోతి కనిపిస్తే వెళదామని తలెత్తి చూసేవాడు జ్యోతి కనబడేదికాదు. నౌకర్లు "అమ్మాయిగారు ఉన్నా రండి" అనేవారు అయినా ఇంట్లోకి వెళ్ళటానికి ఏదో జంకు ఏదో దిగులు రెండు నిమిషాల్లో మళ్ళా గేటుదాటి బరువెక్కిన హృదయంతో వెళ్ళిపోయేవాడు రఘు వచ్చి వెళ్ళినట్లు జ్యోతికి తెలిసేదికాదు మేడమీద తన గదిలో ఒక్కర్తే కూర్చునేది ఏదయినా పుస్తకం చూస్తూ ఉండేది. ఏమాత్రం అలుకుడు కలిగినా రఘు వచ్చాడేమోనని ఆత్రంగా గుమ్మంవైపు చూసి ఎవ్వరూ లేకపోవ టంతో కళ్ళల్లో నీరు నింపుకునేది మనస్సులో ఏదో ఆవేదన కుమిలింపు ఆ కుమిలింపు వెనక తనను ఎవరో రఘునుంచి దూరంగా లాక్కు పోతున్నట్లు లీలగా ఏదో కనబడని సన్నివేశం. ఆ సన్నివేశపు నీడల్లో కనుపించీ కనుపించని రఘు అతనిముందు హొయలూ, వయ్యారమూ ఒలక బోస్తూ తన వయస్సురాలయిన ఒక యువతి ఆ యువతి రఘు కళ్ళల్లోకి చూస్తూ "బావా నేనంటే ఇష్టంలేదుకదూ నే బావుండలేదా బావా

పసిడి మనసులు

నల్లగా ఉన్నానా. నల్లటివాళ్ళ దగ్గరనే నారాయణ మూర్తి ఉంటాడు బావా, మనిషి నల్లనిదాన్నయినా మనస్సు మల్లెపువ్వులాంటిది బావా, ఈ నల్లని శరీరం భగవంతుడు ప్రసాదించాడు బావా. చిన్నపుడే నాకా సంగతి తెలిస్తే ఆ పరంధాముని నిలవేసి "నన్ను నల్లగా తయారుచెయ్యకు స్వామీ, మా బావకు పచ్చని పసిడివన్నె ఛాయగల మరదల్ని కావాలి స్వామీ" అని అడిగేదాన్ని కాని, నా కప్పుడు తెలీదుగా బావా! నల్లగా ఉన్నా నీకోసం మన స్సును తెల్లగా చేసుకొని, కోరికలను పసిడి తున కలుగా మార్చుకుని నీకోసం ఈ పద్దెనిమిదేళ్ళు ఎదురుచూశాను బావా, నన్ను నీదాన్నిగా చేసుకోవా బావా?" అంటున్నది ఆ దృశ్యం చూడలేక పోయింది జ్యోతి "రఘూ" అంటూ ఒక్క గావు కేక పెట్టింది

తల్లి వచ్చి చూచేసరికి దిండులో తలదూర్చి వెక్కివెక్కి ఏడుస్తున్నది జ్యోతి

"ఎందుకమ్మా జ్యోతీ, ఎవరేమన్నారు" అన్నది తల్లి రత్న

"అమ్మా" అంటూ బావురుమని ఏడుస్తూ తల్లి వళ్ళో తల చేర్చింది జ్యోతి

కూతురు కళ్ళు తుడిచి, ముంగురులు సరి చేస్తూ వూరడించింది తల్లి

కొంతసేపటికిగాని జ్యోతి వెక్కు తగ్గలేదు హృదయావేదన తగ్గాక తల్లితో చెప్పింది

"రఘూ నాతో మాట్లాట్టంలేదమ్మా"

"అందుకా ఈ విచారం పిచ్చిదానా. ఏహో పన్నెండి మనింటికి రావటంలేదేమో అంత మాత్రానికే ఇంత దిగులెందుకమ్మా" అన్నది రత్న

"కాలేజీకి అతను రావటంలేదా" అన్నది మళ్ళీ.

"వస్తున్నాడమ్మా రోజూ కనబడుతూనే ఉన్నాడు"

"పోనీ నువ్వెందుకు పలకరించటంలేదు నువ్వంటే అతను ముభావంగా ఉన్నాడనే అనుకుందాం నువ్వు మాట్లాడకపోవటానికి కారణం"

తల్లిమాటతో కనువిప్పు కలిగినట్లయింది జ్యోతికి. తనవల్ల తప్పున్నట్లుగా తనకు తోచింది కాని ఏదో అభిమానం, ఆవేదన అర్థంకాని ఆలోచ నలు

"రేపు నేనే పలకరిస్తానమ్మా"

"పిచ్చితల్లి" అంటూ వెళ్లింది రత్న

మర్నాడు కాలేజీలో కనుపించగానే నవ్వుతూ పలుకరించింది జ్యోతి

"నాతో మాట్లాట్టం మానేశావా రఘూ."

"నేనా, నువ్వా"

జ్యోతి మనస్సు తేలికపడింది


"సాయంత్రం మా యింటికి వస్తావా"

"తప్పక"

రఘు మేడమెట్లు ఎక్కుతుండగా జ్యోతి తండ్రి ఆస్పత్రినుంచి వస్తున్నారు నవ్వుతూ నమస్క రించాడు రఘు అయినా నవ్వుతూ "ఏమోయ్ రఘూ, కులాసానా. మీ మేనత్తగారు కులాసాగా ఉందా? జ్వరం తగ్గిందా? మీ గుమాస్తా వచ్చి నా డిస్పెన్సరీలో మందు పట్టుకు వెళుతున్నాడు" అన్నాడు

"కులాసానేనండీ. ఇవాళ నార్మలుకు వచ్చింది జ్వరం తగ్గినట్లే" అన్నాడు రఘు

ఈ మాటలు విని జ్యోతి వచ్చింది విస్ఫారిత నేత్రాలతో అతనివైపు నవ్వుతూ చూసింది. వాళ్ళిద్దర్నీ చూసి తృప్తిగా నవ్వుకుంటూ ఆయన ఇంట్లోకి వెళ్లాడు (సశేషం)





'అంతస్తులు' లో జ



శ్రీ య్యు. నాగేశ్వరరావు.

భజరంగభళీ!

లతిక

"సగణద్వయ" మకుటముతో
సుగణితముగ "ఐదు పదులు" సూక్తులు వ్రాతున్
తగ మిమ్ముల నవి మెప్పిం
పగ నా కృషి సార్థకమగు; భజరంగభళీ!

అరవై నాలుగు మాత్రల
కిరవై వర్తించు నట్టి యిక్కందములన్
కరము సుకర మని తలచుచు
పరమేష్టముగా రచింతు; భజరంగభళీ!

సిరిగల దేవుండాతడు,
వరదు డతడు, వరములిచ్చి వడ్డీ కోరున్
తిరుపతి యతని నివాసము
పరమాత్ముండతడు కలిని; భజరంగభళీ!

దురితక్షయ మొనరించుచు
పరి రక్షించుచు సుకృతము వర్ధిలజేయున్
సిరి, కౌస్తుభ మెద దాల్చిన
పరమాత్మకు విన్నవింతు, భజరంగభళీ!

మితి మంతులు, ఇరు భాసల
నతులిత విజ్ఞాన మూర్తు లారాధ్యులిలన్
గత యుగ కర్తలు శ్రీ తిరు
పతి వేంకట కవుల గొల్తు; భజరంగభళీ!

తిరుగ వచనము, గేయము
లి రెండును వ్రాసె నెవరు? ఎల్లరి కొరకై
వారే మన గురజాడ
ప్పారాయ కవీశ్వరుండు— భజరంగభళీ!

స్మృతి పాత్రులు కావలెనని
ప్రతి వారును కలలు గనుట భావ్యమె కాని,
స్మృతి కలగన వరియింపదు,
వ్రతముగ కృషి చేయవలయు భజరంగభళీ!

సాధనమున కార్యములను
సాధింపగ వచ్చు ననుచు, సాధారముగా
బోధించిన వేమన మది
ప్రాధానముగా తలంతు భజరంగభళీ!

చూపుల విందుగ బొమ్మల
నే పాటియు కష్టపడక హేలగ గీసే
పాపులరు చిత్రకారుడు
'బాపు' కి నా కాంప్లిమెంట్సు భజరంగభళీ!

సినిమల విందుగ తీయగ
గానమ్మొనరించు మధుర గాయని, నటియున్
తా నొక దర్శయిత్రియు నౌ
'...... ....'కి కాంప్లిమెంట్సు భజరంగభళీ!

వాణిజ్యమునకు నేడు ప్ర
మాణమ్మైనది దశాంశ మానము విధిమై
తూనికలో 'కేజీ' లే
సేరుల చోటాక్రమించె భజరంగభళీ!

"ఎంతున్నది మన బలగము?
అంతా మన మేపే కద? అతను డిఫీటె
డ్నంతే కావా" అంటూ
పంతా లెన్నికల లోన భజరంగభళీ!

ఓపికతో నాల్రోజు ల
దే పనిగా పద్యాలను నేను రచిస్తే
ప్రాపించె శిరోవేదన
పై పని నాకింక నిద్ర భజరంగభళీ!

అతివాదుల, మితవాదుల
ప్రతివాదుల కేకలు విని బ్రహ్మాండముగా
ఖతమై చెడె నేకాగ్రత
బ్రతిమాలెద నరవకుండని భజరంగభళీ!

దుష్యంత మహీపాలుడు
పుష్యమనే మాసమందు పున్నమి నాడే
ఋష్యాశ్రమమున కేగెను
భాష్యమి? ఇది ప్రాస కవిత! భజరంగభళీ!

మానసమున రంజించే
పూనికతో చలన చిత్రమును గన నేగన్
మా నెత్తురు మత్కుణములు
పానము గావించె నచట భజరంగభళీ!

థోడా విశ్రాంతి దొరికె
నీడను నిద్రింతు ననుచు యించుక వ్రాలన్
పాడుచు దోమలు కుట్టుచు
పాడొనరించినవి నిద్ర భజరంగభళీ!

పలుకులలో నిజముంటే
పలుకులు పదిమంది మెచ్చి భళిభళియంటే
పలికి నటులు వర్తిస్తే
పలుకే బంగారమౌను భజరంగభళీ!

కోపము వచ్చెను సూర్యున
కా పాటికి నన్ని చోట్ల అంబువు లింకెన్
మా పాట్లిక అడగాలా?
పైపులలో నీళ్ళులేవు— భజరంగభళీ!

అర్ధమన సగము భాగము
అర్థము యీ జగతికెల్ల ఆధారంబౌ
అర్థము శబ్దమునకు సఖి,
వ్యర్థముగా దర్థ మెచట భజరంగభళీ!

భారతమే చదవాలని
సార మెరిగి సూరి యొకడు చక్కగ పలుకన్
గారెలు తినుడని భోజన
సారగు డొక్కండు పలికె భజరంగభళీ!

మిత పరిచయ మొనరుతు, వ
ద్భుతముగ, "శ్రీవత్స" గోత్రమున జన్మం బం
దితి, రాళ్ళపల్లి గారి
పతిశాస్త్రిని, "లతిక" నేను! భజరంగభళీ!!

మీ జుత్తును ఆరోగ్యంగా నిగనిగ లాడేలాగు వుంచుతుంది

బ్రిల్‌క్రీమ్

సర్వోత్తమ హేర్-డ్రెస్సింగ్



కేవలం బ్రిల్‌క్రీమ్ మాత్రమే

- చక్కగా జుత్తు దువ్వుకొనడానికి సాయపడుతుంది. జుత్తు జిడ్డు కాదు, చెదరి పోదు.
- చాలా పొదుపు అయినది, ఒక్కసారి రాస్తే చాలు రోజంతా జుత్తు రేగదు.
- దీనిలో చేర్చిన అద్వితీయమైన మిశ్రమము మాడును పోషించి, జుత్తును బాగా పెంచుతుంది.
- మీ జుత్తు యొక్క సహజ రంగును బయలు పరచును.

మీరు కూడా బ్రిల్‌క్రీమ్ ఉపయోగించడం మొదలు పెట్టండి

ప్రపంచమంతటా లక్షలాది మంది సొగసుకారులు ఉపయోగించేది.

B/P/1/P/1/65 TL

శాంత

న్యాయపతి రాజగోపాలం

సెకండు క్లాసు లేడీస్ కంపార్టుమెంటులో పోర్టరు పెట్టె, బెడ్డింగు పెట్టి వెళ్లాడు మాలతి లోపలికి వెళ్లి కూర్చొన్నది ఆమె తప్ప ఆ కంపార్టుమెంటంతా ఖాళీగా ఉన్నది

మాలతి బి. ఏ. చదివింది ఆ క్రిందటి రోజుతో పరీక్షలు ముగిశాయి ఆ వెంటనే ఇంటికి ప్రయాణానికి ప్రయత్నం, అందులో రెండు టీ పార్టీలు కూడా, రాత్రంతా హాస్టలులో ఒకటే సందడి ఎలాగైతేనేం చివరికి ఉదయాన్నే వచ్చి రైలులో పడింది. మళ్లా ఇల్లు, పాప, అమ్మ, నాన్నగారు—

రెండు నెలలనుండి తదేకదీక్షతో చదవడం నుండి మాలతికి ఇంటి గురించి ఆలోచించడానికే అవకాశం లేకపోయింది. చదువు తప్ప తక్కిన ప్రపంచాన్నే మరిచిపోయింది ఈనాటికి తిరిగి ఈ లోకంలోకి వచ్చింది.

ఇంటి సంగతి ఆలోచించేసరికి మొదట అక్క జ్ఞప్తికి వస్తుంది మాలతికి

అక్క మరణించి అప్పుడే మూడు సంవత్సరాలు కావస్తోంది అనుకొన్నది, మాలతి ఆమె కళ్లు చెమ్మగిల్లాయి కాలచక్రం ఎంత గిర్రున తిరిగిపోతోంది ! అక్క బుగ్గమీది పెళ్లి బొట్టు తన కళ్లకి కట్టినట్టే ఉన్నది కాని అక్కకి వివాహమయి అప్పుడే ఎనిమిదేళ్లు కావస్తోంది

చిన్నప్పటినుండి అక్క, తను ఎంతో అన్యోన్యంగా ఉండేవారు తక్కిన అక్కా చెల్లెళ్ల మాదిరి కాదు— ఒక్కసారైనా పోట్లాడుకోవడం ఎరుగరు. ఇద్దరిలోనూ తనే కాస్త పెంకెతనం చేసేది. తనకే ఎప్పుడైనా ఒక్కొక్కసారి అక్క పైన కోపం వచ్చేది కాని, అక్క ఎంతో శాంతంగా ఉండేది నిముషంలో తన కోపం పోగొట్టేది. ఇద్దరూ కలిసి ఆడుకొనేవారు, కలిసి చదువుకొనేవారు, కలిసి పడుకొనేవారు కథలు చెప్పుకొనేవారు, కన్నె నోములు నోచుకొనేవారు

స్కూలుఫైనలు ప్యాసు కావడంతో పెద్దమ్మాయి చదువు మాన్పించారు వాళ్ల నాన్నగారు మాలతి అప్పటికి ఫోర్తుఫారంలోకి వచ్చింది. అక్కని చదువు మాన్పించడానికి ధనలోపమే ముఖ్య కారణం. అప్పట్లో వాళ్ల తండ్రి గుమాస్తాగిరి చేస్తుండేవాడు. ఆయనకి ఇద్దరే సంతానం. పరిమితమైన కుటుంబమే. అయినా అతడు తెచ్చే జీతం నిత్యావసరాలకి మాత్రం బహు కష్టంతో సరిపోయేది. ఇక పెద్ద చదువు చదివించడానికి ఏం మిగులుతుంది ? మాలతి తల్లి మాత్రం అయిన ఇంటివారి ఆడబడుచు కాని ఆమె తండ్రి మహా లుబ్ధుడు. పసుపు కుంకం కొనుక్కోమని కూతురి చేతిలో ఎన్నడూ ఒక్క రూపాయి కూడా పెట్టడం రివాజులేదు అందుచేత మాలతి తండ్రికి అత్తవారి ఆశ ఎన్నడూ లేదు.

పెద్దకూతురికి పదహారేళ్లు పూర్తికావడం నుండి ఆమె వివాహం గురించి తల్లిదండ్రులకి ఆతృత అధికమైంది. కొన్ని సంబంధాలు చూచారు అందరూ పెద్ద మొత్తాలుగా సొమ్ము ఆశించిన వాళ్లే. ఎక్కడనుండి తేగలరు ? అప్పటికి వాళ్ల తండ్రి ఒకసారి తన మామగారి వద్దకు వెళ్లి అర్థించాడు. ముసలాయన ఏ కళ నున్నాడో పెళ్లి ఖర్చులకి మాత్రం ఒక వెయ్యి రూపాయలు ఇస్తానన్నాడు మరి కట్నం ? ఎవరైనా కట్నం కోరకుండా వివాహం చేసుకొంటే ఈ వెయ్యిరూపాయలతో వివాహం జరుగుతుంది, లేకపోతే లేదు అన్న నిస్సహాయ పరిస్థితిలోకి వచ్చారు మాలతి తల్లితండ్రులు.

అప్పట్లో బావని భగవంతుడే పంపాడు

బావ బి ఏ. ప్యాసయినా మాలతి తండ్రిలా గుమాస్తా ఉద్యోగమే చేస్తూండేవాడు అతడికి ఇరస్తా పరస్తా ఎవరూ లేరు తనకి కట్నం అవసరం లేదని, పిల్ల నచ్చితే చాలని చెప్పాడు అతడికి అక్క నచ్చింది తాతగా రిచ్చిన వెయ్యి రూపాయలతో వివాహం జరిగింది

పెళ్లినాడు అక్క ఎంత అందంగా కన్పించింది ? ఆమెతో మాలతి ఆమాట చెప్పింది కూడా

"నీ పెళ్లినాడు నాకంటే వెయ్యిరెట్లు అందంగా నువ్వు మెరిసిపోతావ్ !" అన్నది అక్క నవ్వుతూ

పెళ్లి అయిన వెంటనే అక్కని బావ తీసుకు వెళ్లిపోయాడు అక్క వెళ్లిపోయాక ఇల్లు ఎంతో చిన్నపోయింది మాలతికి జ్ఞానం వచ్చినప్పటినుండి అక్కని విడిచిపెట్టి ఒక్కరోజు కూడా ఇప్పటి వరకు లేదు తల్లితండ్రుల ముఖాలలో కూడా దిగులు కనిపించింది అక్క క్షేమంగా చేరినట్టు, కులాసాగా ఉన్నట్టు ఉత్తరాలు వస్తూంటే ఒక్కొక్కరి మనస్సులు కొంత కుదుటబడ్డాయి క్రమంగా అక్క లేకుండా కాలం గడపడం మాలతికి అలవాటయింది

అయితే బావ అక్కని తరచు తీసుకొని వచ్చేవాడు ప్రతీ శనివారం, ఆదివారాల్లో ఇద్దరూ వచ్చేవారు ఇక పండుగలకి సరేసరి వాళ్లు వచ్చినప్పుడు తిరిగి ఇల్లు ఎంత కళకళలాడుతూ ఎంత సందడిగా ఉండేది ! అంటే సందడి అంతా అక్కదే బావ మాత్రం ఎవరితోనూ మాట్లాడడు ఎంతసేపు గదిలో కూర్చొని ఏదో చదువుకొనేవాడు అతడి నైజమే అది ఇంట్లో ఉన్నాడనే ఎవరికీ తెలియదు.

"ఏమే, ఎప్పుడూ అతడు అదోలాగ ఉంటాడు ఎవ్వరయిన మనిషిలా కనిపించడు. నీతోనైనా సరిగ్గా ఉంటాడా ?" అని ఒకసారి అక్కని అడిగింది తల్లి.

"ఆయనకేమమ్మా చాలా దొడ్డమనిషి నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తారు" అన్నది అక్క.

"ఆ వేషమేమిటి ? ఎప్పుడూ ఖద్దరు గుడ్డలే. బి ఏ. ప్యాసయినాడు పాటివాళ్లలా ఆమాత్రం నాజూగ్గా బట్టలు వేసుకొంటే నేం ?" అన్నది అమ్మ.

"ఆయనకి కొన్ని నియమాలు ఉన్నాయమ్మా. సులువుగా అర్థమయ్యే మనిషి కాదు" అన్నది అక్క.

అక్క చెప్పింది అమ్మకి తృప్తి నిచ్చేది కాదు. ఆమెది తల్లి హృదయం. కుమార్తె సుఖపడడం లేదేమోనని ఆమె ఆతృత అందులోనూ ఇద్దరు పిల్లల్నీ రెండు కళ్లలా చూసుకుంటూ పెంచింది. వాళ్లు ఏదంటే దానికే తల వూపేది. తండ్రి కూడా అంతే

రైలు శరవేగంతో పరుగెడుతోంది. ఏదో వినబడని పాటకి అంతంలేని లయ వేస్తున్నాయి చక్రాలు గత చరిత్రలో పుటలు తిరగవేస్తున్నది మాలతి

అక్క వివాహం జరిగాక కొన్ని ముఖ్యమయిన మార్పులు కలిగాయి. మాలతి తాతగారు మరణించారు. ఆస్తిలో వాటా వస్తుందని భార్యచేత ఆమె అన్నదమ్ములకి నోటీసు ఇప్పించాడు మాలతి తండ్రి మొదట్లో కాస్త బెట్టుసరిగా తిరిగి జవాబు ఇచ్చినా, చివరికి వాళ్లే రాజీనామాకి వచ్చారు. సాలీనా మూడువేల రూపాయలు ఆదాయం వచ్చే ఆస్తిని మాలతి తల్లికి ఇచ్చారు. మాలతి తండ్రికి ఏకాంబెంటుగా ఉద్యోగంలో ప్రమోషను వచ్చింది ఇన్నాళ్లూ వాళ్ల ఇంట్లో స్థిరనివాసం ఏర్పరచుకొన్న దారిద్ర్యం ఒక్కసారిగా పటాపంచ లయింది తన చదువు కూడా స్కూలు ఫైనలుతో ఆగిపోతుందేమోనన్న భయం మాలతిని వదిలిపోయింది ఆమెను పెద్ద చదువు చదివించాలని, మంచి సంబంధం చూచి పెళ్లి చెయ్యాలని ఆమె తల్లిదండ్రులు నిశ్చయించారు. ఇల్లు కొత్త శోభతో కళకళలాడడం మొదలెట్టింది. అందరి హృదయాలు ఆనందంతో నిండాయి.

నాలుగు సంవత్సరాలు గడిచాయి. మాలతి పి యు సి. చదవడానికి పట్నం వచ్చింది. ఎన్ని సంవత్సరాలయినా అక్కకి సంతానం కలగడం లేదని అమ్మకి ఒక కొత్త దిగులు పట్టుకొన్నది. అది నానాటికి ఎక్కువ కావటం మొదలెట్టి చివరికి ఒక ఆతృతగా ఆమెను వేధించసాగింది ఎవరితో మాట్లాడినా ఆమె తప్పక ఇదే ప్రసక్తి తీసుకువచ్చేది. మాలతికి వ్రాసే ప్రతీ ఉత్తరం లోనూ అదేమాట

చివరికి అమ్మ కోర్కె ఫలించింది ! అక్క నెల తప్పిందని అమ్మవద్ద నుండి అనుకోకుండా ఒకరోజు మాలతికి ఎక్స్‌ప్రెస్ ఉత్తరం వచ్చింది మాలతి ఆనందం పట్టలేకపోయింది ఒక కిలో మిఠాయి వెంటనె కొని అక్కగారి వూరు వెళ్లింది

మాలతిని అక్క, బావ ఎంతో ఆప్యాయంతో ఆదరించారు ఆ దంపతుల ముఖాల్లో ఆనంద రేఖలు ఆమెకి స్పష్టంగా గోచరించాయి. ఎన్నడూ లేనిది బావ చాలాసేపు సరదాగా మాట్లాడాడు.

[illegible] చెయ్యడం మాలతి ఆ ఒక్క సారే విన్నది. ఆరోజు ఎంతో ఆనందంగా గడిచి పోయింది. మర్నాడు మాలతి తిరిగి పట్నం వెళ్ళి పోయింది.

పురిటికి అక్కని తీసుకుని రాబోతున్నామని, ఆ తరువాత ఆమెను తీసుకువచ్చామని, ఆమె ఆరోగ్యం బాగున్నదని, చులకనగా తిరుగుతున్నదని, ఎప్పటికప్పుడు అమ్మవద్దనుండి ఉత్తరాలు వస్తుం డేవి. ఒకటె రెండుసార్లు అక్క కూడా ఉత్తరాలు వ్రాసింది అంతా నవ్యంగానే, బాగానే, ఉన్నదను కొన్నది మాలతి కాని—

ఒకరోజు, ఆరోజు, అనుకోకుండా నాన్నగారు హాస్టలుకి వచ్చారు ఆయన ముఖం వెలవెల బోతున్నది రాత్రి నిద్ర లేకపోవడం నుంచి కాబోలు కళ్ళు ఎర్రగా ఉన్నై. మాలతి మనస్సు వెంటనే కీడు శంకించింది.

"ఏం—ఏం నాన్నగారు ?" అని ప్రశ్నించింది మాలతి, ప్రాణం బిగబట్టి.

"త్వరగా రా అమ్మా. అక్క పరిస్థితి ఏమీ బాగులేదు ఇక్కడికి టాక్సీలో తీసుకువచ్చి ఇప్పుడే పెద్ద ఆస్పత్రిలో చేర్పించాం" అన్నారు.

వెంటనే తండ్రితోను మాలతి బయల్దేరింది

వివరాలు త్రోవలో నాన్నగారు చెప్పారు. రెండు రోజులనుండి అక్కకి లేబర్ ప్రారంభమయిందట. ఎప్పటికీ పురుడు రాదు డాక్టరు వచ్చి చూచిందట ఏవో ప్రయత్నాలు చేసిందట. చాలా క్లిష్టమైన కాన్పు అని, ఆపరేషను చెయ్యాలని, పెద్ద ఆస్పత్రికి తీసుకువెళ్లమని చివరికి సలహా యిచ్చిం దట

"ఆమాట మొదటే చెప్తే ఎంత బాగుండేది" అన్నారు నాన్నగారు జీరస్వరంతో

"బావకి తెలియజేశారా ?" అన్నది మాలతి

"ఇక్కడికే వరాసరి రమ్మంటూ రాత్రి టెలిగ్రాం ఇచ్చాను గంటకో, ఘడియకో అతడు కూడా రావచ్చును" అన్నాడు తండ్రి

ఇద్దరూ ఆస్పత్రి చేరేసరికి బావ అక్కడ సిద్ధంగా ఉన్నాడు. మాలతి తల్లి, అతడు, తని ఖీగది బయట నిలబడి దిగులుగా ద్వారంవైపు చూస్తున్నారు.

తనిఖీ పూర్తికాగానే స్ట్రెచర్‌పైన అక్కని ఆపరే రేషన్ థియేటరులోకి తీసుకొని వెళ్లారు

అక్క ముఖం బాధతో నల్లగా కమిలిపోయింది స్ట్రెచర్‌మీద నుండి ఒక్కసారి కళ్ళు విప్పి చూచింది. ఆమెకు మొదట మాలతి కన్పించింది వెంటనే ఆమె ముఖంలో ఒక చిన్న వెలుగు కన్పిం చింది. ఆ తరువాత బావ ఆమెకు కన్పించాడు ఆమె కళ్లనుండి బొట బొట నీళ్లు జారినై. చేతులు జోడించి నమస్కరించడానికి ప్రయత్నిం చింది

పెద్ద సన్నాహంతో అక్కకి ఆపరేషన్ చేశారు తల్లిని—పిల్లని రక్షించడానికి ఆరోజంతా మృత్యువుతో హోరాహోరి పోట్లాడారు కొంత వరకు కృతకృత్యులయ్యారు అంటే బిడ్డని రక్షించగలిగారు కానితల్లి

'అప్పుడే పి మూరేళ్ల బతుకు పూర్తిఅయి



రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యంకాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశంకూడా లేదని గుర్తించ ప్రార్థన. సం॥

పోయిందా అక్కా" అంటూ మాలతి ఏడ్చింది
తల్లి తండ్రుల రోదన సరేసరి

బావ చాలవరకు దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి ప్రయత్నించాడు. కాని చివరికి మృత కళేబరంపై పడి చిన్నపిల్లాడిలా భోరున ఏడ్చాడు.

అంత్యక్రియలు జరిపించి అమ్మ నాన్నగారు తిరిగి వెళ్ళి పోయారు. వాళ్ళతో బావ, మాలతి కూడావెళ్ళారు.

ఇంట్లో తిరిగి కాలుపెడుతూ అమ్మ గొల్లుమన్నది దానితో ఎవరికి దుఃఖం ఆగలేదు ఆరోజంతా అందరి మనస్సులు చీకటితో నిండిపోయినై

ఇంచుమించు అయిదు సంవత్సరాలనుండి అక్కలతమ ఇంటిలో లేదు బావ వద్ద ఉండేది అయినప్పటికీ ఇల్లు అదో నిండుగా ఉండేది ఇప్పుడు ఇల్లు బోరుమంటున్నది ఇంట్లో ఏవైపు చూచినా మాలతికి అక్క జ్ఞాపకం వచ్చేది ఆయింట్లోనే చిన్నప్పుడు ఇద్దరూ ఆడుకొనేవారు ఆతరువాత కలిసి చదువుకొనేవారు ప్రతి సంవత్సరం బొమ్మల కొలువు పెట్టేవారు బొమ్మల కొలువు అంటే ఎంత సంబర పడేదానివే అక్కా! ఆయింట్లోనే అక్కవివాహం జరిగింది. ఏది చూచినా ఎటువైపు చూచినా, మాలతికి అక్కే జ్ఞప్తికి వస్తూండేది

ఇక ఒక్క క్షణం కూడా ఇక్కడ గడపడం కష్టం ఇనేపో— ఈ రోజులేవో పూర్తికాగానే తిరిగి కాలేజికి వెళ్ళి పోవాలనుకొన్నది మాలతి

చివరికి మాలతి వెళ్ళేరోజు సమీపించింది బావ కూడా ప్రయాణమవుతున్నాడు కాని అతడి మనస్సులో ఏదో బాధ పీడిస్తున్నది అతడు మాలతిని సమీపించాడు

"నేను —నేను వెళ్ళి పోవాలను కొంటున్నాను మాలతీ కాని పాప మాట ఏమిటి?" అన్నాడు ముఖం దించుకొని

మాలతి వెంటనే వెళ్ళి తండ్రితో చెప్పింది ఆయన బావని పిలిచాడు.

"నీకొక తల్లా, తోబుట్టువా, ఎవరున్నారుగనుక? మా ఇద్దరికి ఆయుర్దాయం ఉన్నన్నాళ్ళ మేమే పెంచుతాం నీకు దానిని చూడాలని బుద్ధి పుట్టి నప్పుడల్లా నిరభ్యంతరంగా వస్తూండు" అని చెప్పారు

బావ మారు మాట్లాడకుండా ఆరోజే వెళ్ళి పోయాడు మాలతి ప్రయాణం ఆ మర్నాడు ఉదయం రైలుకి

ఆరాత్రి మాలతికి ఎప్పటికీ నిద్ర పట్టలేదు ఎన్నో ఆలోచనలు దానికి తోడు అడపా దడపా పాప ఏడుస్తున్నది

అక్క చనిపోయిన తరువాత ఇల్లు చిన్న బోయినా నిశ్శబ్దంగా మాత్రం లేదు అనుకొన్నది మాలతి తల్లి మరణించినట్లు ఈపసి గుడ్డుకి తెలిసిందో ఏమో, ఒకటే ఏడ్పు ఎవరు ఎంత ప్రయత్నించినా వూరుకొనేది కాదు— ఒక్క మాలతి తప్ప. పాపని తలుచు కొంటే మాలతి గుండె తరుక్కు పోతున్నది. పుట్టుక తోటే భగవంతుడు దానికి తీరని లోటు కల్పించాడు తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ పాపకి ఆలోటు కన్పడనివ్వను అనుకొన్నది మాలతి ఆమెలో మాతృత్వం ఉప్పొంగింది వెంటనే లేచి పాపని ఉయ్యాలనుండి తీసి హృదయానికి హత్తుకొన్నది.

"నేనే మీ అమ్మ అనుకొంటూన్నావా పిచ్చితల్లీ అందుకేనా నేను పోదాక్నే వరకు నీ ఏడ్పు తగ్గించవ్?" అన్నది.

పాపని తిరిగి పడుకోబెట్టి మాలతి వెళ్ళి తన మంచం పైన పడుకొన్నది "పాప నాబిడ్డ, పాప నాబిడ్డ" అనుకొంటూ చివరికి నిద్రపోయింది

ఆనిద్ర లోనే కల వచ్చింది

కలలో అక్క కన్పించింది పూర్తిగా అలంకరించుకొన్నది కాని ముఖం మాత్రం ఎల్లగా, బాధగా ఆ చివరిరోజులా— కన్పించింది చేతులు తిప్పుతూ, ఏదో తెలియని భాషలో మాలతికి ఏదోచెప్తున్నది

మాలతికి ఒక్క అక్షరం కూడా బోధ పడలేదు

అక్క ఇంకొక సారి చెప్పింది ఈసారి ప్రతిమాట విడివిడిగా చెప్పింది చేతులతో, కళ్ళతో, ముఖంతో కూడా సౌంజ్ఞలుచేసింది కాని అదేభాష ఆమె ఏమిటి చెప్తున్నదో మాలతికి ఈసారి కూడా బోధపడలేదు

"ఏమిటంటున్నావో నాకు తెలియడం లేదక్కా" అన్నది మాలతి. అక్క పళ్ళు పటపటా కొరికింది ఆమె కళ్ళలో నుండి కోపం ప్రవహించింది తన మెడలోని మంగళసూత్రాలు తీసి మాలతి పైన విసిరి కొట్టింది అవి మాలతి భుజం మీద పడినై వెంటనే పాంగా మారి పోయాయి మాలతి వెంటనే పాపని ఎత్తుకొన్నది ఆమెకు కొంత అర్థమైంది

"పాపని గురించి చెప్తున్నావా? నీ కూతురిని గురించి నువ్వేమీ దిగులు పడొద్దు అక్కా దాని బాధ్యతనాది. ప్రమాణం చేసి చెప్తున్నాను. అది నాబిడ్డ. నాకు తెలియని భాషలో చెప్తే ఎలా అర్థం అవుతుందిచెప్పు దానికోసం అంత కోపం తెచ్చుకోవాలా? నువ్వు జీవిస్తూండేప్పుడు నాతో కోపంగా మాట్లాడావా?" చనిపోయాక నాపైన కోపంతెచ్చుకొంటూన్నావా? అంటూ మాలతి వలవల ఏడ్చింది.


అక్క ముఖంలో కోపం మాయమైంది -ఆమె కళ్ళవెంట నీళ్ళు కారడం ప్రారంభించినై. మాలతి వైపు దీనంగా చూస్తూ అలా కొంతసేపు దుఃఖించింది తరువాత అంతర్ధానమైంది.

మాలతి గజగజ వణికిపోతూ నిద్ర మేల్కొన్నది. కన్నీరుతో తలగడ తడిసిపోయింది

మర్నాడు ఉదయం మాలతి పట్నం వెళ్ళి పోయింది. తిరిగి చదువులోపడి దుఃఖం కొంతవరకు మరిచి పోయింది కాని, ఆ కల మాత్రం ఆమె మనస్సులో గాఢంగా నాటుకున్నది.

రైలు ఏదో స్టేషనులో ఆగింది ఒక గుజరాతీ స్త్రీ ఇద్దరు పిల్లలతో సహా ఆ పెట్టెలో ప్రవేశించడంతో మాలతి ఆలోచనలకి అంతరాయం కలిగింది. ఒక నిట్టూర్పు విడిచి కిటికీలోనుండి స్టేషను పేరు చదివింది. ఇంకొక రెండు స్టేషనులు దాటితే తన వూరు వస్తుంది ఆ గుజరాతీ ఆమె కొడుకు—ఏడెనిమిది ఏళ్ళుంటాయి— పైన బెర్తు ఎక్కడానికి ప్రయత్నం చేస్తున్నాడు. తల్లి ఒడిలో కూర్చొన్నది ఆడపిల్ల, మూడేళ్ళు ఉంటాయి పాప ఈడుదే కొనుమరి పాపకి కూడ మూడేళ్ళ వయస్సు నేస్తున్నది అక్క చనిపోయి అప్పుడే మూడు సంవత్సరాలు కావస్తోంది

పాపని తలచుకోగానే మాలతి హృదయం ఆనందంతో నిండిపోయింది ఈపాటికి తనకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ ఉంటుంది తనకు





B27BBC-7C TEL



ఉత్సాహం, ఉల్లాసం కలిగించేది అంటేనే కాఫీ, దానిలో ఎన్నుకునేది

బ్రూక్ బాండ్ కాఫీ

ఇతరమైన వాటికంటె బ్రూక్ బాండ్ విశేషమైనదనడానికి కారణాలేమిటి? బ్రూక్ బాండ్ కాఫీ పొడి పొట్లం విప్పండి. మీకే తెలుస్తుంది. కాఫీ విత్తులను అప్పటికప్పుడే వేయించి తయారుచేసినట్టి కమ్మని మంచివాసన వేస్తుంది.

ఏరికోరి కూర్చిన మేలిరకం కాఫీ విత్తులే బ్రూక్ బాండ్ కాఫీ పొడి తయారులో ఉపయోగించబడుతున్నవి. తర్వాత ఆ కమ్మని వాసన తగ్గకుండా గాలి చొరని సెలిఫోన్ సంచులలో శాస్త్రియ పద్ధతులపై ప్యాక్ చేయబడుతుంది. ఇప్పుడే బ్రూక్ బాండ్ కాఫీని ప్రారంభించండి.. .ఆ తాజా, కమ్మని వాసనే శాశ్వతం చేసుకోండి.

మీరూ, బ్రూక్ బాండ్ కలిసి కప్పు మంచి కాఫీ తయారు చేయగలరు. ఎల్లప్పుడూ తాజాగావుండి కమ్మనివానన కలిగి ఉండేదానిని రుచిచూడండి.

కూడా శలవులు ఎప్పటికి వస్తాయా అనిపించింది. ఇక తను యింటికి వెళ్లినప్పటినుండి పాప ఒక్క క్షణం కూడా వదలదు. అసలు తను కూడా పాపని వదల్లేదు. పాప తనవద్దనే పడుకొంటా నంటుంది. తనే దానికి కథలు చెప్పాలి—తనే తల దువ్వి, స్నానం చేయించి బట్టలు కట్టాలి. తనే బువ్వ కలిపి తినిపించాలి. పిన్నీ, పిన్నీ అంటూ ఇక ఏవో పిచ్చి కబుర్లు చెప్తూనే ఉంటుంది

ఈ మూడేళ్లలో చెప్పుకోదగ్గ మార్పులు కొన్ని వచ్చాయి అనుకొన్నది మాలతి, పాత చరిత్ర లోకి తిరిగి వెళ్తూ. నిన్నటితో తన బి. ఏ. చదువు ముగిసినట్టే. నాన్నగారు ఈమధ్య చిన్న గజిటెడ్ ఉద్యోగానికి ప్రమోట్ అయ్యారు అక్క లేదన్న లోటు తప్ప ఇల్లు సిరిసంపదలతో తుల తూగుతున్నది. బావకి కూడా అప్పర్ డివిజన్ వచ్చింది.

కాని, బావ మునుపటిలాగ పాపని చూడడానికి రావడం మానేశాడు.

మొదట్లో పాపని చూడడానికి తరుచు వచ్చే వాడు బావ కాని, రానురాను అతడి రాక తగ్గి పోయింది ఎప్పుడైనా వచ్చినా, మాలతి శలవుల్లో ఇంటికి వచ్చిన రోజుల్లోనే వచ్చేవాడు దానికి కారణం మాలతికి క్రమంగా బోధపడింది అమ్మ అతడిపట్ల మునుపటిలా ప్రవర్తించడంలేదు. ఆమెకి ఇప్పుడు అతిశయం ఎక్కువైనది బావ విషయంలో ఆమె నిరాదరణ స్పష్టంగా కనిపించి పోతున్నది అది బావకి కనపడకుండా మాలతి తన శాయశక్తులా ప్రయత్నించి అతడికి ఏలోటు రాకుండా చూచేది. కాని అమ్మ ప్రవర్తనలో మార్పు బావ గ్రహించే ఉంటాడు

"బావ మునుపటిలాగ రావడం లేదేమమ్మా ?" అని మాలతి తల్లిని ప్రశ్నించి చూచింది కూడా.

"ఇంకా ఎందుకు వస్తాడు ? అతడికి మనకి ఏనాడో సంబంధం తెగిపోయింది రెండవపెళ్లి చేసుకొన్నాడంటే ఇక మనం ఎవరిమో, అత డెవరో" అన్నది తల్లి.

"మన ఆదరణలో అతడికి ఏదైనా తేడా కన్పించి రావడం మానేశాడేమో" అన్నది మాలతి

"అతడికి మనం ఏం లోటు చేశాం ? ఇంటికి వస్తే కాఫీ ఇవ్వలేదా, భోజనం పెట్టలేదా ? మీ నాన్నగారితో సమానంగా కుర్చీలో కూర్చొని అతడు మాట్లాడడంలేదా ? అదే ఆఫీసయితే ? మీ నాన్నగారు కూర్చొంటే అతడు నిలబడి మాట్లాడ వలసినవాడేనా ?" అన్నది తల్లి

మాలతి తెల్లబోయింది "అదేమిటమ్మా ? అతడు మన యింటి అల్లుడు ఇది ఇల్లు కాని, ఆఫీసుకాదు నాన్నగారు అతడికి అధికారి కూడా కాదు. అసలు ఎంత అధికార్లయినా ఇంటికి వచ్చిన తాబేదార్లని అవమానపరచరు. ఆ విషయం నీకు తెలియదేమో. ఇంతకీ అతడు తన బిడ్డని చూడ డానికి వస్తున్నాడు తిండికిలేక వస్తున్నాడా ? అతడు రెండవ వివాహం చేసుకోకపోవడానికి కారణం అతడికి అక్కపైన గల గాఢమైన అనురాగమే కారణమని నువ్వు గ్రహించలేదు అతడు రాన ప్పుడు మనమైనా ఒకసారి ఉత్తరం వ్రాయాలి." అన్నది మాలతి కొంత వేడిలో.

బావ

బాగుంది వరస. అక్క పోయాక అతణ్ణి మనం ఎందుకు రమ్మనాలి ? లోకం చెప్పుకోదా? నువ్వు శలవుల్లో ఇలా ఇంటికి వచ్చేదానివో లేదో, వెనకనుండి అతడు సిద్ధమయ్యేవాడు. ఇప్పుడు మునుపటిలాగ రావడం తగ్గించాడని నేను సంతో షిస్తున్నాను. ఉత్తరం వ్రాయడం కూడానా ? అతడు చూడకపోయినంతమాత్రాన పాపకి నష్ట మేమీ రాదు" అన్నది తల్లి.

మాలతి పెదవి విరిచింది అమ్మ వాదన లోకా చారాన్ని అనుసరించే ఉన్నది కాని, తనకేమో ఇదంతా నచ్చలేదు. అక్క చనిపోయినంతమాత్రాన బావ పరాయివాడై పోయాడా ? అక్కను వివాహం చేసుకోవడంతో అతడు తమ కుటుంబంలో ఒక మనిషి అయ్యాడు తమ ఇంట్లో ఎన్నో రోజులు గడిపాడు. తమతోబాటు కష్టసుఖాలు పంచు కొన్నాడు. ఈ బాంధవ్యం ఎలా తెగిపోతుంది ? అతన్ని మునుపటిలాగే ఎందుకు చూడకూడదు ? అతడు వచ్చి వెళ్తూంటే అక్క మరణించిన లోటు కొంత తమకే తగ్గినట్లు కనిపిస్తూంది అక్క చనిపోవడంతో పాపం బావ ఎంత దిగులు పడుతున్నాడో ! క్రిందటిసారి తను చూచినప్పటికి సగం మనిషి అయిపోయాడు అతణ్ణి ఆదరించి, అతడి మనస్సుకి కొంత శాంతిని సమకూర్చడానికి ప్రయత్నం చెయ్యాలని ఎవరికీ తోచదేం ? అతడు రెండవ వివాహం చేసుకోలేదన్న విశ్వాసం కూడా ఈ ఇంట్లో ఎవరికీ లేకపోయింది.

ట్రెయిను ఆగింది మాలతి దిగవలసిన స్టేషను వచ్చింది. ఒకసారి కళ్లు తుడుచుకొని లేచింది.

బంట్రోతుతో సహా తండ్రి స్టేషనుకి వచ్చాడు.

"ఏమమ్మా పరీక్షలు ఎలా వ్రాశావ్ ?" అని ప్రశ్నించాడు.

"బాగానే వ్రాశాను నాన్నగారు. పాపని తీసుకు రాలేదా ?" అన్నది మాలతి.

"లేదమ్మా ఎండ మాడ్చివేస్తున్నది. అందుకని తీసుకురాలేదు"

మాలతి ఇల్లు చేరేసరికి పాప అరుగుమీద నిల్చొని నిరీక్షిస్తున్నది పిన్ని దిగగానే ఒక్క పరు గున వచ్చి పెనవేసుకొంది పాపని హృదయానికి హత్తుకొని మాలతి ముద్దుల వర్షం కురిపించింది.

"నువ్వు వత్తావనే చూత్తున్నాను" అని పాప చెప్పింది.

"నేను వస్తానని నీకు ఎలా తెలిసిందమ్మా ?" అన్నది మాలతి


"తాతారు చెప్పారు అందుకే బువ్వ కూడా తినలేదు" అన్నది పాప

"నేను వచ్చేశానా ? గభాలున స్నానం చేస్తాను. ఆ తర్వాత ఇద్దరం భోజనం చేద్దాం. ఇంట్లోకి పద" అన్నది మాలతి.


కుశలప్రశ్నలువేసి కాఫీ ఇచ్చింది తల్లి. తండ్రి ఎదురుగా కుర్చీలో కూర్చొన్నాడు

"ఏమిటి విశేషాలు ?" అని మాలతి అడిగింది.

"నీకొక శుభవార్త సిద్ధంగా ఉన్నది. త్రోవ లోనే చెప్పాలనుకొన్నాను. మంచి సంబంధం ఒకటి వచ్చింది అబ్బాయి ఆనర్సు ప్యాసయినాడు. ఈమధ్య జరిగిన పరీక్షలలో రైల్వేలో క్లాస్ వన్ ఆఫీసరుగా సెలక్షన్ వచ్చింది కుర్రవాడు లక్ష







బావ

ణంగా ఉన్నాడు బి ఏ. ప్యాసయిన అమ్మాయిని చేసుకొంటాడట. కట్నం ప్రసక్తి లేదట. అమ్మాయి నచ్చితే చాలునట. కాని, అతడి తల్లి తండ్రులు మాత్రం లోపాయకారీగా వో పది పది హేనువేలు రాబట్టాలని చూస్తున్నారట. ఏదో విధంగా స్థిరం చెయ్యాలనుకొంటున్నాం" అని చెప్పాడు తండ్రి

"నిన్ను చూశాక తప్పకుండా ఆ అబ్బాయి నచ్చుతాడనే నా నమ్మకం" అన్నది తల్లి.

పాపకోసం తెచ్చిన వస్తువులు పెట్లోంచి బయటికి తీసింది మాలతి

పాప కళ్ళు ఆనందంతో మెరిశాయి. "పొద్దుట నాన్నగారు నాకు పళ్ళూ, గౌన్లూ అన్నీ తెచ్చారు. ఇప్పుడు మళ్ళీ నువ్వు తెచ్చావు" అన్నది

పెట్టె మూతవేసి వెనక్కి తిరిగింది మాలతి "ఏమిటమ్మా, బావ వచ్చాడా ? ఏడీ ?" అని తల్లిని ప్రశ్నించింది

"ఆఁ ! వచ్చాడమ్మా అదొక గొడవ" అన్నది తల్లి

"ఏం జరిగిందీ ?" అని ఆతృతగా ప్రశ్నించింది మాలతి

"పెద్ద విశేషం ఏమీలేదు ఇప్పుడే రైలు దిగి వచ్చావు స్నానంచేసి భోజనానికిలే. సావకాశంగా చెప్తాను" అన్నది తల్లి.

"అది కాదమ్మా గొడవ అంటున్నావ్ ? ఏమిటి జరిగిందో ఇప్పుడే చెప్పు" అన్నది మాలతి

"అతడు ఈ ఉదయం వచ్చాడు ఆమాట, ఈమాట అయ్యాక, తను వచ్చిన విషయం బయట పెట్టాడు అక్క చనిపోయాక తను తిరిగి వివాహం చేసుకోకూడదనే మొదట నిశ్చయించుకొన్నాడట కాని, ఈ మూడేళ్ల అనుభవంతో తెలుసుకొన్నాడట— ఏవిధంగా చూచినా తను ఇంకొక వివాహం చేసుకోక తప్పదని—"

"ఏమిటీ ? బావ రెండవ పెళ్ళి చేసుకొంటాడా ? అన్నది మాలతి ఆశ్చర్యంతో

"తమాషా అంతా పూర్తిగా విను పాపను వదిలి తను జీవించలేక పోతున్నాడట. పాప అతడి వద్దనే ఉండాలట తను ఏ పరాయిపిల్లనో చేసుకొంటే ఆమె పాపని సరిగ్గా చూడకపోవచ్చునట. స్వర్గంలో ఉన్న మీ అక్కకి శాంతి లేకుండా పోతుందట అందుచేత బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడట నిన్నిచ్చి అతడికి వివాహం చెయ్యమని అడగడానికి వచ్చాడట అన్నివిధాలా అతడికి నువ్వే అనుగుణ్యమైన దానివట నీలో అక్కని చూసుకుంటాడట" మూతి తిప్పుతూ చెప్పింది తల్లి.

"నువ్వేమిటి అన్నావ్ ?" అప వెంటనే ప్రశ్నించింది మాలతి ఆమె తలలో ఏదో సుడిగుండం తిరగడం ప్రారంభించింది.

"ఏమిటి అన్నానో ఆమాత్రం గ్రహించలేవా ? ముప్ఫైఏళ్లు దాటినవాడు. పైగా నాటికి నేటికి ఆ గుమాస్తా ఉద్యోగమే వెలగబెడుతున్నాడు. ఉన్న ఒక్కదానివి నిన్ను ఆ రెండో పెళ్ళి వాడికి ఇస్తానా ? ఏమొహం పెట్టుకొని అడగడానికి వచ్చాడు ?" అన్నది తల్లి.

"పిచ్చమ్మాయిని కడుపులో పెడేసుకొన్నాడుః ఈసారి నీకోసం చెయ్యి జాపుతున్నాడు" అన్నాడు తండ్రి

"అతడికి నువ్వు ఏమని సమాధానం చెప్పావ్ ?" అని స్వరం రెట్టించి అడిగింది మాలతి

"అలా చూస్తావేం ? అతడికి మర్యాదగానే జవాబు చెప్పాను. మా మాలతిని ఒక పెద్ద ఆఫీసరుకి ఇవ్వబోతున్నామని, సంబంధం మూడు వంతులు నిశ్చయమైపోయిందని చెప్పాను. అతణ్ని నిరభ్యంతరంగా ఇంకొక అమ్మాయిని చూచి వివాహం చేసుకోమన్నాను. పాప మనవద్దనే ఉంటుందని, దానికోసం ఏమీ దిగులుపడవద్దని చెప్పాను" అన్నది తల్లి.

"బావ ఏమన్నాడు ?" అన్నది మాలతి.

"ఇంకొక సంబంధం ప్రసక్తి లేదన్నాడు. ఈ వివాహము తలపెట్టడంలో పాపని తన వద్దకు తీసుకుపోవడ మన్నది ఒక ముఖ్య కారణం' అన్నాడు అది ఇంకొకలాగ జరిగే అవకాశం లేదన్నాడు. మేము అంగీకరించకపోవడంతో తన చివరి ఆశ కూడా విఫలమైపోయిందని, ఇక తను ఈ ప్రపంచంలో ఎందుకు జీవించాలో కారణం కనపడడంలేదని అన్నాడు" అని తండ్రి చెప్పాడు.

"ఎంత ఘోరం బావ చిన్నబుచ్చుకొని వెళ్లిపోయాడా ?" అన్నది మాలతి హీనస్వరంతో

"ఏవో ఆశలు పెట్టుకొని వచ్చాడు పాపం చిన్నబుచ్చుకోడూ ? ముఖాన్ని నెత్తురులేదు ఒకసారి పాపని ఎత్తుకున్నాడు 'అమ్మా ! తాత, అమ్మమ్మగార్ల వద్ద బుద్ధిగా ఉండు' అని దానికి చెప్పాడు. కళ్ళు తుడుచుకొంటూ వెళ్లిపోయాడు" అని చెప్పాడు తండ్రి

"అదిగో తనతో తెచ్చిన ఆ చేతి సంచి కూడా మరిచిపోయి వెళ్లిపోయాడు" అన్నది తల్లి.

మాలతికళ్ళు నీళ్లతో నిండాయి "కనీసం నేను ఇవాళ వస్తున్నట్టు మీరు అతడితో చెప్ప లేదా ?" అన్నది.

"చెప్పలేదు సుమా నువ్వు వచ్చేవరకు బైటాయిస్తాడని భయంవేసింది" అన్నది తల్లి

మాలతి కళ్లు తుడుచుకుని దిగ్గున లేచింది. బావ చేతిసంచీ, తన పెట్టె, బెడ్డింగు వద్దకు చేర్చింది

"పాపా రా అమ్మా, నాన్నగారి వద్దకి వెడదాం" అన్నది

"అదేమిటే ?" అన్నారు తల్లి, తండ్రీ నిర్ఘాంతపోయి.

"ఇక ఒక్క నిముషం కూడా ఆలస్యం చెయ్యడానికి వీలులేదు నేను వారి వద్దకు పోతున్నాను. అక్క ఇల్లు నిలబెట్టవలసిన బాధ్యత నాది ఆనాడు కలలో అక్క ఏమిటి చెప్పిందో ఇప్పుడు నాకు స్పష్టమయింది నేనేదో త్యాగం చేస్తున్నానని మీరు భావించకండి అటువంటి అమృతహృదయుల్ని పొందడం నిజంగా నా అదృష్టం మేము ఏ అన్నవరమో వెళ్లి దైవసన్నిధిని నిరాడంబరంగా వివాహం చేసుకొంటాం ముహూర్తం వెంటనే స్థిరపరచి ఉత్తరం వ్రాస్తాం మీకు రావాలని మనసారా కోర్కె కలిగితే తప్పకుండా రండి" అంటూ పాపని ఎత్తుకొని, రిక్షాకోసం వీధిలోకి వెళ్లింది మాలతి. ★

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతి రచనతోనూ దాని రచయితగాని, రచయిత్రిగాని అది తమ స్వంత రచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ, హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించ లేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

వేల్పులకైనా పూర్వులు తప్పవు



సూర్యుడు

సూర్యుడు ప్రత్యక్షదైవం కావడంవలన కేవలం హిందూ దేవతాగణంలోనే కాకుండా ప్రపంచంలోమిగిలిన జాతుల దేవతాగణాల్లో కూడా ప్రత్యేకస్థానాన్ని వహించేడు ఇంద్రాది దేవతలు వేదాల్లో ప్రాముఖ్యతను వహించినా, పౌరాణిక కాలం నుంచి వెనుకకు నెట్టివేయబడ్డారు కాని సూర్యుని ప్రాముఖ్యత మాత్రం కొంచెం కూడా తగ్గలేదు.

వేదాల్లో సూర్యుడు అనేక విధాలుగా వర్ణింప బడినాడు సవితృ, పూషన్, మిత్ర శబ్దాలు కేవలం సూర్యునకు పర్యాయపదాలుగా యిప్పుడు భావించ బడుతున్నాయి గాని మొట్టమొదట వీరు వేర్వేరు దేవతలుగా భావించబడ్డారు.

సూర్యశబ్దం సూర్యబింబానికి, సూర్యదేవుడికి కూడా వాడబడింది. సూర్యుని నేత్రం తరచుగా స్తోత్రం చేయబడింది. సూర్య తేజస్సునే సూర్యుని దృష్టిగా పూర్వులు భావించేరు కొన్నిచోట్ల సూర్యుడే మిత్రుడు, వరుణుడు, అగ్ని మొదలైన దేవతల నేత్రముగా గుర్తించబడుచున్నాడు. సూర్యుడు సమస్తాన్నీ చూడగలడు కాబట్టి జీవుల పాపపుణ్యాలను గుర్తించుచున్నాడు. సూర్యుడు జీవు లకు చైతన్యాన్ని ప్రసాదిస్తున్నాడు. సూర్యుడే చరా చర ప్రపంచ రక్షకుడు.

కొన్నిచోట్ల సూర్యుడు, ఆకాశంలో విహరించే పక్షిగాను, మరికొన్నిచోట్ల వృషభంగాను, మరి కొన్నిచోట్ల ఆకాశమందున్న మణిగాను కూడా భావించబడ్డాడు. మిత్రావరుణుల ఆయుధంగా కూడా సూర్యుడు భావించబడినాడు. సూర్యుడు చీకటిని పోగొట్టి జగత్తునకు కాంతిని ప్రసా దించుచున్నాడు వ్యాధులను, దుస్స్వప్నాలను పోగొట్టి సూర్యుడు జీవుల ఆయుర్దాయాన్ని పెంచుచున్నాడు ఇతనివల్లనే దినము ఏర్పడు తుంది. సూర్యుడే సమస్త జీవాధారుడు. కొన్ని చోట్ల సూర్యుడు దేవతల పురోహితునిగా కూడా భావించబడ్డాడు. జనులు తమను పాపరహితులనుగా మిత్రావరుణులకు తెలుపవలసినదిగా సూర్యుని స్తోత్రం చేస్తున్నారు.

ఉషస్సు సూర్యుని ప్రసాదిస్తుంది. ఉషస్సు యొక్క అంకమందు సూర్యుడు ప్రకాశించు చున్నట్లుగా కొన్నిచోట్ల వర్ణించబడింది. మరి కొన్నిచోట్ల ఉషస్సు సూర్యుని భార్యగా భావించ బడింది. ఇతడు అదితి కుమారుడు కావడంవలన ఆదిత్యుడనే పేరు వచ్చింది. తండ్రి ద్యౌస్. దేవతలు యితనిని సముద్రం నుంచి తీసి ఆకాశ మందు ఉంచేరని కొన్నిచోట్ల చెప్పబడింది.

సవిత ముఖ్యంగా స్వర్ణదేవతగా స్తోత్రం చేయ బడ్డాడు. అతడు స్వర్ణనేత్రుడు, స్వర్ణబాహువు, స్వర్ణజిహ్వుడు. అతని రథము, ధ్వజము కూడా స్వర్ణమయం. అతడు తన స్వర్ణకాంతితో భూమ్యాకాశాలను ప్రకాశింపజేస్తున్నాడు. దిశలను స్పర్శించగల తన స్వర్ణబాహువులతో సవిత జీవు లను ఆశీర్వదిస్తున్నాడు. సవిత, తన స్వర్ణ రథ మందు అధిష్టించి వాయుమార్గంలో ప్రయాణం చేస్తూ జనులను చూస్తున్నాడు. అతడు రాక్ష సుల్ని, దుస్స్వప్నాలను తరిమివేసి జనులను పాప రహితులనుగా చేస్తున్నాడు. జలవాయువులు అతని స్వాధీనంలో ఉన్నాయి. మిగిలిన దేవతలు అతనిని అనుసరిస్తున్నారు. కొన్నిచోట్ల సవితకు సూర్యు నితో పోలికలు ఉన్నాయి. కాని, మరికొన్నిచోట్ల సూర్యుని కాంతివలన సవిత ప్రకాశించుచున్నాడని, మరికొన్నిచోట్ల జనులు పాపరహితులమని సూర్యు నితో చెప్పవలసినదిగా సవితను కోరుటవల్లను, సూర్యుడు, సవిత వేర్వేరు దేవతలని ఆ కాలంలో భావించబడ్డారని వూహించవచ్చును.

పూషుడు జటాధారి. ఇతని పాదం దక్షిణ బాహువు కొన్నిచోట్ల వర్ణించబడ్డాయి. ఇతడు స్వర్ణాయుధదారి ఇతని రథానికి మేషములు కట్ట బడ్డాయి. ఇతడు వ్యోమనౌకలతో సూర్యుని దూతగా వ్యవహరిస్తున్నాడు. ఇతడు ప్రపంచాన్ని పరిశీలిస్తూ పూర్వమార్గంలో సంచరిస్తున్నాడు. ఇతని నివాసం స్వర్గం, రథికశ్రేష్ఠుడైన యితడు మార్గా లను సంరక్షిస్తున్నట్టుగా కొన్నిచోట్ల చెప్ప బడింది. ఇతడు పశువులను కూడా రక్షించు చున్నట్లు కొన్నిచోట్ల చెప్పబడింది. సూర్యుని యొక్క అంశనే యీవిధంగా వర్ణించేరని కొందరి అభిప్రాయం.

మిత్రుడు తరచుగా వరుణునితో కలిపి స్తోత్రం చేయబడ్డాడు. ఇతడు కూడా ఆదితి మిత్రుడు. ఇతడు జనులను కర్తవ్యోన్ముఖులను చేస్తున్నాడు. ముఖ్యంగా యితడు వచ్చే పోయే ప్రజలను ఆజ్ఞాపిస్తున్నాడు. కొన్నిచోట్ల యితనికి పగటితో సంబంధం ఉన్నట్లు చెప్పబడింది మరి కొన్నిచోట్ల సవితతో యితనికి అభేదం చెప్ప బడింది.

శివుడు, విష్ణువు మొదలైన పౌరాణిక దేవతలు ప్రాబల్యంలోనికి వస్తున్న సమయంలో అనగా కొంచెం ఇంచుమించు క్రీస్తుకు పూర్వం మూడవ శతా బ్దంలో సవిత, పూషుడు, మిత్రుడు మొదలైన వారు సూర్యుని రూపాలే అని భావించబడింది. ఇందుకు కారణం పర్షియాలోని సూర్యారాధన అని కొందరి అభిప్రాయము. సూర్యమహాత్మ్యాన్ని విశే షంగా వర్ణించేది సాంబపురాణం.

సాంబపురాణం

దేవత లందరిలోను సూర్యుడే శ్రేష్ఠుడని, వశి ష్టుడు బృహద్బలుడనే రాజునకు ఉపదేశించడం, కృష్ణుడు సాంబుని శపించడం, సూర్యలోక వర్ణన, కృష్ణుని అనుమతితో సాంబుడు మిత్రవనంలో సూర్యుని ఆరాధించడం, సూర్యుడు ప్రత్యక్షమై సాంబుని కుష్టువ్యాధిని నివారించడం, చంద్రభాగా నదిలో సాంబునకు సూర్య విగ్రహం లభించడం, సాంబుడు ఆ విగ్రహాన్ని మిత్రవనంలోని సాంబ పురంలో ప్రతిష్టించడం యిందులో వర్ణించ బడ్డాయి.

ఒకప్పుడు దేవతలు సూర్యకాంతిని భరించలేక తన కాంతిని తగ్గించుకోవలసినదిగా — సూర్యుని

ప్రార్థించేరు. సూర్యుడు ఆ ప్రార్థనను అంగీకరించగా విశ్వకర్మ శకద్వీపంలో సూర్యుని తరిణి పట్టి అతని కాంతిని తగ్గించేడు. ఆ విశ్వకర్మే కల్పవృక్షంతో సూర్యుని విగ్రహాన్ని నిర్మించి సాంబునికి దొరికే నిమిత్తం చంద్రభాగా నదిలో వదిలేడు శకద్వీపంలోని మాగులు అనేవారు ఆ విగ్రహాన్ని పూజించడానికి అర్హులు. శ్వేతద్వీపంలో సూర్యుడే విష్ణువుగాను, కుశ ద్వీపంలో మహేశ్వరుడుగాను, పుష్కర ద్వీపంలో బ్రహ్మగాను శకద్వీపంలో భాస్కరునిగాను పూజింపబడుచున్నాడని ఆ విగ్రహం సాంబునితో చెప్పింది.

సూర్యునకు సంజ్ఞాదేవియందు, వైవస్వత మనువు, యముడు, యమున జన్మించడం, తరువాత సంజ్ఞాదేవి సూర్యుని తేజస్సు భరించలేక తన శరీరమునుండి ఛాయాదేవిని సృష్టించి ఆమెను సూర్యుని సేవలో నియమించి తాను పుట్టింటికి వెళ్లిపోవడం, ఛాయాదేవికి సూర్యునివలన సావర్ణి మణువు శనైశ్చరుడు తపతి జన్మించడం, ఛాయాదేవి వృత్తాంతం సూర్యునకు తెలియడం, విశ్వకర్మ సూర్యుని తరిణి పట్టి అతని కాంతిని తగ్గించడం, తరిణి పట్టగా వచ్చిన కిరణాలతో విశ్వకర్మ చక్రం మొదలైన ఆయుధాలను నిర్మించి దేవతలకు యివ్వడం, అశ్వరూపంలో ఉన్న సంజ్ఞాదేవితో సూర్యుడు కూడా అశ్వరూపం ధరించి క్రీడించగా అశ్వినీ దేవతలు జన్మించడం, సూర్యుని వరం వలన రాక్షసులు బలవంతులు కాగా బ్రహ్మాది దేవతలు సూర్యుని పరివేష్టించి ఉండి అతనిని రాక్షసులకు దూరం చేయడం, రుద్రునకు సూర్యుడు ప్రత్యక్షం కావడం, జమదగ్నికి సూర్యుడు ప్రత్యక్షమై, రేణుకాదేవి నిమిత్తం పాదరక్షలను, గొడుగును యివ్వడం మొదలైనవి కూడా సాంబపురాణంలో వర్ణించబడ్డాయి

సూర్యుడే బ్రహ్మ రూపంలో ప్రజాపతులను వివిధ జీవకోటిని సృష్టించేడు సూర్యుడు అదితికి ద్వాదశాదిత్య రూపంలో జన్మించేడు. ఇంద్రధాత్ర, పర్జన్య, పూషా, త్వష్ట్ర, ఆర్యమన్, భగవివస్వాన్ విష్ణు, అంశుమాన్, వరుణ, మిత్ర యివి ద్వాదశాదిత్యుల పేర్లు. ఇందులో ఇంద్రుడు దేవతలకు అధిపతి కావడం, ధాత ప్రజాపతియై జీవకోటిని సృష్టించడం, పర్జన్యుడు మేఘాల్లో ఉండడం, పూషుడు ఆహారపదార్థాల్లో ఉండి జీవులకు బలవర్ధకుడు కావడం త్వష్ట వృక్షలతలయందు నివసించడం, ఆర్యముడు జీవకోటి శరీరంలో ఉండి వాయుగమన నిర్గమన కారకుడు కావడం, భగుడు భూమిలో నివసించడం, వివస్వంతుడు అగ్నియందుండి జీర్ణ ప్రక్రియకు తోడు కావడం, విష్ణువు దేవ వైరులను నశింపజేయడం, అంశుమంతుడు వాయువుయందుండి జనులకు ఆహ్లాదకరుడు కావడం, వరుణుడు నీటియందుండి జీవులకు ప్రాణాధారం కావడం, మిత్రుడు చంద్రభాగా నదీ తీరంలో వెలసి భక్తులకు వరప్రదాయి కావడం కూడా సాంబపురాణంలో వర్ణించబడ్డాయి.

సూర్యుడే పరబ్రహ్మ. అతడే త్రిమూర్తులను సృష్టించి సృష్టి స్థితి లయ కార్యములందు నియోగించేడు. తరువాత అదితికి పుత్రుడుగా జన్మించేడు. సూర్యుని సంతాన వివరం సూర్య మహాత్మ్యం మొదలైనవి బ్రహ్మపురాణంలో విపులంగా వర్ణించబడ్డాయి. సూర్యుడు యాజ్ఞవల్క్యునకు యజుర్వేదాన్ని ప్రసాదించిన వృత్తాంతం బ్రహ్మ వైవర్త పురాణంలో వర్ణించబడింది. సూర్యుని గమనానికి మందేహాసురులు అడ్డం వస్తారని బ్రహ్మాండపురాణంలో చెప్పబడింది. సూర్యుని గమనంవలన ఏర్పడే కాల వివరణ, ఖగోళ విచిత్రాలు భాగవత శేషంలో వర్ణించబడ్డాయి.

ఇవికాకుండా సౌరధర్మ పురాణం, సౌర ధర్మోత్తర పురాణం, సూర్యపురాణం మొదలైన వాటిలో సూర్య మహాత్మ్యం విశేషంగా వర్ణించబడింది. భవిష్య పురాణమే సూర్యపురాణమని కొందరి అభిప్రాయం కాని శ్రీ డి ఆర్. భండార్కార్ సూర్య పురాణం వేరే ఉన్నదని, జోధ్‌పూర్ సమీపంలో సేవకులనే బ్రాహ్మణులకు అది తెలియుననీ చెప్పేరు. ఈ సేవకులే శకద్వీప బ్రాహ్మణులు.

అదితికి ఏడుగురు కుమారులు జన్మించేరు ఎనిమిదవ గర్భం యే ఆకారం లేకుండా ముద్దగా జన్మించడంవలన అవతల పారవేసేరు. ఆముద్దయే వివస్వాన్ అనే పేరుతో సూర్యుడుగా మారిందని వర్ణించే కథ ఉంది. సుగ్రీవుడు, కర్ణుడు, సూర్య పుత్రులు. సూర్యునివద్ద ఉండే లేఖకుడు పింగళుడు. ఇతడు జీవుల మంచి చెడ్డలను వ్రాస్తూ ఉంటాడు.

పద్మం సూర్యోదయంతో వికసించి సూర్యాస్తమయంతో ముకుళించుకొని పోతుంది. కాబట్టి పద్మాన్నే పద్మిని అనే పేరుతో యితని భార్యగా భావించేరని కొందరి అభిప్రాయం. సూర్యుడు కొన్నిచోట్ల చతుర్భుజుడుగాను, మరికొన్నిచోట్ల ద్విభుజుడుగాను చిత్రించబడ్డాడు ఇతడు పద్మాసనుడు, పద్మపాణి. చక్రాన్ని కూడా ధరించినట్లు కొన్నిచోట్ల చిత్రించబడింది ఇతని రథాన్ని ఏడు గుర్రాలు లాగుతూ ఉంటాయని కొన్నిచోట్ల చెప్పబడింది సప్త అనే పేరుగల ఒక గుర్రమే యితని రథానికి ఉన్నట్లు కొందరి అభిప్రాయం. మొత్తంమీద సూర్యతేజస్సులో ఉండే ఏడు రంగులనే యేడు గుర్రాలుగా భావించేరని ఆధునికుల అభిప్రాయం.

విగ్రహారాధనకు మొట్టమొదటి కారణం సూర్యుడే అని కొందరి అభిప్రాయం. దినకర్త అయిన సూర్యుని బింబరూపంలో ఆరాధించడమే విగ్రహారాధనకు ప్రారంభమని వీరి అభిప్రాయం కాని అత్యంత ప్రాచీనమైన మహెంజోదారో, హరప్పా శిధిలాల్లో దొరకిన విగ్రహాల్లో సూర్య ప్రతిమలుగాని, బింబ రూపాలుగాని లేవు. అందుచేత యీ అభిప్రాయం బలంగా కన్పించదు.

సూర్యుని ఉదయ మధ్యాహ్నాస్తమయ రూపాలే హిందువుల త్రిమూర్తి భావనకు దారితీసేయి అని మరికొందరి అభిప్రాయం. ఉదయం సృష్టికర్త అయిన బ్రహ్మ స్వరూపునిగాను, మధ్యాహ్నం సంరక్షకుడైన విష్ణువుగాను, సాయంత్రం సంహారకర్త అయిన రుద్రునిగాను సూర్యుని స్తుతించే శ్లోకం యీ అభిప్రాయాన్ని బలపరుస్తుంది. కాని సూర్యునకు విష్ణువునకు అభేదం గుర్తించబడినంత తరచుగా సూర్యుడు మిగిలిన దేవతలతో పోల్చబడలేదు. సూర్యునకు గరుడవాహనం కూడా ఉన్నట్లు కొన్నిచోట్ల చెప్పబడింది.

జరతుష్ట్ర మతంలో సూర్యుడే అహురా మజ్దా అనే పేరుతో సృష్టికర్తగా భావించబడుచున్నాడు. బాబిలోనియా పౌరాణిక గాథల్లో సూర్యుడు చంద్రునివల్ల జన్మించినట్లు చెప్పబడింది ఇతని పరిచారకుల పేర్లు సత్యం, ధర్మం.

త్రిమూర్తి స్వరూపుడును, హిందువులకు అనుదినం ఆరాధనీయుడు అయిన సూర్యుడు బహిరంతర్గతమైనతమస్సును పోగొట్టి భారతీయులను రక్షించుగాక !

-మహేష్ ★

వైజ్ఞానిక గాథావళి-22

టీకాల కథ



అది 1796 సంవత్సరము, మే 14 వ తేదీ. ఇంగ్లండులో డాక్టర్ జెన్నర్ వైద్యశాల. మందుల కోసము వచ్చిన రోగుల సంగతి మరచిపోయి ఒక పల్లెటూరి స్త్రీని ప్రశ్నలువేస్తూ నిలబెట్టేశారు డాక్టరుగారు. ఆమె అన్నది : పశువుల స్ఫోటకము తనకు సోకిందటా, కనక మనుష్యుల స్ఫోటకము మరి సోకదట. కాంపౌండరుకూ అసిస్టెంటుకూ ఆ కారణము బోధపడలేదు. కొంతసేపటి కాయన ఏదో ఆలోచిస్తూనే ఇంటికి వెళ్ళిపోయారు. రోగులు ఆయన కాంపౌండరుగారు ఇచ్చిన మందులు తీసుకు పోయారు.

ఇంటికి వెళ్ళారే కాని డాక్టర్ జెన్నర్ రోజూలాగా స్నానానికి వెళ్ళలేదు ఈజీఛైరులో చేరబడి ఏదో ఆలోచన నెమరువేసుకుంటున్నారు. కాంపౌండరు వచ్చి 'తల నొప్పిగా ఉన్నదా బాబూ!' అన్నాడు.

'లేదు. పశువుల స్ఫోటకము వచ్చినవారెవరేనా ఉన్నారా కాంపౌండర్?'

'ఎవరో 'సరానెమ్స్'ట. వచ్చి వెళ్ళిపోయిందిబాబూ'!

'ఆ నాతో ఎందుకు చెప్పలేదూ ?'

"తమరు ఆ పల్లెటూరి పెద్దామెతో మాట్లాడి విచారముగా ఇంటికి వచ్చేశారు. అసిస్టెంటువారు వచ్చినవాళ్ళకి నిన్నటి మందు లిమ్మంటే ఇచ్చి ఇలాగ మీ దగ్గరకి వచ్చాను.

ఫకాలున నవ్వేశాడు జెన్నర్

"సరే కాని ఆ 'సరానెమ్స్'ని పట్టుకురా అర్జంటుగా"

కాంపౌండరు వెళ్ళిపోయాడు.

"జేమ్స్. రా ఇలాగ, అర్జంటు"

"ఏం డాక్టర్‌జీ"

"పావుగంటలో నీకు టీకాలు వేస్తాను. కాని స్ఫోటక విషయముతో కాదు. ఇక్కడే ఉండు."

టీకాలు వెయ్యరాదని ఇంగ్లండులో చట్టము వచ్చింది అప్పటికి కొద్ది రోజుల క్రితము. స్ఫోటక వ్యాధిని నివారించడానికి కాన్‌స్టాంటినోపిలులో చిన్న సూదితో స్ఫోటకపు (విష) రసినితీసి ఆ సూదితో చిన్న పిల్లల చర్మము మీద గీరేవారట. 1717 లో ఏప్రిల్ మొదటి తేదీన 'మేరీ' అనే ఆమె కాన్‌స్టాంటినోపిల్ నుంచి వ్రాసిన ఉత్తరముతో ప్రచారమైన ఆ టీకాల పద్ధతి పనిచేయునా అని ఇంగ్లాండులో సోదా చూశారు. ఆ పద్ధతివల్ల స్ఫోటకము చాలా చాలా పల్చగా—నిరపాయకరంగా సోకి ఆ రోగికి అటు తర్వాత బలమైన స్ఫోటకము రాకుండా కాస్తుంది. అని నమ్మకము వ్యాపించింది ఈపరీక్ష మొదటలో మరణశిక్ష విధించబడిన ఖైదీలమీద చేశారు వారికి పల్చగానే కాని బలంగా స్ఫోటకము రాలేదు. ఇక వారికి బలమైన స్ఫోటకము రాదు. అయినా ఇది నిరూపించడానికి అలా టీకాలు వేసిన వారికే మళ్ళీ పెద్ద డోసులో వ్యాధికారక విషము ఎక్కించాలి. అది ఎవరు చేయగలరు ? జెన్నర్ రూపాంతరములో ఆ పరీక్షను జరిపి జయించాడు.

ఆ 'సరానెమ్స్' వచ్చింది. జెన్నరు ఆమె పంటి మీది బొబ్బను—పశు స్ఫోటకపు బొబ్బ, మనుష్యుల స్ఫోటకపు బొబ్బ కాదు—సూదితో పొడిచి, ఆ రసిని ఒక గొట్టములోనికి ఎక్కించినాడు. ఈ రసిని చిన్న చుక్కను "జేమ్స (ఫిప్స్) శరీరము గీరి ఎక్కించాడు. కొన్నాళ్ళకు అక్కడ బొబ్బలు ఒకటి, రెండు పొక్కినవి. తరువాత మానిపోయినవి. ఫిప్స్‌కు పశు స్ఫోటకము సోకి మానిన దన్నమాట !

తొలిరోజున (14—5—1796 నాడు) జెన్నర్‌తో మాట్లాడినామె—పల్లెటూరి పెద్దామె—చెప్పింది ఆయనకు, "పశువుల స్ఫోటకము వచ్చిన వారికి మనుష్యుల స్ఫోటకము మరి రాదు" అని. మనుష్యుల స్ఫోటకపు విషము— చిన్న రవ్వను— ఆరోగ్యము పొందిన ఫిప్స్‌కు ఎక్కించాడు జెన్నర్. అతనికి పలచని స్ఫోటకము కూడా రాలేదు. జయించా ననుకున్నాడు జెన్నర్.

పశువుల స్ఫోటకమూ మనుష్యుల స్ఫోటకమూ జాతిలో ఒకలాంటి రోగాలే. కాని పశువుల స్ఫోటకము మనుష్యులకు వస్తే అది అపాయకారి కాదు అయినా ఒకసారి అది సోకితే మనుష్యుల స్ఫోటకాన్ని మళ్ళీ రానివ్వదు. టీకా ద్వారా మనుష్యులకు పశువుల స్ఫోటకము రెండే రెండు బొబ్బలతో సోకేటట్లు చేశేవారు మొన్న మొన్నటివరకూ డాక్టర్లు. అవి మానిపోయిన తర్వాత ఆ టీకాలు వేయించుకున్న వారికి స్ఫోటకము సోకనే సోకదు. ఇదీ డాక్టర్ జెన్నర్ మేధాఫలము.

ఈనాడు టీకాల పద్ధతి ఇంకా నయము చేశారు మనుష్యుల స్ఫోటకపు విషము దూడల చర్మము గీరి అక్కడ ప్రవేశపెడతారు. దూడలకు బలమైన స్ఫోటకము రాదు. కాని చిన్న బొబ్బ పొక్కుతుంది ఆ పశు స్ఫోటకపు రసిని మనుష్యులలో ఎక్కిస్తారు చిన్న బొబ్బ పొక్కి మానిపోతుంది. అదే పశుస్ఫోటకము రావడమంటేను. అది వస్తే —అనగా టీకాలు వేయించుకుంటే—స్ఫోటకము ఒక పట్టాన సోకదు. టీకా వేసినచోట పొక్కక పోతే టీకా 'మందు' సరిగ్గా శరీరంలో ప్రవేశించ లేదనో, లేక ఆ వ్యక్తికి వ్యాధి నిరోధకశక్తి ఉన్నదనో అర్థము. అలాటి సందర్భంలో నెల గడిచిన తర్వాత మరొకమారు వేయించుకోడము క్షేమము ★

మొల్లానసిరుద్దీన్ కథలు

శ్రీమహీధర నళినీ మోహన్

మతి మరుపు



ఒకప్పుడు కాజీకి మొల్లానసిరుద్దీన్ మీద ఎందుకో కోపం వచ్చింది.

ఆ రోజున మొల్లాకి ఏదో పని తగిలి కాజీ ఇంటికి బయలు దేరేడు. ఆయన రాకను అంతదూరంనుంచి కిటికీలోంచి చూసి, కాజీ ఇంట్లోకి జారుకున్నాడు. ఆయన మొగం చాటు చేయడాన్ని మొల్లా చూడక పోలేదు. కాని ఏమీ ఎరగనట్లే గుమ్మంలోకి వచ్చి తలుపు తట్టేడు.

కాజీ సేవకుడు వచ్చి తలుపు తీసేడు.

"ఎవరు కావాలి ?"

"కాజీగారికోసం వచ్చేను."

"కాజీగారు లేరు"

మొల్లా వదలలేదు.

"ఎక్కడికెళ్ళేరు ?"

"బజారుకి"

"వారు తిరిగి వచ్చేక ఓ మాట చెప్పు. బజారుకి వెళ్ళేటప్పుడు తమ బుర్రనికూడా తీసుకెళ్ళమంటూండు. అలా కిటికీలో వదిలేసి వీధిలోకి పడితే ఇంటికి వచ్చినవాళ్ళు, ఆయన ఇంట్లోనే వున్నారనుకుంటారు. ★

పెప్సోడెంట్ యొక్క ఇరియమ్ ప్లస్

మీ పళ్లను శుభ్రపరచి
మెరిసేలా తెల్లగా చేస్తుంది



ఎలాగో చూడండి : పెప్సోడెంట్‌లో మాత్రమే అద్భుతమైన నురుగును యిచ్చే శాస్త్రపద్ధతిలో తయారైన ఇరియమ్ ప్లస్ చేర్చబడినది. ఈ అద్భుతమైన నురుగు సమృద్ధిగా కలిగి మీ నోటిలో అన్ని మూలలకు చేరి పళ్లను శుభ్రముగా, చల్లగా, పెప్పర్‌మింట్ రుచితో ఉంచుతుంది. అంతేకాదు, మీ పళ్లను మెరిసేలా తెల్లగా చేయుటకు ఇరియమ్ ప్లస్‌కు తెల్లదనమునిచ్చే ప్రత్యేకమైన శక్తికూడ ఉంది.



హిందూస్థాన్ లీవర్
లిమిటెడ్ వారి
ఒక విశిష్టమైన తయారు

JWT HDL-3634



"అంతస్తులు"లో
జగ్గయ్య,
నాగేశ్వరరావు.

అంతస్తులు

సమీక్ష

[illegible] ఇంట్లో స్థానంకోసం, తనవారి అభిమానం కోసం తాపత్రయపడే రాణి, తండ్రికి అవసాన దశలో ఇచ్చిన మాటను నిలుపుకొనేందుకు అడకత్తెరలో చిక్కుకొన్న రఘుల అంతస్తుల మధ్య, సమాజంలో వారికుండే హోదాల మధ్యగల తారతమ్యాన్ని తెలుపుతూ, ఆరెండు ధ్రువాలకు ఒక సమన్వయం కుదిర్చిన ప్రయత్నమే జగపతివారి 'అంతస్తులు' సాంఘికం.

జమీందారు జగన్నాథరావు వివాహానికి పూర్వం కనిన కూతురురాణి పెద్దదై ఆటకత్తె అవుతుంది. వివాహానంతరం జమీందారుకు ఇద్దరు పిల్లలు కలిగినా ఆఇద్దరిలో చిన్నవాడు తండ్రి ప్రవర్తించిన తీరుచూసి, గుండె ఆగి చనిపోతాడు. పెద్దవాడు రఘు ఇల్లువిడిచి వెళ్ళి, వేలకువేల ఖర్చుతో లోకాన్ని, లోకులను తెలిసికొంటున్న స్థితిలో జమీందారుగారు రఘును రప్పించి, అతనికో చెల్లెలుందన్న సంగతిని తెలుపుతాడు. ఆసంగతి మరెవ్వరికి తెలియకూడదని కూడా చెప్పి మరణిస్తాడు.

ఆటకత్తె రాణిని ఇంటికి తీసుక వచ్చిన రఘుకు తల్లి సహకారం లభించకపోగా, విధి ఎదురవుతుంది. మరోవైపు [illegible] ప్రేయసికూడా [illegible] రేకెత్తిస్తుంది. తల్లి రూపాదేవి చూపిన అంతస్తుల వ్యత్యాసానికి సమాధానం చెప్పలేని రఘుకు అవమానమే మిగులుతుంది. తానూ ఆఇంటి ఆడపడుచుగా గుర్తింపబడాలనే రాణి ఆవేదనకు ఉపశమనం లభించదు. తనలక్ష్యసిద్ధి కోసం నాగూను వినియోగించుకొని, చివరకు వైఫల్యం తప్పని సరికాగా, నాగూను, అతనిముఠాను పోలీసులకు అప్పగించి వెళ్ళిపోతున్నస్థితిలో, రాణి సహృదయతను అందరూ గుర్తించి, ఆఇంటిలో తగిన స్థానం ఇస్తారు.

రావర్ సీతారామ్ కథ, మధుసూదనరావు అనుకరణ కలిసి చిత్రానికి తప్పకుండా కొత్తదనాన్ని చేకూర్చాయి.

పాత్రధారులంతా గట్టివారే గనుక, నటన ఎవరిమటుకు వారికి బాగుంది. కాగా, పోగా కొత్త తరహా పాత్రలో శ్రీమతి భానుమతి ప్రేక్షకులను ముగ్ధులను చేస్తుంది. నాయకుడు నాగేశ్వరరావు, నాయిక కృష్ణకుమారి సందర్భోచితమయిన నటనను ప్రదర్శించారు. గంభీరుని గుమ్మడి, జి.వరలక్ష్మి వారి "అంతస్తు"లో సజీవంగా కనిపిస్తారు. రమణారెడ్డికి, ముఖ్యంగా రేలంగికి కొత్త [illegible] కొత్తనటీనటుల పంక్తి మించాయి. పైగా వాళ్ళిద్దరినీ ఒకచోట చూడగలగటం, పరస్పరసహకారంతో ఇద్దరు కొత్త నటనను ప్రదర్శించటం ఎంతో ముచ్చటవేసింది. హాస్య సన్నివేశాలలో 'పంచ్ వర్క్' కనిపించినా, అట్టే విసుగుమాత్రం అనిపించదు. మరో కథానాయకుడున్నప్పుడు (?) పోటాపోటీ మీద నటించటం శ్రీజగ్గయ్యకు వెన్నతో పెట్టినవిద్య. మిగిలిన నటీనటుల ప్రతిభకు ఎక్కడా లోటు పోకుండా వినియోగించుకోవటం జరిగింది.

చివరి దృశ్యాలలో కొన్ని 'కబ్బురు' కనిపించినా, చిత్రం ఎక్కడా విసుగనిపించదు. పైగా, వినోదం, హాస్యం, ప్రేమ, సంగీతం సమపాళ్లలో కుదిరాయి. పాటలు అన్నీ ప్రజాదరణ తప్పకుండా పొందుతాయి. భానుమతిగారి 'దులపర బుల్లోడా' మొదలయిన పాటలు, చాలాకాలం తర్వాత ఆమె నృత్యాలను ప్రదర్శించిందన్న విశేషమూ మొదలయినవి విశేషాలే.

ముందు బెంచీల వారికి ఆనందమూ, అంతస్తుల్లో కుర్చీల మీద కూర్చునేవారికి వినోదమూ, అందరికీ కాలక్షేపమూ యీచిత్రం యొక్క విజయానికి— కథ చిత్రయాత్రకు ముఖ్య కారణాలవుతాయి.

— ప్రకాశం

రీటా హేవర్త్ ఆత్మకథ: 4



"నాకు చెరసాలలో ఉన్న
ట్లనిపించింది... మా విజయాలే
మమ్మల్ని బంధించి వేశాయి."

ప్రేమా పురుషులూ నేనూ

అప్పటికే నేను తార నయ్యాను.

కొలంబియా స్టూడియోస్‌వారు నాకున్న స్పానిష్ లక్షణాలు అన్నిటినీ పోగొట్టుకునేట్లు చేశారు. నన్నొక మాటికి నూరుపాళ్ళ అమెరికన్‌గా చేశారు.

మార్గరిటా కాన్సినో అనే పేరు తీసి రీటా హేవర్త్ అనే పేరు పెట్టారు. (మా అమ్మ పుట్టింటి పేరు హేవర్త్.)

నా నుదుటిమీద జుట్టు తగ్గించి, నా కేశాల రంగుని ఒకరకం బంగారుగా మార్చారు. మంచి ఇంగ్లీషు నేర్పారు.

'బ్లడ్ అండ్ సాండ్' లో టయిరన్ పవర్‌తో వేసే సమయానికి ఈ మార్పులన్నీ పూర్తి అయ్యాయి. తర్వాత ఫ్రెడ్ అస్టెయిర్‌తో 'యు విల్ నెవర్ గెట్ రిచ్' అనే బొమ్మలో వేశాను. స్టూడియోవాళ్లు 'కామ చిహ్నం' ప్రచారం కొనసాగిస్తూనే వచ్చారు.

1941 లో 18 రోజులు మాత్రమే నాకు తీరిక ఉండంటే నా పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకుంటారు.

ఆ ఏడు నేను మొత్తం 5000 ఫోటోలకి పోజ్ ఇచ్చాను. 23 పత్రికల అట్టమీద నా బొమ్మలు పడ్డాయి.

56 'ఫాన్' పత్రికలలో నన్ను గురించి వ్యాసాలు వచ్చాయి. 210 వార్తాపత్రిక ఇంటర్వ్యూలు ఇచ్చాను—ఆదివారాలు వెలువడే పత్రికల సంగతి అలా ఉంచి! దీన్నిబట్టి, నేను ఒక్క రోజయినా పత్రికల ఇంటర్వ్యూలు లేకుండా నిద్ర పోయానన్నా అతిశయోక్తి లేదు....

20 ఏళ్ళ అమ్మాయి కాస్త పెద్ద ప్రాముఖ్యం కల వ్యక్తి అయి కూర్చుందన్నమాట.

ఈ పరిస్థితి నే నవగాహన చేసుకున్నానని చెప్పలేను కాని, ఎంతో సరదా అనిపించింది.

ఆర్సన్ వెల్లిస్‌తో పెళ్ళి ఇంకా సరదాగానే ఉండేది. ఎం. జి. ఎం. అధిపతి లూయిస్ బి. మేయర్‌కి పుట్టినరోజు విందు చేశామొకసారి. అప్పుడు ఎందరో అతిథులు వచ్చారు. ఆర్సన్ ఒక కుందేలుని కోటుకింద దాచి తీసుకువచ్చాడు. దానికి పాటలుపాడి వినిపించాడు. జాక్ బెన్నీ ఎన్నో తమాషా కథలు చెప్పాడు. పార్టీ తెల్లవారుజాము 2 గంటలకి ముగిసింది.

ఆర్సన్ కుందేలుతో ఏదో మేజిక్‌చేసి చూపిద్దామనుకున్నాడు గాని వీలుపడలేదు. అంతేకాదు, కుందేలు అతని బట్టలు కరాబుచేసింది.

జీవితమంతా యిలా సరదాగా గడిచిపోతుందని పించేది. యుద్ధం జరుగుతోందేమో ఎప్పుడూ ఏదో హడావుడి ఉండనే ఉండేది.

ఆర్సన్‌కి నాత్సీలంటే ఎంతో ద్వేషం. స్పెయిన్‌లో ఫాసిస్టులతో పోట్లాడేవాడు. అతనికి సైన్యంలో చేరనివ్వలేదనే బాధ బాగా ఉండేది.

ఎన్నో సిఫార్సులు చేయించి, రహస్యంగా దేశం వదిలి బయటికి వెళ్ళినట్టు ఉండేవాడు. ఏవో పనులున్నాయని మాత్రం నాతో చెప్పేవాడు. కాని, అసలు సంగతి బయటపెట్టేవాడు కాదు. సైన్యం అధికారులు అతనికి శత్రువులకి సంబంధించిన మ్యాప్ లిస్టు ఏవో డాక్యుమెంట్లు చూపించేవారుట.

ఇదంతా చాలా రహస్యంగా జరిగినా ఒకసారి అతను లిస్బన్‌కి వెళ్ళినప్పుడు విమానాశ్రయంలో (హారిసన్ కార్ స్పైయర్స్ — వ్యాపారి అనే పేరు కింద వెళ్ళాడు) 20 మంది అతనికి స్వాగతం పలికి, ఆటోగ్రాఫ్‌లు ఇమ్మన్నారట !!

మా సంసారం కూడా సాఫీగా జరిగిపోయేది. నిజంగా జీవితంలో సుఖం అంటే ఏమిటో తెలుసుకున్నాను. పగలెల్లా ఇద్దరం కష్టపడి పని చేసుకునేవాళ్ళం కాని రేయినంతవరకూ ఒకరి సాంగత్యం మరొకరు కోరటం జరిగేది.

ఇంతలో నేను గర్భవతి నయ్యాను. 'టునైట్ అండ్ ఎవ్రినైట్' అనే సినిమా నేను పూర్తిచేసిన రెండు నెలలకి నా కూతురు రెబెకా పుట్టింది. ఈ సినిమా లండన్‌లో చాలా బాగా సాగిందట.

కాని ఈ సంతోషంలోనే విషాదం కూడా చవి చూశాను. మా అమ్మ పోయింది.

పై ఏడు వేసవిలో సినిమా వృత్తి మానేద్దామనుకున్నాను. నా కుమార్తె, భర్త సేవతో జీవితం గడిపేయ్యాలనుకున్నాను.

కాని ఆర్సన్ సంగతే వేరు. ఎప్పుడూ ఏదో పనిలో మునిగిపోయి ఉండేవాడు. సినిమాలు కాకపోతే మిలిటరీ పనులు! వివాహబంధం తనను బందీగా చేసి పారవేస్తోందనే భావాలు అతనికి కలిగాయి. నేను ఒంటరితనాన్ని భరించలేక మళ్ళీ సినిమా పనిలోకి దిగాలనుకున్నాను.

'గిల్డా' అనే చిత్రంలో గ్లెన్‌ఫోర్డ్‌తోపాటు వేశాను. ఇందులో నాకు మంచి డాన్స్ పాత్ర యిచ్చారు. ఈ బొమ్మతో నాకు విడిగా విశేషమయిన కీర్తి వచ్చింది.

ఆర్సన్ నన్ను తనతో యూరప్‌కి వచ్చి అక్కడ చలనచిత్రాలలో వేయ్యాలనున్నాడు. అక్కడ

"అతనెవరో నాకు తెలీదు కాని మనిషి సరదాగా వున్నట్లున్నాడు..."

చిత్రాలు అమెరికన్ నాటకప్పా బాగుంటాయని, బెజంగా మంచిపేరు గడించుకోవచ్చని చెప్పాడు.

కాని కొలంబియా కంపెనీ వారు ఒప్పుకో లేదు. వారికి నేను మంచి విలువగల 'ఆస్తి' వయిపోయాను. నేను ఎంతో చెప్పి చూశాను కాని లాభం లేకపోయింది. అప్పటికే వారి కాంట్రాక్టు ప్రకారం నేనింకా రెండు సినిమాలలో వెయ్యవలసి ఉంది. కాక్షు సారసాలలో ఉన్నట్లనిపించింది. మా విజయాలే మమ్మల్ని బంధించి వేశాయి.

అర్సన్ తన పట్టు వదల్లేదు. నేను రాకపోయినా తనొక్కడే వెళ్ళి ఫోటోలు తీసుకుంటూ వున్నాడు.

ఇక మా వివాహం నిలవదని గ్రహించాను. ఎంత అన్యోన్య దంపతులయినా కొలే ఎక్కువ కాలం విడివిడిగా ఉంటే దూరమయిపోతారు, ఒకరికొకరికి.

విడాకులు తీసుకుందామా అనుకున్నాము కాని, 'బెక్కీ' ('రెబెక్కా') కోసం మరికొన్నాళ్ళు గడిపేద్దామని నిశ్చయించుకున్నాము.

చివరికి విడాకులే ఖాయమయింది.

విడాకులకి కోర్టువారి అనుమతి వచ్చిన తర్వాత అర్సన్ ఒక ప్రతిపాదన పెట్టాడు. 'ది లేడీ ఫ్రమ్ షాంగాయ్' అనే సినిమా తీస్తున్నాడు. అను నాయక పాత్ర వేస్తున్నాడు. నాయిక పాత్రకి నేను అంగీకరించాను. చిత్రం చాలాభాగం మెక్సికోలో తీశారు.

మేకప్‌కి నా జుట్టు పొడుగు బాగా తగ్గించి వేశారు. "ఇంకా! ఇంకా!" అని అరిచేవాడు కత్తిరించటానికి వచ్చినవాళ్ళతో.

షూటింగ్ జరిగేప్పుడు, "నా ఏక్టింగ్ ఎలా ఉందో చెప్పు!" అని కోరేవాడు. నేను బాగా లేదంటే మళ్ళీ చేసేవాడు.

మా ఇద్దరిమధ్య స్నేహం చెడిపోలేదు.

ఒకరాత్రి నేను నిద్రపోతున్నాను. ముఖం మీద ఫ్లాష్ బల్బు వెలిగిన శబ్దానికి నిద్ర మేలుకున్నాను.

మర్నాడు సంగతి తెలిసింది. అర్సన్‌కి కెమెరామాన్ ఫోటోలకి వాలం వచ్చిందట. నిద్రలో కూడా నా ఫోటో బాగుంటుందన్నారుట ఆర్టర్. ఉందన్నారుట అర్సన్. పందెం వేసుకున్నారుట.

ఫోటో డెవలప్ చేసిన తర్వాత అర్సన్ డబ్బులు ఇచ్చుకున్నాడు! "అసలు నేను ఓడిపోతానని నాకూ తెలుసు," అన్నాడు నాతో. "ఎప్పుడు అందంగా లేవు?"

తన మాజీ భార్యని ఏ మాజీ భర్త ఇంతకంటే పొగడగలడు? అర్సన్ అంటే నాకు ఇప్పుడు కూడా చాలా గౌరవం. మా ఇద్దరిమధ్య స్నేహమూ అసలు చెడిపోలేదు.

అసలు విడిపోయిన భార్యాభర్తలు స్నేహంగా ఉండకూడదని నా నమ్మకం. లేక పోతే వారి పిల్లల గతేమిటి?

మా ఇద్దరిమధ్య ప్రేమ నశించింది. కాని ఆయన కూతురుకి తల్లి నయ్యాననే గర్వం నాకు మిగిలింది.

ఆయన ప్రధానమూ కానప్పు. నాకు యూరోప్‌లో ఒక సినిమాలో నటించాలనే అభిలాష తగ్గలేదు. మా స్టూడియోవాళ్ళతో యూరప్‌లోగాని, మరెక్కడగాని ఒక చిత్రం నిర్మించమని పోరుతూ వచ్చాను.

ఇలా ఉండగా ఒకసారి నాకు యూరోప్ వెళ్ళి వచ్చే అవకాశం కలిగింది. ఒక స్నేహితురాలితో ప్రయాణం చేశాను. యూరోప్ నన్ను నిజంగా

పార్టీలో నా పక్కన ప్రిన్స్ అలీఖాన్ అనే ఒక యువకుడు కూర్చొనటం సంభవించింది.

అత నెవరో నాకు తెలీదు. అతి మిని అతను, నవ్వుకున్నట్లు కనిపించాడు. కాని, మనిషి చాలా సరదాగా ఉన్నట్లు తోచాడు. పార్టీ ముగిసిన తర్వాత ఇద్దరం కలిసి వెళ్ళాం. ఇంకొక చోటికి వెళ్ళి 'షాంపేన్' తాగాము, డాన్సు చేశాము.



"షైర్ బాక్ విల్లో" చిత్రంలో విచిత్రమైన అలంకరణతో రీటా హేవర్త్.

కదిలించివేసింది. ఎంతో మనోహరంగా కనిపించింది.

లండన్‌లో "టువెల్వ్ అండ్ ఎ్రికి నైట్" తో బాటు నేను పోలంలో ప్రేక్షకురాలి దర్శించాను. పారిస్‌లో 'గిల్డా' చిత్రం మొదటి ఆటకి వెళ్ళాను. పారిస్‌లో నాకు హఠాత్తుగా జ్వరం వచ్చింది. ఆస్పత్రిలో చేరవలసి వచ్చింది. రక్తం కూడా ఎక్కించారు, అక్కడ.


రివియరాలో విశ్రాంతి తీసుకోమన్నారు. అక్కడ ఎల్సామాక్స్‌వెల్‌ని కలిశాను. అక్కడికి అక్కడ ఉన్న ఒక పార్టీకి తీసుకువెళ్ళింది.

ప్రిన్స్ అలీతో డాన్సు చేస్తున్నప్పుడే అతని గురించి తెలుసుకున్నాను, ఆయన చాలా గట్టివాడూ, పెద్దమనిషి వాడూ కూడా అనుకున్నాను. పురుషునిలో ఇంతకన్నా మంచి కలయిక ఉంటుందా?

నన్ను హోటల్‌లో దింపివేస్తున్నప్పుడు మర్నాడు మధ్యాహ్నం కలుద్దామని నిశ్చయించుకున్నాము.

నాకు అప్పటికి తెలియదు కాని, నా జీవితంలో మరొక సంతోషంతో నిండిన ఘట్టం ప్రారంభం అవుతోందని.

(సశేషం)



అమర్ కోశ్
కావాలంటున్నాడు.
ఆ వస్తాదు।
ఆ నాటి కార్యక్రమం పూర్తి అయింది.
అమర్ కోశ్ అవసరం.
అమర్‌కోశ్
కల్తీలేని గ్లూకోస్ పొడి
తయారు చేయువారు:
అమర్‌చంద్ శోభచంద్,
మద్రాసు-1.
AMARCOSE
BRAND
PURE GLUCOSE POWDER
BEST FOOD QUALITY
AMARCHAND SOBACHAND

చిత్రలహరి

దేవత

రేఖా అండ్ మురళి ఆర్ట్స్ వారి "దేవత" చిత్ర నిర్మాణం ముగిసింది. రీ రికార్డింగ్ పూర్తి అయి విడుదలకు సన్నాహాలు సంతరించుకొంటున్నది. ఎన్. టి. రామారావు, సావిత్రి, పద్మనాభం, గీతాంజలి, బాలకృష్ణ, రాజబాబు, నాగేష్, వాణిశ్రీ, కోళ్ళ సత్యం, వల్లం నరసింహారావు మొదలయినవారు నటించారు. కథ, మాటలు : పింగళి, పాటలు : పింగళి, కొసరాజు, పాలగుమ్మి పద్మరాజు, శ్రీశ్రీ వ్రాశారు. సంగీతం : కోదండపాణి, కళ : బి. ఎన్. కృష్ణ, కెమెరా : ఎం. జి. సింగ్, దర్శకత్వం : కె. హేమాంబరధరరావు, నిర్మాత : పురుషోత్తం, నిర్వహణ : పద్మనాభం.

ప్రమీలార్జునీయము

ఎమ్. ఆర్. మూవీస్‌వారి "ప్రమీలార్జునీయము" చిత్ర నిర్మాణం పూర్తి అయింది. యన్. టి. రామారావు, బి. సరోజాదేవి, కాంతారావు, శోభన్ బాబు, బాలకృష్ణ, పద్మనాభం, రేలంగి, గిరిజ, ఛాయాదేవి, వాణిశ్రీ, రాజశ్రీ, బుష్పేంద్రమణి, కోళ్ళ సత్యం మొదలయినవారు నటించారు. రచన : పింగళి నాగేంద్రరావు, సంగీతం : పెండ్యాల, కళ : గోఖలే, కె. ఆర్. ప్రభాకర్, నిర్మాతలు : కె. నాగమణి, ఆదిబాబు. ఈ చిత్రం బహుశా జూన్ 11 న విడుదలవుతుందని దర్శకులు శ్రీ ఎం. మల్లికార్జున రావు ఇటీవల తెలియజేశారు.

స్టూడియోలో సందడి

వినస్ స్టూడియో ఈమధ్య కళకళలాడుతున్నది. పెద్ద తారలతో స్టూడియో అంతా సందడిగా ఉంటున్నది. చిన్ని బ్రదర్స్‌వారి "పతి సక్కుబాయి" శివశక్తి మూవీస్‌వారి "రాజభక్తి", ఆలయ ఫిలిమ్స్ వారి "నీలునావా", శ్రీ దేవి ప్రొడక్షన్స్‌వారి "పరమానందయ్య శిష్యుల కథ" చిత్రాల షూటింగులు ఇప్పుడు ఈ స్టూడియోలో జరుగుతున్నవి.

* * *

తెలుగు నటి శారద నటించిన మళయాళ చిత్రం "ఇన ప్రావుకల్" (రెండు పావురాలు) కేరళ అంతటా విజయవంతంగా నడుస్తున్నది. ఇప్పుడామెకు మళయాళ చిత్రాల్లో మంచి మార్కెట్ వున్నది. జనతా ప్రొడక్షన్స్ బేనర్‌మీద ప్రసిద్ధ కెమెరామన్ విన్సెంట్ నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తున్న మళయాళ చిత్రంలో శారద కథానాయికగా నటిస్తున్నది. ఇదిగాక మరో రెండు చిత్రాలు ఆమెకు ఉన్నవి. మళయాళ చిత్రాల్లో శారద పేరేమిటి "రాధిక."

రాజశ్రీకి స్వగృహం

వర్ధమాననటి రాజశ్రీ కష్టపడి, కృషిచేసి పైకి వచ్చింది. వచ్చిన అవకాశాలను చక్కగా వినియోగించుకొని, నిలద్రొక్కుకుని నటిగా ఖ్యాతి స్థిరపడింది. ఇప్పుడు ఆమె పెక్కునిమిది చిత్రాల్లో నటిస్తున్నది. ఉండేందుకు అన్ని వసతులతో కూడిన చక్కని ఇల్లు ఒకటి నిర్మించుకోవాలనే ఆలోచన చిరకాలంగా కుమారి రాజశ్రీకి ఉన్నది. త్యాగరాయ నగర్‌లోని జి. యన్. చెట్టి రోడ్‌లోగల పెటి పుష్పవల్లి ఇంటి స్థలాన్ని ఇటీవలనే ఆమె వాలుగు గ్రౌండ్స్ కొన్నది. వచ్చే యేడాదికి అక్కడ ఆమె స్వగృహం నిర్మింపబడుతుంది.

పల్నాటి వీరకథ

బాలచంద్రుడు పుట్టినరోజు వేడుకలు, జ్యోతిష్కులు చక్రంవేసి బాలచంద్రుని జాతకం అరిష్టాన్ని సూచిస్తున్నదని చెప్పడం— వారి పలుకులు విని బ్రహ్మనాయుడు కలవరపడడం — ఐతాంబ క్షోభించడం మొదలయిన దృశ్యాలను దర్శకులు శ్రీ జి. విశ్వనాథం మే 20, 21 తేదీలలో విజయా స్టూడియోలో చిత్రీకరణ జరిపారు. బ్రహ్మనాయుడిగా యన్. టి. రామారావు, ఐతాంబగా అంజలీదేవి నటిస్తున్నారు. భానుమతి, వాసంతి, జమున, ఎల్. విజయలక్ష్మి, ఛాయాదేవి, గుమ్మడి, నాగభూషణం, కాంతారావు, రాజనాల, బాలయ్య తారాగణంతో ముఖ్యులు. రచన : సదాశివబ్రహ్మం, సంగీతం : యస్. రాజేశ్వరరావు, కళ : గోఖలే, అసోసియేట్ : కె. ఆర్. ప్రభాకర్, కెమెరా : పి. నాగేశ్వరరావు, నిర్మాతలు : వై. లక్ష్మయ్య చౌదరి, టి. హనుమంతరావు, డి. సూర్యనారాయణ.

సతీ సక్కుబాయి

చిన్ని బ్రదర్స్‌వారి "సతీసక్కుబాయి" చిత్రానికి యింతవరకు రెండు సెట్స్‌పైన పని జరిగింది. ఆరు రీళ్ళ చిత్రం తయారయింది. అంజలీదేవి, యస్. వి. రంగారావు, గుమ్మడి, కాంతారావు, రేలంగి, గిరిజ, అనురాధ ప్రధాన పాత్రధారులు.



'ఆ కాశ రామన్న'లో కాంతారావు, ఎల్. విజయలక్ష్మి.





'జ్వాలాద్వీప రహస్యం'లో కృష్ణకుమారి.

చిత్రలహరి

కథ: సముద్రాల (సీనియర్) సంగీతం: ఆదినారాయణరావు, ఆట: నాటి, కెమెరా: కమల్ ఘోష్, దర్శకత్వం: వేదాంతం రాఘవయ్య, నిర్మాత: పి. చిన్నారావు.

స్వప్న రేఖ

హైదరాబాదులోని 'ఇండియా మూవీస్' అను నూతన సంస్థ తమ తొలి సాంఘిక చిత్రానికి "స్వప్నరేఖ" అని నామకరణం చేశారు.

ఈ చిత్రం త్వరలో హైదరాబాదులో ప్రారంభం కానున్న "సారథి మూవీటోన్" స్టూడియోలో నిర్మించబడుతుంది.

అందరూ నూతన నటీనటులతో నిర్మించబడే ఈ చిత్రానికి పాటలు శ్రీ ఆరుద్ర, సంగీతం: శ్రీ జి. కె. వెంకటేష్, కెమెరా: శ్రీ దొరై నిర్వహిస్తున్నారు.

జూలై నెలలో సెట్సుకు పోనున్న ఈ చిత్రాన్ని అక్టోబరులో విడుదల చేయాలని నిర్మాతల సంకల్పం.

"అక్కచెల్లెళ్ళు", "బావమరదళ్ళు" చిత్రాల ద్వారా ఆంధ్ర ప్రేక్షకులకు సుపరిచితులైన శ్రీ పద్మనాభరావు ఈ చిత్రానికి రచన, నిర్మాణం, దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

పాదుకాపట్టాభిషేకం

అమరావతి చిత్ర వారి "పాదుకాపట్టాభిషేకం" చిత్రం ఇంతవరకు ఆరు రీళ్లకు పైగా పూర్తి అయింది. శ్రీరాముడిగా కాంతారావు, లక్ష్మణుడిగా శశికాంత్, భరతుడిగా బాలయ్య, శత్రుఘ్నుడిగా నాగరాజ్, దశరథుడిగా ధూళిపాళ, వశిష్ఠుడిగా కె. వి. ఎస్. శర్మ, సీతగా కృష్ణకుమారి, ఊర్మిళగా జయంతి, కౌసల్యగా మాలతి, సుమిత్రగా విద్యావతి

(సంధ్య సారం), ప్రత్యేకంగా తిలకాన్ని నటిస్తున్నారు. కథాటలు, పాటలు, పద్యాలు : పద్మావతి, సంగీతం : ఘంటసాల, కళ : ఘొరొడేగాంకర్, ఎడిటింగ్ : మాణిక్యం, కెమెరా : వెంకట్ వారణాసి, దర్శకత్వం: కొవ్వూరి సూర్యకుమారరెడ్డి. ఈ చిత్రం సిటాడెల్ స్టూడియోలో నిర్మింపబడుతున్నది.

పిలునామా

"ఏమిటుగ ఏదో ఉంది, ఏమో తెలియకవుంది
ప్రపంచం తమ్మి లోకం అంత, గిరగిర తిరుగుతు
ఉంది."

రాజేశ్వరరావు కూర్చనలో కోర్చాస్తారు. రెండు పెట్టుపైన పని పూర్తిచేశారు. ఇది అపరాధ పరిశోధక చిత్రం. ఇంతకుముందు ఇలాంటి చిత్రం రాలేదని, ఆద్యంతమూ ఖీతి కలిగించే సంఘటనలు, కనులకు ఇంపు అయిన దృశ్యాలు, చక్కని సంగీతం ఈ చిత్రంలో పుష్కలంగా ఉన్నాయని రషెస్ చూసినవారు అంటున్నారు. నిర్మాతలు : యం. కె. రెడ్డి, టి. వి. రెడ్డి, ప్రొడక్షన్ ఇన్‌చార్జి, ఎస్. వి. కృష్ణ, సహాయ దర్శకులు : వి. లక్ష్మీనారాయణ, కె. గోపాలకృష్ణ, కెమెరా : ఎం. జి. సింగ్.



"పిలునామా"లో కృష్ణకుమారి.

విహారియైన యీ గీతం కొసరాజు వ్రాయగా అశ్వత్థామ సంగీత దర్శకత్వంలో మాధవపెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు పాడగా, మే 24 న పద్మనాభం, గీతాంజలి, చదలవాడ కుటుంబరావు, ప్రభృతులపై చక్కగా చిత్రీకరణ జరిపారు. దర్శకులు శ్రీ కె. హేమాంబరధరరావు. ఇటీవల పది రోజులపాటు జరిగినది షెడ్యూలు. ఇందులో అక్కినేని కృష్ణకుమారి, ప్రభాకరరెడ్డి, పి. హెచ్.

పరమానందయ్య శిష్యుల కథ

ఈ చిత్రం షూటింగు మొదటి షెడ్యూలుపైన పని మే 10 నుంచి 15 వరకు జరిగింది. రెండు పాటలు చిత్రీకరణ జరిపారు. కె. ఆర్. విజయ, శోభన్‌బాబు, కొత్త నటి లక్ష్మీదేవి ప్రభృతులు పాల్గొన్నారు. చిత్రీకరణ జరిపిన రెండు పాటలూ హృద్యమంగా ఉన్నవి. మొదటిది : "శంభో శంకర

చిత్రలహరి

జగత్కారణ" ఘంటసాల—బృందం పాడినది రెండవది : "ఓ మహాదేవ, సీవదాసీవ" పి. సుశీల పాడినది. ఈ రెండూ సదాశివబ్రహ్మం రచనలు. ఆయన వ్రాసినదే మరొకటి, యుగళగీతం జానకి, ఘంటసాలలు ఆలపించినది, రికార్డు చేశారు. చిత్రంలో ఎన్. టి. రామారావు, ఎల్ విజయలక్ష్మిలపై చిత్రీకరిస్తారు.

ప్రచండభైరవి

జయభేరి పిక్చర్స్‌వారి జానపద చిత్రం "ప్రచండ భైరవి" నిర్మాణం గోల్డెన్ స్టూడియోలో త్వరితగతిన సాగుతున్నది కాంతారావు, రాజసులోచన, బాలయ్య, రాజనాల, సత్యనారాయణ, బాలకృష్ణ, రాజ్ బాబు, కె. వి. ఎస్ శర్మ, కోటేశ్వరరావు మున్నగువారు నటిస్తున్నారు కథ ఎస్ ఆర్ రాజా



'దేవత'లో మాస్టర్ మురళి.

మాటలు, పాటలు : ఆరుద్ర, సంగీతం : పెండ్యాల, కెమెరా: డి. పి. దత్, దర్శకత్వం : సి. ఎస్. రావు, నిర్మాతలు : టి. రంగారావు, టి. త్రివిక్రమరావు.

సింగపూర్ సి. ఐ. డి.

శ్రీనివాస్ మూవీస్‌వారి ఈస్ట్‌మన్ కలర్ అపరాధ పరిశోధక చిత్రం "సింగపూర్ సి. ఐ. డి" విడుదలకు తుది మెరుగులు దిద్దుకొంటున్నది బి సరోజాదేవి, జానకి, శివాజీగణేశన్, నాగేష్, మనోరమ ముఖ్య నటీనటులు మాటలు, పాటలు . ఆరుద్ర, సంగీతం విశ్వనాథం, రామ్మూర్తి, కళ · గంగా, నృత్యాలు తంగప్పన్, ఎడిటింగ్ బి గోపాలరావు, దర్శకత్వం · దాదా మిరాసి, కెమెరా : కె. ఎస్ ప్రసాద్ నిర్మాతలు : యర్రా కన్నయ్య, సూరవరపు భాస్కరరావు. "కన్నె పెదవి ముద్దులొలికె", "పాత జ్ఞాపక మేదో పలుకరించెను గుండెలో" అన్న పాటలు బహుళ జనాదరణ పొందుతవి. ఈ రెండు పాటలూ సుశీల తన కమ్మని కంఠంతో, హృదయాలను కదలించేవిధంగా పాడినది అద్భుతమైన సస్పెన్స్‌తో కొత్త విధానంతో రూపొందించిన యీ చిత్రం

ఆంధ్రలో శ్రీ ఫిలింస్ వారి ద్వారా విడుదల అవుతుంది.

శ్రీ కృష్ణపాండవీయం

"చాంగురే, చాంగు చాంగురే బంగారు రాజా
మజ్జారె మగరేడ, మత్తయిన వగకాడ
అయ్యారె, నీకే మనసివ్వాలని ఉందిరో"—

నారాయణరెడ్డిగారి గీతంలోని మత్తు, మాధుర్యము లను తన గొంతులోన నింపుకొని నిండుగా ఆలపించినది జిక్కి (కృష్ణవేణి) దానిని అందంగా మలచినది సంగీత దర్శకుడు టి.వి. రాజు. ఈ గీతం ఎన్. ఏ. టి. వారి "శ్రీకృష్ణ పాండవీయం" చిత్రంలోనిది. గతనెల మొదటి భాగంలో వాహినీలోని జనరల్ ఫ్లోర్‌లో హిడింబి, భీములపై చిత్రీకరించారు. దర్శకులు శ్రీ ఎన్. టి. రామారావు. హిడింబిగా కుమారి రత్న చాలా గ్లామరస్‌గా ఉంది. పాటకు అను గుణముగా చక్కని అభినయము కనబరచినది. భీమునిగా ఉదయకుమార్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో సి. నారాయణరెడ్డి ఇదిగాక, మరొక గీతం వ్రాశారు. మిగిలిన పాటలు, పద్యాలు సముద్రాల రాఘవాచార్య వ్రాశారు.

—మోహన్‌కుమార్ ★

హైకోర్టు

సిగరెట్లు



నిరుపమాన నాణ్యం

తయారు చేయువారు

ది వజీర్ సుల్తాన్ టొబాకొ కంపెనీ లిమిటెడ్

హైదరాబాద్ (ఆంధ్ర ప్రదేశ్)

వార్తలు-విశేషాలు

నవలా సమీక్ష పోటీ

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ధారావాహినిగా ప్రచురించబడిన "హృదయ కుసుమాలు" అను నవలపై మేము నిర్వహించిన నవలా సమీక్ష పోటీలో ఈ క్రింది వారిద్దరూ బహుమతులు పొందినారని తెలుపుటకు సంతసించుచున్నాము.

(1) మొదటి బహుమతి రూ. 116/— శ్రీమతి అడుసుమిల్లి స్వరాజ్యలక్ష్మి, కృష్ణలంక, విజయవాడ—2.

(2) ద్వితీయ బహుమతి రూ. 50/— శ్రీ ధర్మవరపు లక్ష్మీనారాయణ, దుద్దుకూరు ఒంగోలు తాలూకా.

బి. ఎస్. ఆర్. కృష్ణారావు
ప్రొప్రయిటర్, సుబ్బరాయ పబ్లికేషన్స్.

కళాప్రియ

ఎన్. టి. రామారావు అభినందన సంచిక—కళాప్రియ మొదటి సంచిక మా కార్యాలయం చేరింది. ఇందులో ఎన్. టి. రామారావు కళాప్రియత్వమును గూర్చి పలువురు సినీ ప్రముఖులు రూపొందించిన రచనలు, ఆయన ధరించిన వివిధ పాత్రలను కళ్లకు కట్టినట్లు చూపే చిత్రాల స్టిల్స్ ముఖ్యాకర్షణలు. ఇది మాస పత్రికగా వెలువడుతుంది. వెల—75 పైసలు, కాపీలకు: కళాప్రియ, మద్రాసు—24.

* * *

రాజోలులోని పి. ఆర్. ఫిలిమ్స్ వారిద్వారా "లూటేరా" ఈస్ట్‌మన్ కలర్ హిందీ చిత్రము ఆంధ్రప్రాంతములోనూ "నమస్తేజీ" హిందీ చిత్రము మైసూరు ప్రాంతములోనూ విడుదల కాబోవుచున్నవి.

జంషెడ్‌పూర్‌లో శ్రీ గుమ్మడికి సన్మానం

ఇటీవలనే శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీ ధూళిపాళ సీతారామశాస్త్రిగారలకు ఆంధ్ర నాటక సాహిత్య సంఘమువారు వారి సంఘ ఆవరణలో బహిరంగ సమావేశమున సన్మానం చేశారు. అతి మనోహరముగా అలంకరించబడిన సంఘఆవరణ వేలాది ఆంధ్రులచే నిండినది.

శ్రీ గుమ్మడి, సంఘము చేయుచున్న విద్య, నాటక, సాంస్కృతిక కార్యక్రమాలను కొనియాడి అందరును తగు రీతి తోడ్పడి వారి కృషికి దోహదం చేయాలని అన్నారు. చిత్రసీమలో తమ అనుభవాలను సభవారికి తెలియచేశారు.

శ్రీ ధూళిపాళ మాట్లాడుతూ శ్రీ గుమ్మడితో తనకు సన్మానం చేయడం తనను ఆశీర్వదించడమేనని చెప్పారు. శ్రీ గుమ్మడి ప్రతిభా విశేషాలు, వారి ఉదార గుణాలను ప్రస్తావించారు.


సంఘ సభ్యులు శ్రీ గుమ్మడి సమక్షంలో ఒక నాటిక ప్రదర్శించారు. శ్రీ ధూళిపాళ మయ సభలో దుర్యోధనపాత్ర అభినయం చేశారు. ఈ ప్రదర్శన జంషెడ్‌పూర్ ఆంధ్రుల కోరికపై జరిగినది. అత్యంత జయప్రదం అయిన ప్రదర్శనతో సభ ఒకట్లి

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7 Thambuchetty Street Madras-1. Phone: 29766 & 23713. Chief Editor S. Sambhu Prasad.



'జ్వాలాద్వీపరహస్యం'లో కాంతారావు, కృష్ణకుమారి.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.



శ్రీకాంత్

మృదుత్వానికి, మెరపుగొలుపు
కాంతివంతమైన కేశసౌందర్యానికి

రెమీ
బ్రిల్లైన్ టైన్
ఉపయోగించండి

CRITERION RP. 590